www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



తుది కీ విడుదల.. గంటలోపే తొలగింపు!

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గందరగోళం

ఎలాంటి ప్రకటనా చేయని ఎన్టీఏ.. విద్యార్థుల్లో ఆందోళన

2

శుక్రవారం | 18-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 2 | శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: పంచమి సా.5.08 తదుపరి షష్ఠి, నక్షత్రం: జ్యేష్ఠ ఉ.8.21 తదుపరి మూల, వర్జ్యం: సా.5.01-6.45, దుర్ముహూర్తం: ఉ.8.30-9.20, మ.12.39-1.29, అమృతఘడియలు:: తె 3.25-5.09, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.00, సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వర్గీకరణకు జై డీఎస్సీకి సై

ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ

20 లేదా 23న నోటిఫికేషన్?

- అమల్లోకి వచ్చిన వర్గీకరణ
- కేబినెట్ తీర్మానించిన రెండు రోజుల్లోనే గవర్నర్ ఆమోద ముద్ర
- డీఎస్సీ నోటిఫికేషన్‌కు మార్గం సుగమం
- 16,347 టీచరు పోస్టుల భర్తీకి శ్రీకారం
- నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజులకు పరీక్షలు
- వయోపరిమితిలోనూ అభ్యర్థులకు ఊరట
- 42 నుంచి 44 ఏళ్లకు పెంపు
- స్పెషల్ ఎడ్యుకేషన్ కింద 2,260 పోస్టులకు విడిగా విడుదల కానున్న ప్రకటన





అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేసింది. దీనిపై ఆర్డినెన్స్ జారీ అయింది. ఎస్సీ కులాలను మూడు కేటగిరీలుగా విభజిస్తూ, దానికి అనుగుణంగా రిజర్వేషన్లను పంచే 'వర్గీకరణ'పై గురువారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఇది వెంటనే అమలులోకి వచ్చినట్లుగా ప్రకటించారు. దీంతో... మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి మార్గం సుగమమైంది. ఈనెల 20 లేదా 23వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చేందుకు వీలుగా కసరత్తు జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్ ముసాయిదాకు రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీనిపై త్వరలోనే ఆర్డినెన్స్ జారీ చేస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీనిని వెంటనే గవర్నర్ ఆమోదానికి పంపింది. గురువారమే గవర్నర్ దీనిపై ఆమోద ముద్ర వేశారు. 'ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ - 2025' జారీ చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున, వర్గీకరణను వెంటనే అమలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినందున ఆర్డినెన్స్ జారీచేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం గ్రూప్-1 కేటగిరీకి చెందిన రెల్లి, 12 ఉపకులాలకు ఒక శాతం... గ్రూప్-2కు చెందిన మాదిగ, 18 ఉప కులాలకు 6.5 శాతం... గ్రూపు-3కు చెందిన మాల, 29 ఉప కులాలకు 7.5 శాతం చొప్పున, మొత్తం 15 శాతం రిజర్వేషన్ కేటాయిస్తారు. మూడు ఎస్సీ గ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని

మిగతా 13వ పేజీలో...

స్కూళ్ల స్వరూపం మారెన్!

- 9,200 మోడల్ ప్రైమరీ స్కూళ్లు
- అందులో ప్రతి తరగతికి ఒక టీచర్
- బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 19 వేలు
- 1,557 ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతులు
- పాఠశాల విద్యా శాఖ నిర్ణయం

13

మంగళగిరి ఎయిమ్స్‌కు 534 పోస్టులు

భర్తీకి కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశం

12

పాస్టర్లకు 7 నెలల గౌరవ వేతనం విడుదలకు ఓకే 14

జీవిత ఖైదీలకు శుభవార్త

సత్ప్రవర్తన కలిగిన వారి విడుదలకు ఉత్తర్వులు

2



వక్ఫ్ ఆస్తుల జోలికెళ్లం!

బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో నియామకాలూ చేపట్టం

- తదుపరి విచారణ వరకు యథాతథ స్థితి
- సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం వెల్లడి
- కొత్త చట్టంపై స్టే ఇవ్వొద్దని అభ్యర్థన
- అంగీకరించిన ధర్మాసనం
- అభ్యంతరాలపై జవాబిచ్చేందుకు వారం గడువు
- ప్రభుత్వ కౌంటర్‌పై తర్వాతి ఐదు రోజుల్లో రిజాయిండర్లు వేయాలని పిటిషనర్లకు ఆదేశం
- విచారణ మే 5వ తేదీకి వాయిదా
- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై ఆ రోజున నిర్ణయం తీసుకుంటామని వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లబోమని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. వక్ఫ్ సవరణ చట్టంపై ఎలాంటి స్టే ఇవ్వొద్దని అభ్యర్థించింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా నమోదైన పిటిషన్లపై, సుప్రీంకోర్టు లేవనెత్తిన అభ్యంతరాలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కోరింది. దీనికి అంగీకరించిన కోర్టు.. తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

వక్ఫ్ సవరణ చట్టంలోని పలు సెక్షన్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో 72కుపైగా పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. వాటిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. అయితే పిటిషన్లలో లేవనెత్తిన అభ్యంతరాలు, ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలపై సమాధానం ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. ఈ క్రమంలో వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయకుండా, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర కౌన్సిల్‌లో సభ్యులుగా నియమించకుండా చట్టంలోని ఆయా సెక్షన్లపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం సిద్ధమైంది. దీనిని సొలిసిటర్ జనరల్ వ్యతిరేకించారు. పార్లమెంటులో విస్తృతంగా చర్చించి, మెజారిటీ సభ్యుల ఆమోదంతో కేంద్రం వక్ఫ్ సవరణ చట్టం చేసిందని.. ప్రభుత్వ వాదనలు వినకుండా స్టే ఇవ్వడం సరికాదని వాదించారు. ప్రైవేటు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించారంటూ దేశవ్యాప్తంగా లక్షల కొద్దీ విజ్ఞప్తులు రావడం వల్లే పార్లమెంటు వక్ఫ్ చట్టాన్ని సవరించిందని వివరించారు. కేవలం ఆయా సెక్షన్లను పైపైన చదివి చర్యలు

మిగతా 2వ పేజీలో...



యంగ్ గ్లోబల్ లీడర్‌గా రామ్మోహన్‌నాయుడు

- వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ జాబితాలో స్థానం
- భారత్ నుంచి మొత్తం ఏడుగురికి చోటు
- ఇదొక గొప్ప గౌరవం: కేంద్ర మంత్రి రామ్మోహన్
- తెలుగువారు గర్వించదగ్గ సమయం: చంద్రబాబు

13



ఎంత దూరం వెళితే.. అంతే టోల్ చార్జీ!

- మే 1వ తేదీ నుంచే
- జీఎన్ఎస్ఎస్ ఆధారిత విధానం
- ఫాస్టాగ్ లేకుండా టోల్ వసూలు
- తొలుత వాణిజ్య వాహనాలకు
- 2027 నుంచి వ్యక్తిగత వాహనాలకు

2



రాజధానిలో అసెంబ్లీ, హైకోర్టు శాశ్వత భవనాల టెండర్లు ఖరారు

- రూ.617 కోట్లతో అసెంబ్లీ ఎల్ అండ్ టీకి
- రూ.786 కోట్లతో హైకోర్టు ఎన్‌సీసీకి
- మున్సిపల్ శాఖ ఆదేశాలు

2

జగన్ అక్రమాస్తుల కేసులో..

దాల్మియా సిమెంట్ ఆస్తులు జప్తు

- వాటి విలువ రూ. 793 కోట్లు: ఈడీ
- రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా..
- భారతీ సిమెంట్స్‌లో అడ్డగోలుగా పెట్టుబడి
- రూ.94 షేరు 1,441కి కొనుగోలు
- అలా 2 లక్షల షేర్లు కొన్న దాల్మియా
- దీని వెనుక మనీలాండరింగ్ ఉందన్న సీబీఐ
- అవే అభియోగాలతో ఈడీ తాజా చర్య

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో దాల్మియా భారత్ సిమెంట్ లిమిటెడ్ (డీబీసీఎల్)కు చెందిన రూ.793.34 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. హైదరాబాద్‌లో ఉన్న డీబీసీఎల్ భూమిని ప్రొవిజనల్ ఎటాచ్‌మెంట్ చేశామని, గతంలో ఆ కంపెనీ రూ.377.26 కోట్లతో ఆ భూమిని కొనుగోలు చేసిందని ఈడీ వెల్లడించింది. జగన్మోహన్‌రెడ్డికి చెందిన భారతీ సిమెంట్స్‌లో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడులపై 2011లో సీబీఐ కేసు నమోదు చేసిందని, ఆ కేసు ఆధారంగా డీబీసీఎల్ ఆస్తుల జప్తునకు ఆదేశాలిచ్చామని తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా

మిగతా 12వ పేజీలో...



12

మిథున్‌రెడ్డికి మరో నోటీసు

- రేపు రావాలని సిట్ పిలుపు
- విచారణకు సాయిరెడ్డి గైర్హాజరు
- నేడు వస్తానని సమాచారం
- అజ్ఞాతంలోనే రాజ్ కసిరెడ్డి..
- సిట్ ముందుకు ఆయన తండ్రి
- కొడుకు గురించి ఏమడిగినా తెలియదన్న ఉపేందర్‌రెడ్డి
- నేడు మరోసారి విచారణ
- ముడుపులిచ్చిన మద్యం వ్యాపారులనూ నేడు, రేపు ప్రశ్నించనున్న అధికారులు



గోశాల ముందు మోహరించిన పోలీసులు

గోశాలపై గోల!

- ప్రదర్శనగా బయలుదేరిన భూమన
- నేతలు మాత్రమే రావాలన్న పోలీసులు
- రోడ్డుపై పడుకుని భూమన నిరసన
- 'నిర్బంధం' అంటూ హడావుడి
- పోలీసుల నిబంధనలు పాటిస్తూ గోశాలకు వెళ్లిన కూటమి నేతలు
- తమలాగే రావాలని భూమనకు ఫోన్
- మళ్లీ బల ప్రదర్శనకు వైసీపీ ప్రయత్నం
- తిరుపతిలో రోజంతా హైడ్రామా

తిరుపతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో ఆవుల మృతిపై అటు వైసీపీ, ఇటు కూటమి నేతల మధ్య 'సవాళ్లపర్వం' నడిచింది. దీనిపై గురువారం తిరుపతిలో హైడ్రామా నెలకొంది. పోలీసుల సూచన మేరకు కూటమి నేతలు మాత్రమే గోశాల సందర్శనకు వెళ్లగా... టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మందీ మార్బలంతో ప్రదర్శనగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎస్వీ గోశాలలో వందకు పైగా గోవులు చనిపోయాయంటూ భూమన ఆరోపించడంతో... గోశాలకు వచ్చి చూడాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సవాల్ విసిరారు. దీనికి స్పందించిన భూమన తాను గురువారం వస్తానని ప్రకటించగా, దీనిని కూటమి నేతలు స్వాగతించారు. అయితే... 'ఒకేసారి రెండు పార్టీల

మిగతా 13వ పేజీలో...



టారిఫ్‌ను సవరించం

యూనిట్ రూ. 2.49కు ఇవ్వాల్సిందే 13

సెకీకి కేంద్ర విద్యుత్ మండలి స్పష్టీకరణ

సుప్రీంకోర్టుకు ఆ అధికారం

అణు క్షిపణిలా..



- ప్రజాస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఆర్టికల్ 142 అధికారాలు
- రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఎలా నిర్దేశిస్తుంది?
- ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో దొరికిన నగదుపై దర్యాప్తు ఏమైంది?
- ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు కాలేదు?
- జడ్జీలు అతీతమా?
- చట్టాలు చేసేది వారే.. అమలు చేసేది వారే.. వారే సూపర్ పార్లమెంట్ అన్నట్టు పరిస్థితి ఉంది
- ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ సంచలన వ్యాఖ్యలు

2

మతమార్పిడిలో విషాదం

- బాప్టిజం తీసుకుంటూ నదిలో మునిగి ఇద్దరు మృతి
- మరో ముగ్గురిని కాపాడిన స్థానికులు
- బాపట్ల జిల్లా పెనుమూడిలో ఘటన

2

'నకిలీ' నిగ్గు తేలాలి!

- బోరుగడ్డ కేసులో హైకోర్టు కీలక నిర్ణయం
- బెయిల్ పిటిషన్‌పై విచారణకు నిరాకరణ
- ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌తో డాక్టర్ వాంగ్మూలం నమోదు చేయించాలని పీడీజేకు ఆదేశం

12

ఖజానాకు కిక్కు



- 2024-25లో 28,842 కోట్ల మద్యం రాబడి.. ఏడాదిలో 14 శాతం వృద్ధి
- గతేడాది కంటే 3,760 కోట్లు ఎక్కువ.. 2023-24లో ఆదాయం 25,082 కోట్లు
- నాడు కమీషన్లు, జే బ్రాండ్లతో దోపిడీ.. ఐదేళ్లలో 18 వేల కోట్ల ఆదాయానికి కోత
- కూటమి సర్కారు వచ్చాక దోపిడీకి చెక్.. రాబడిపై 'క్వార్టర్ రూ.99' ఎఫెక్ట్

3

ఎంత దూరం వెళితే.. అంతే టోల్ చార్జీ!

- మే 1వ తేదీ నుంచే జీఎన్ఎస్ఎస్ ఆధారిత విధానం
- ఫాస్టాగ్ లేకుండా టోల్ వసూలు
- తొలుత వాణిజ్య వాహనాలకు..
- 2027 నుంచి వ్యక్తిగత వాహనాలకు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: హైవే ఎక్కామంటే చాలు.. టోల్ చార్జీల మోత తప్పదు. పైగా టోల్‌గేట్ల వద్ద రద్దీ సమస్య. ఫాస్టాగ్ సరిగా స్కాన్ కాక సమయం వృధా.. టోల్ కట్టడం ఎలాగూ తప్పదు కానీ.. మిగతా సమస్యలు త్వరలోనే తీరిపోనున్నాయి. అంతేకాదు ఎంత దూరం ప్రయాణిస్తే అంత మేరకే చార్జీ పడుతుంది. టోల్‌గేట్ల వద్ద రద్దీ సమస్యను తీర్చడం, టోల్ వసూలు విధానాన్ని సులభతరం చేయడం కోసం కేంద్రం కొత్తగా తెచ్చిన జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) ఆధారిత టోల్ విధానం.. మే 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. తొలుత వాణిజ్య వాహనాలకు దీన్ని వర్తింపజేస్తారు. 2027 నుంచి వ్యక్తిగత వాహనాలకు కూడా అమలు చేయనున్నారు. అప్పటి వరకు టోల్ గేట్లు కొనసాగుతాయి.



ఏమిటీ కొత్త విధానం?


మనం ఫోన్లలో వినియోగిస్తున్న జీపీఎస్ తరహా విధానమే జీఎన్ఎస్ఎస్. జీపీఎస్ కేవలం ఒక్క శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థ మాత్రమే. ఇలా గ్లోనాస్ (రష్యా), గెలీలియో (యూరప్), బైదు (చైనా), గగన్, నావిక్ (భారత్) తదితర నావిగేషన్ వ్యవస్థలు కూడా ఉన్నాయి. ఇలాంటి మేజూ ర్వేరు వ్యవస్థలకు చెందిన ఉపగ్రహాలకు ఒకే సమయంలో అనుసంధానమై.. అత్యంత కచ్చితమైన లొకేషన్ గుర్తింపు, నావిగేషన్ పొందే విధానమే జీఎన్ఎస్ఎస్.

వాహనాల్లో ప్రత్యేక పరికరం..

జీఎన్ఎస్ఎస్ టోల్ విధానం అమలు చేసేందుకు బస్సులు, లారీలు, ట్రక్కులు, కార్లు.. ఇలా టోల్ వర్తించే ప్రతి వాహనంలో ఆన్‌బోర్డ్ యూనిట్లు(ఓబీయూ)గా పిలిచే పరికరాలను బిగించుకోవాల్సి ఉంటుంది. ఈ పరికరాలు జీఎన్ఎస్ఎస్ ద్వారా శాటిలైట్లకు అనుసంధానం అవుతాయి. టోల్‌చార్జీలు వర్తించే హైవేలపై ఎక్కడి నుంచి ఎక్కడికి, ఎంతెంత దూరం సదరు వాహనం ప్రయాణించినదీ నమోదవుతూ ఉంటుంది. ఆ మేరకు నిర్ధారించిన టోల్ చార్జీల సొమ్ము వ్యాలెట్లు లేదా బ్యాంకు ఖాతాల్లోంచి కట్ అవుతుంది. ఈ పరికరం కోసం ఒక్కో వాహనానికి రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందని అంచనా.

దీనిద్వారా వాహనాలు ఏయే రోడ్లపై, ఎంతెంత దూరం ప్రయాణించాయన్నది కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

లోకం తీరు



ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రధాని సిద్ధమయ్యారు!

గొడవ పడొద్దు.. కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంకు ఖర్గే సూచన

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి పదవి కోసం మీరిద్దరూ గొడవ పడకండి. ప్రధాని మోదీ కర్ణాటకలో ప్రభుత్వాన్ని కూల్చేందుకు సిద్ధమయ్యారు' అని సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. తన సొంతూరు కలబురిగిలో బుధవారం జాబ్‌మేళా ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం, డిప్యూటీ సీఎం గొడవ పడటాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని కూల్చేందుకు మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుట్రల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిద్దరామయ్య, శివకుమార్‌ను హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ వివాదంలో కేంద్రం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీని బెదిరించాలని చూస్తోందని, కానీ గాంధీ కుటుంబం ఎప్పటికీ భయపడదని ఖర్గే స్పష్టంచేశారు. రాష్ట్రంలో కులగణన సర్వే నివేదికను తాను చూడలేదని తెలిపారు.

తుది కీ విడుదల.. గంటలోపే తొలగింపు!

- జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గందరగోళం
- ఎలాంటి ప్రకటనా చేయని ఎన్టీఏ.. విద్యార్థుల్లో ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలపై గందరగోళం నెలకొంది. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఈ పరీక్షల ఫలితాల విడుదలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తర్జనభర్జన పడుతోంది. జనవరిలో జరిగిన తొలి విడత పరీక్షల ఫలితాలు ఇప్పటికే విడుదలవగా.. ఏప్రిల్ 2-9 మధ్య జరిగిన రెండో విడత పరీక్షల ఫలితాలపై ఎన్టీఏ మల్లగుల్లాలు పడుతోంది. ఈ పరీక్షలకు సంబంధించి ప్రాథమిక కీని ఈ నెల 11న విడుదల చేసింది. అయితే ఇందులో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లోని 9 ప్రశ్నలకు తప్పుడు సమాధానాలున్నాయని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఆ తప్పులు సవరించి, తుది కీ విడుదల చేస్తామని ఎన్టీఏ తెలిపింది. కీతో పాటు ఫలితాలు గురువారం విడుదల చేస్తామని పేర్కొంది. కానీ, గురువారం తుది కీని అధికారిక వెబ్‌సైట్లో విడుదల చేసిన ఎన్టీఏ.. గంటలోపే దాన్ని తొలగించింది. ఈ తొలగింపుపై ఎన్టీఏ ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ రాసిన 12 లక్షల మందికి పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. తప్పులు సవరించి తుది కీ విడుదల చేసిన తర్వాత జేఈఈ మెయిన్స్ రెండు పరీక్షల్లోని ఉత్తమ ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను కేటాయిస్తారు.

21, 22వ తేదీల్లో అమెరికాలో రాహుల్ పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈనెల 21, 22 తేదీల్లో అమెరికాలో పర్యటిస్తారని ఆ పార్టీ నేత పవన్ ఖేరా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులతో జరిగే ముఖాముఖిలో పాల్గొంటారని తెలిపారు. అంతకుముందు ప్రవాస భారతీయులు, ప్రవాస భారత కాంగ్రెస్ సభ్యులతో సమావేశమవుతారన్నారు. 2024లోనూ రాహుల్ తన అమెరికా పర్యటనలో టెక్సాస్ యూనివర్సిటీ, జార్జిటౌన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు.

శ్రీశైలం ప్లంజ్‌పూల్ వద్ద భారీగొయ్యి పూడ్చివేతపై అధ్యయనం


- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి బాధ్యత
- జలవనరుల శాఖ ఉత్తర్వులు
- 28న రానున్న జాతీయ డ్యాం సేఫ్టీ బృందం
- 29న ప్లంజ్‌పూల్ పరిశీలన

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చేందుకు పాటించాల్సిన మెథడాలజీపై అధ్యయన బాధ్యతను కేంద్ర సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీకి ప్రభుత్వం అప్పగించింది. అధ్యయన సమయంలో వీడియో రికార్డింగ్ చేయాల్సి ఉందని కర్నూలు జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ తెలియజేయగా.. పరిగణనలోకి తీసుకున్న జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు రూ.51 లక్షలు చెల్లించనున్నట్లు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2009 వరదల సమయంలో ఏర్పడిన ఈ గొయ్యి డ్యాంకే ప్రమాదంగా మారుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జాతీయ జలాశయ భద్రత సంస్థను కోరుతున్నాయి. ఆ సంస్థ దాటవేత ధోరణి ప్రదర్శిస్తూ వచ్చింది. గొయ్యితో ముప్పు పొంచి ఉందని జాతీయ పరిశోధనా సంస్థలు, నిపుణులు ఇటీవల కేంద్రానికి హెచ్చరికలు చేశారు. దీంతో ఈ నెల 28న ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్ బృందం విజయవాడ రానుంది. 29న శ్రీశైలం వెళ్లి ఆ గొయ్యిని పరిశీలిస్తుంది. ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అవుతుం ది. 30వ తేదీన తెలంగాణ అధికారులతో సమావేశమవుతుంది. ఆ తర్వాత గొయ్యి పూడ్చివేతకు అనుసరించాల్సిన పద్ధతి, అంచనా వ్యయంపై నిర్ణయం తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

సుప్రీంకు ఆ అధికారం
అణు క్షిపణిలా మారింది!

- రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఎలా నిర్దేశిస్తుంది?
- ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో దొరికిన నగదుపై దర్యాప్తు ఏమైంది: ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బిల్లులు ఆమోదించేందుకు సుప్రీంకోర్టు రాష్ట్రపతికి గడువు విధించడాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో చట్టాలు చేసేదీ వారే, అమలు చేసేదీ వారే అన్నట్టుగా న్యాయమూర్తులు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. వారు చట్టాలకు అతీతమన్నట్టుగా, సూపర్ పార్లమెంటు అన్నట్టుగా పరిస్థితి మారిపోయిందని విమర్శించారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142.. దేశంలో ప్రజాస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా 24 గంటలూ న్యాయవ్యవస్థకు అందుబాటులో ఉన్న అణు క్షిపణిలా మారిందని వ్యాఖ్యానించారు. దేశంలో అందరికంటే అత్యున్నత స్థానంలో ఉన్న రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చే పరిస్థితి ఉండకూడదని.. బిల్లులు ఆమోదించేందుకు రాష్ట్రపతికి గడువు విధించడం సరికాదని స్పష్టం చేశారు. గురువారం 6వ బ్యాచ్ రాజ్యసభ ఇంటర్న్‌లను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. "రాష్ట్రపతికే ఆదేశాలు జారీ చేస్తున్నామంటే మనం ఎక్కడికి వెళుతున్నామో తెలియడం లేదు. ఇది కోర్టులో సమీక్ష పిటిషన్ వేయాల్సిన చిన్న విషయం కాదు. నిర్దిష్టకాలంలో రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకుంటే చట్టంగా మారినట్టే అని సుప్రీంకోర్టు పేర్కొంది. అంటే న్యాయమూర్తులే చట్టాలు చేస్తున్నారు. వారే కార్యనిర్వాహక విధులు నిర్వహిస్తున్నారు. అంటే సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరిస్తున్నారు. కానీ వారికి ఏమాత్రం జవాబుదారీ లేదు. ఎందుకంటే చట్టాలు వారికి వర్తించవు" అని వ్యాఖ్యానించారు.



వారు చట్టాలకు అతీతమా?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నగదు దొరకడాన్ని ప్రస్తావిస్తూ ధన్‌ఖడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మార్చి 14న రాత్రి జడ్జి నివాసంలో జరిగిన ఘటన గురించి వారం దాకా ఎవరికీ తెలియదు. ఎందుకీ ఆలస్యం? మార్చి 21న ఓ వార్తాపత్రికలో ఈ విషయం చూసి దేశ ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. కానీ ఆ న్యాయమూర్తిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ దాఖలు కాలేదు. ఉప రాష్ట్రపతి అయిన నాతో సహా దేశంలో ఎవరిపై అయినా ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చు. రూల్ ఆఫ్ లాను అమలు చేసేందుకు ఏ అనుమతీ అక్కర్లేదు. కానీ న్యాయమూర్తులపై నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేం. దేశంలో రాష్ట్రపతి, గవర్నర్‌లకు మాత్రమే ప్రాసిక్యూషన్ నుంచి రాజ్యాంగం మినహాయింపు ఇచ్చింది. కానీ న్యాయమూర్తులకు అందుకు అతీతంగా ఎలా మినహాయింపు అందుతోంది?" అని నిలదీశారు. జడ్జి ఇంట్లో నగదు దొరికిన కేసును పోలీసు దర్యాప్తు చేయకుండా.. ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఎందుకు విచారిస్తోందని ప్రశ్నించారు. ఆ జడ్జీల కమిటీకి పార్లమెంట్ చేసిన ఏ చట్టం నుంచైనా అనుమతి లభించిందా అని నిలదీశారు. అయినా జడ్జీల కమిటీ మహా అయితే సిఫార్సు చేస్తుందని, దానికి ఎలాంటి చట్టబద్ధత ఉండదని స్పష్టం చేశారు. చివరికి పార్లమెంట్ మాత్రమే చర్య తీసుకోగలదని తెలిపారు.

విశ్వాసం తగ్గిపోతోంది..

న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం రోజురోజుకూ తగ్గిపోతోందని ఇటీవల ఒక మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో తేలిందని ఉప రాష్ట్రపతి చెప్పారు. న్యాయవ్యవస్థ, చట్టసభలు, కార్యనిర్వాహకవర్గం పారదర్శకంగా, జవాబుదారీగా వ్యవహరించాలని సూచించారు. చట్టం ముందు అందరూ సమానమనే దాన్ని విస్మరించవద్దని సూచించారు. న్యాయవ్యవస్థ ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తే ఎలాగని, అది ఎవరికి జవాబుదారీ అవుతుందని ప్రశ్నించారు. జనవరి 27న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల లోక్‌పాల్ బెంచ్.. కొందరు హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టిందని గుర్తు చేశారు. కానీ దానిని సుప్రీంకోర్టు తనంతట తానే స్వాధీనంలోకి తీసుకుందన్నారు. ఇతర దేశాల్లో న్యాయవ్యవస్థలు ఇలా తమంతట తాము విచారణలను స్వాధీనంలోకి తీసుకున్న సందర్భాలు లేవన్నారు.

భర్తను చంపి.. పాము కాటు అని నమ్మించి..

- ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం
- గొంతు పిసికి చంపారని తేల్చిన పోస్టుమార్టం నివేదిక

మీరట్, ఏప్రిల్ 17: యూపీలోని మేరఠ్‌లో మరో ఘోరం వెలుగుచూసింది. ఇటీవల నేవీ అధికారి, 29 ఏళ్ల సౌరభ్ రాజ్‌పుత్‌ను అతడి భార్య, ఆమె ప్రియుడు కలిసి హత్యచేసి.. మృతదేహాన్ని ముక్కలుగా నరికి.. ఆ అవశేషాలను ఒక ప్లాస్టిక్ డ్రమ్‌లో ఉంచి పైనుంచి సిమెంట్‌తో కప్పిపెట్టిన ఘటన తరహాలోనే మరో నేరం జరిగింది. 25 ఏళ్ల అమిత్ కశ్యప్ అనే యువకుడిని అతడి భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు పిసికి చంపారు. హత్యానేరం నుంచి బయటపడేందుకు రవిత పెద్ద ప్రణాళికే వేసింది. తన భర్త పాము కాటుకు గురై మరణించాడని లోకాన్ని నమ్మించేందుకు వెయ్యి రూపాయలు పెట్టి ఓ పామును కొనుగోలు చేసింది. హత్యచేసిన తర్వాత రాత్రి అతడి దుస్తుల్లోకి పామును వదిలింది. మరుసటి రోజు పాము కాటుతోనే తన భర్త చనిపోయాడంటూ చుట్టుపక్కల వారి ఎదుట గగ్గోలు పెట్టింది. మృతదేహంపై పదిచోట్ల పాము కాట్లు కనిపించడంతో తొలుత ఎవ్వరికీ అనుమానం కలగలేదు. అయితే పోస్టుమార్టం నివేదిక.. అమిత్‌ను గొంతు నులిమి చంపారంటూ తేల్చడంతో రవిత, ఆమె అమర్‌దీప్ నేరం అంగీకరించక తప్పలేదు. వాస్తవానికి అమిత్, అమర్‌దీప్ స్నేహితులు. ఈ స్నేహంనెపంతోనే తరచూ అమిత్ ఇంటికొచ్చే అమర్‌దీప్, అతడి భార్య రవితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇది అమిత్‌కు తెలియడంతో అతడికి, రవితకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్తను హత్యచేసినా.. నేరం మాత్రం తనపై పడకూడదనే ప్రణాళికతో రవిత వ్యవహరించినా ఆమెతో పాటు ప్రియుడు పోలీసులకు దొరికిపోక తప్పలేదు.

వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లం!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. వారం గడువు ఇవ్వడం వల్ల వక్ఫ్ ఆస్తులకు వచ్చే ముప్పేమీ ఉండదని.. స్టే ఇవ్వడం వంటి కఠిన చర్యలు చేపట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

తదుపరి విచారణ వరకు వాటి జోలికి వెళ్లం..

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలతో సంతృప్తి చెందని ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికే మొగ్గు చూపింది. ప్రస్తుతం పరిస్థితి వేరుగా ఉందని, సమస్యలు కనిపిస్తున్నాయని పేర్కొంది. దీనితో తదుపరి విచారణ వరకు వక్ఫ్ ఆస్తుల జోలికి వెళ్లబోమని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. దీనిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుని స్టే పై వెనక్కితగ్గింది. "తదుపరి విచారణ వరకు 'వక్ఫ్ బై యూజర్', బోర్డులు సహా ఎలాంటి వక్ఫ్ ఆస్తులను డీ నోటిఫై చేయబోమని సొలిసిటర్ జనరల్ హామీ ఇచ్చారు. సవరణ చట్టంలోని 9, 14 సెక్షన్ల కింద ఎలాంటి నియామకాలు చేపట్టబోమని, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో నియమించబోమని చెప్పారు. ఈ అంశాలను నమోదు చేసుకుంటున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయడానికి వారం రోజులు గడువు ఇస్తున్నామని తెలిపింది. ప్రభుత్వం కౌంటర్ వేశాక.. దానిపై ఐదు రోజుల్లోగా రిజాయిండర్లు వేయాలని పిటిషనర్లకు సూచించింది.

ఐదు పిటిషన్లపైనే వాదనలు వింటాం..

పిటిషన్లు ఎక్కువ సంఖ్యలో ఉన్న నేపథ్యంలో అందులో ఐదింటిలోనే వాదనలు వింటామని ధర్మాసనం తెలిపింది. ఇందుకోసం ముగ్గురు న్యాయవాదులను నోడల్ కౌన్సెల్‌గా నియమిస్తామని, ఎవరెవరు అందులో ఉండి వాదనలు వినిపిస్తారో మీరే నిర్ణయించుకోండి అని సూచించింది. విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజున వక్ఫ్ సవరణ చట్టంపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

10 రోజుల్లో బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

- మేలో పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
- 4-5 రాష్ట్రాల్లో గవర్నర్ల నియామకాలపై చర్చలు
- సంఘ్ మార్గదర్శకత్వంలో భారీ మార్పులు?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో రాజకీయంగా స్తబ్దత నెలకొన్నప్పటికీ.. అది తుఫాను ముందు ప్రశాంతతలాగా కనిపిస్తోంది. త్వరలో భారతీయ జనతా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలక మార్పులు జరగనున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఆ వర్గాలు చెబుతున్న దాని ప్రకారం.. మరో వారం పది రోజుల్లో బీజేపీకి జాతీయ అధ్యక్షుడు రానున్నారు. పార్టీపై పూర్తిగా పట్టుబిగించి ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయనున్న బలమైన నేతనే పార్టీ అధ్యక్షుడుగా నియమించే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేతలకు, బీజేపీ అగ్రనేతలకు మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, హరియాణా సహా పలు రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను నియమించేందుకు కూడా కసరత్తు పూర్తయినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అలాగే.. పార్టీలో సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నేతలను ప్రధాన కార్యదర్శులుగా, కార్యదర్శులుగా నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. మే నెలలో ప్రధాని మోదీ పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరపనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీతో సంబంధం లేని ఐఏఎస్, ఐపీఎస్, ఇతర నేతలను తప్పించి.. పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేస్తున్నవారికి అవకాశం కల్పించనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. పార్టీలోనూ, మంత్రివర్గంలోనూ యువ నేతలకు కూడా కీలక ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిసింది. నాలుగైదు రాష్ట్రాల్లో గవర్నర్లను కూడా నియమించే విషయంపై చర్చలు జరిగినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

అప్పట్నుంచీ..

రెండు వారాల క్రితం నాగపూర్‌లో సంఘ్ కార్యాలయానికి వెళ్లొచ్చిన నాటి నుంచీ మోదీ ఎక్కువగా బయటి కార్యక్రమాలు పెట్టుకోకుండా ఢిల్లీలోనే తన ఆంతరంగికులతో విస్తృత చర్చలు జరుపుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సైతం కలుసుకుని సుదీర్ఘ మంతనాలు జరిపారు. శనివారం జరగాల్సిన ప్రధాని జమ్మూకశ్మీర్ పర్యటన కూడా వర్షాల పేరుతో వాయిదా పడింది. మరోవైపు హోంమంత్రి అమిత్ షా కూడా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో చర్చలు జరిపారు. మోదీ కూడా వీరితో మంతనాలు జరిపినట్లు సమాచారం.

సంఘ్ నిర్దేశకత్వంలో..

హరియాణా, మహారాష్ట్రలో పార్టీ విజయానికి పనిచేసిన ఆర్ఎస్ఎస్ దేశంలో వివిధ రాష్ట్రాల్లో తమ ఫార్ములాలకు అనుగుణంగా బీజేపీ పనిచేసేందుకు దిశా నిర్దేశం చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైను తొలగించి అన్నాడీఎంకే నేతృత్వంలో పనిచేయాలని బీజేపీ నిర్ణయించింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లేవనెత్తిన భాష, తదితర అంశాల నేపథ్యంలో దక్షిణాదికి, ఉత్తరాదికి మధ్య అగాథం ఏర్పడకుండా జాగ్రత్తపడాలని సంఘ్ సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే.. అన్నామలైను కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశం కూడా లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో చేతులు కలపడం కూడా సంఘ్ ఫార్ములా ప్రకారమే జరిగిందని.. తెలంగాణలో కూడా అలాంటి ఫార్ములాను రూపొందించేందుకు కసరత్తు జరుగుతోందని ఆ వర్గాలు తెలిపాయి.

జీవిత ఖైదీలకు శుభవార్త

- సత్ప్రవర్తన కలిగిన వారి విడుదలకు ఉత్తర్వులు జారీ
- అర్హుల పేర్లు పంపాలని జైళ్ల డీజీకి హోంశాఖ ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జైళ్లలో వివిధ కేసుల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు శిక్ష నుంచి మినహాయింపు ఇస్తూ గురువారం రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విడుదలకు అర్హులైన ఖైదీల పేర్లు పంపాలంటూ జైళ్ల శాఖ డీజీని ఆదేశించింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, న్యాయశాఖ కార్యదర్శి, సీఐడీ డీజీ, ప్రధాన న్యాయ సలహాదారు, ఇంటెలిజెన్స్ చీఫ్, జైళ్ల శాఖ డీజీ సభ్యులుగా ఉన్న కమిటీ ఈ జాబితాను సమీక్షించి, ఖరారు చేస్తుందని పేర్కొంది. ప్రతి ఖైదీకి సంబంధించిన కేసులు, శిక్ష, ఇతరత్రా నిబంధనలకు అనుగుణంగా కమిటీ నిర్ణయం తీసుకోనుంది. ఏటా మూడు విడతల్లో.. ఫిబ్రవరి, జూన్, అక్టోబరులో ఖైదీలను విడుదల చేసేలా కొత్త మార్గదర్శకాలు రూపొందించారు. అర్హులైన ఖైదీలు రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలి. శిక్షాకాలం పూర్తయ్యే వరకూ స్థానిక పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి వద్ద ప్రతి 3నెలలకు ఒకసారి హాజరవ్వాలి. విడుదల తర్వాత ఏదైనా నేరానికి పాల్పడితే క్షమాభిక్ష రద్దవుతుందని కుమార్ విశ్వజీత్ తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మతమార్పిడిలో విషాదం

- బాప్టిజం తీసుకుంటూ నదిలో మునిగి ఇద్దరు మృతి.. బాపట్ల జిల్లాలో ఘటన

రేపల్లె, భట్టిప్రోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మతమార్పిడి సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. బాప్టిజం తీసుకుంటూ కృష్ణానదిలో మునిగి ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. బాపట్ల జిల్లా పెనుమూడిలో గురువారం ఈ ఘటన జరిగింది. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపిన వివరాల మేరకు భట్టిప్రోలు మండలం వేమవరానికి చెందిన 30 మంది గురువారం మధ్యాహ్నం 3 గంటలకు మతమార్పిడి కోసం పెనుమూడిలో కృష్ణానది వద్దకు వచ్చారు. నదిలో దిగి బాప్టిజం తీసుకుంటుండగా పెనుమాల దేవదాసు, తలకాయల గౌతమ్, పెనుమాల సుధీర్‌బాబు, పెనుమాల హర్షవర్ధన్, పెనుమాల రాజా నీటిలో మునిగిపోయారు. స్థానికులు గుర్తించి ముగ్గురిని కాపాడారు. పెనుమాల దేవదాసు(19), తలకాయల గౌతమ్(18) గల్లంతయ్యారు. గాలింపు చేపట్టి కొంతసేపటికి వారి మృతదేహాలను వెలికితీసి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుధీర్‌బాబు, హర్షవర్ధన్, రాజా రేపల్లెలోని సురక్ష వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అక్కడ నదిలో లోతు ఎక్కువగా ఉంటుందని చెప్పినా వినకుండా దిగారని స్థానికులు తెలిపారు. గౌతమ్ ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ కోచింగ్ తీసుకుంటుండగా, దేవదాసు పాలిటెక్నిక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నారు. వీరు ఇంట్లో చెప్పకుండానే బాప్టిజం స్వీకరించేందుకు వెళ్లినట్టు తెలిసింది. గౌతమ్ తల్లిదండ్రులు సుధాకర్, రజని, దేవదాసు తల్లిదండ్రులు దేవేంద్ర, నాగలత వ్యవసాయ కూలీలు. యువకులు మృతి చెందిన విషయాన్ని కుటుంబసభ్యులు వారి తల్లులకు తెలియనీయలేదు. యువకుల మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

అసెంబ్లీ, హైకోర్టు శాశ్వత భవన నిర్మాణాల టెండర్లు ఖరారు

- అసెంబ్లీ భవనం ఎల్ అండ్ టీకి, హైకోర్టు భవనం ఎన్‌సీసీ సంస్థకు ఖరారు

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శాశ్వత అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణాలు ఇక ప్రారంభం కానున్నాయి. ఏపీసీఆర్‌డీఏ నిర్వహించిన టెండర్లలో ఎల్1గా నిలిచిన సంస్థలకు టెండర్లను ఖరారుచేస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. ఎల్1 టెండర్ దారులను ఖరారుచేసే అధికారం సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు టెండర్లు ఖరారు చేశారు. అసెంబ్లీ భవన నిర్మాణానికి రూ.590 కోట్ల అంచనా విలువకు గాను 4.48 ఎక్సెస్‌తో ఎల్ అండ్ టీ సంస్థకు రూ. 617 కోట్లకు పనులు అప్పగించారు. అదేవిధంగా హైకోర్టు భవన నిర్మాణానికి రూ.750 కోట్ల అంచనా విలువకు గాను 4.52 శాతం ఎక్సెస్‌తో రూ.786 కోట్లకు పనులను ఎన్‌సీసీ సంస్థకు అప్పగిస్తున్నట్లు మున్సిపల్‌శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

8 నెలలుగా జీతాలు లేవు

- గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల ఆవేదన

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జీతాలు అందక 8 నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రాష్ట్ర వ్యాప్తంగా 650 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని తమకు జీతాలిప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. డీడీఓలుగా అధికారాలు పొందిన 650 మంది పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటి వరకు పొజిషన్ ఐడీ క్రియేట్ చేయకపోవడం, అదనపు గ్రేడ్ 4 పంచాయతీల్లో నియమితులైన కార్యదర్శులకు కేడర్ స్ట్రెంత్ సమస్య చూపుతున్న కారణంగా 8 నెలలుగా జీతాలు నిలిచిపోయాయని తెలిపారు. తమ డేటా కమిషనర్ కార్యాలయానికి, ట్రెజరీకి వెళ్లినా సమస్యను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. తాత్కాలిక పరిష్కారం కింద ఒక గ్రేడ్ మినహాయించి, జీతాల సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు. కనీస అవసరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.



ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు

హిందూపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళ ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చారు. వీరిలో ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన శిల్ప బుధవారం రాత్రి పురిటినొప్పులతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఆమె గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ప్రసవించారు. సాధారణ కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చారు. వారి బరువు తక్కువగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశామని డాక్టర్ నీరజ తెలిపారు. తల్లి ఆరోగ్యంగా ఉన్నారని ఆమె అన్నారు.

విశాఖ విమానాశ్రయంలో ఐ ఫోన్లు, ఈ-సిగరెట్లు స్వాధీనం

విశాఖపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మలేషియా నుంచి తీసుకువచ్చిన ఐ ఫోన్లు, ఈ-సిగరెట్లను విశాఖపట్నం విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి బుధవారం రాత్రి విమానం రాగా అందులో ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద అనుమతి లేని వస్తువులు బయటపడ్డాయి. 29 ఐ ఫోన్లు (16 ప్రొ/ప్రొ మ్యాక్స్), 21 పెట్టెల ఈ-సిగరెట్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి మొత్తం విలువ రూ.29,63,851గా అధికారులు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

ఖజానాకు కిక్కు

2024-25లో 28,842 కోట్ల మద్యం రాబడి



ఏడాదిలో 14 % వృద్ధి

- గతేడాది కంటే 3,760 కోట్లు ఎక్కువ
- 2023-24లో ఆదాయం 25,082 కోట్లు
- నాడు కమీషన్లు, జే బ్రాండ్లతో దోపిడీ
- ఐదేళ్లలో 18 వేల కోట్ల ఆదాయానికి కోత
- కూటమి సర్కారు వచ్చాక దోపిడీకి చెక్
- రాబడిపై 'క్వార్టర్ రూ.99' ఎఫెక్ట్
- వచ్చే సెప్టెంబరులో బార్ పాలసీ

గత ప్రభుత్వంలో మద్యం కంపెనీల నుంచి కమీషన్లు! ఒక్కో మద్యం బాక్సుపై రూ.150 నుంచి 450 వరకు దోపిడీ! దీనికి తోడు ఊరూ పేరూ లేని 'జే బ్రాండ్ల' రుద్దుడు! తద్వారా సర్కారు ఖజానాకు గండి కొట్టి వైసీపీ పెద్దలు వేల కోట్లు దోచుకున్నారు!

ఇప్పుడు కమీషన్లు లేవు. 'జే బ్రాండ్ల' బెడద లేదు. ఫలితంగా సర్కారుకు ఆదాయం పెరిగింది. ఒక్క ఏడాదిలోనే ఏకంగా రూ.3,760 కోట్ల మేర రాబడి పెరిగింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత జగన్ సర్కారు 'ప్రభుత్వ మద్యం పాలసీ'తో ఆదాయానికి గండికొడితే.. కూటమి ప్రభుత్వం అక్రమాలకు అడ్డు కట్ట వేసి ఆదాయం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంది. 2023-24లో మద్యంపై రూ.25,082 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది 14 శాతం పెరిగి రూ.28,842 కోట్లకు ఆదాయం చేరింది. గత ప్రభుత్వంలోనూ ఇదే తరహా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వ షాపులు ఏర్పాటు చేసి మద్యం పాలసీని అస్తవ్యస్తం చేసింది. రాష్ట్రంలో నాణ్యమైన బ్రాండ్లు అందుబాటులో ఉంచకపోవడంతో ఐదేళ్లలో రూ.18 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రభుత్వ పాలసీ స్థానంలో తిరిగి ప్రైవేటు పాలసీ ప్రవేశపెట్టి కమీషన్లకు చెక్ పెట్టింది. కమీషన్లు ఇచ్చే అవసరం లేకపోవడంతో మద్యం కంపెనీలు స్వచ్ఛందంగా ధరలు తగ్గించుకున్నాయి. మరోవైపు జాతీయ కంపెనీలు తయారు చేసే క్వార్టర్ రూ.99 బ్రాండ్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ చర్యల వల్ల పిచ్చి బ్రాండ్లు కనుమరుగవడంతో పాటు భారీగా ఆదాయం సమకూరింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ శాఖకు ఆదాయ లక్ష్యం మరింత పెరిగింది. 2024-25లో పరిమాణం(సీసాలు) పరంగా చూస్తే అమ్మకాలు 9.1 శాతం పెరిగాయి. 2023-24లో 4.55 కోట్ల కేసుల మద్యం అమ్మితే, 2024-25లో 4.97 కోట్ల కేసుల మద్యం అమ్మారు. లిక్కర్‌లో 7.38 శాతం, బీరులో 14.13 శాతం అమ్మకాలు పెరిగాయి.

ఆదాయం ఇలా..

- మద్యంపై వచ్చే పన్నుల రూపంలో రూ.24,731 కోట్లు
- షాపులు, బార్లు, డిస్టిలరీల లైసెన్స్ ఫీజుల రూపంలో రూ.2,206 కోట్లు
- షాపుల దరఖాస్తు రుసుముల రూపంలో రూ.1,905 కోట్లు

ఫలితాలిస్తున్న చర్యలు

రాష్ట్రాన్ని నాటు సారా రహితం చేసే లక్ష్యంతో ప్రభుత్వం నవోదయం 2.0 ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,571 గ్రామాల్లో నాటు సారా ఉన్నట్లు గుర్తించారు. ఆ గ్రామాల్లో నాటు సారానూ పూర్తిగా నిర్మూలించి నాటు సారా రహిత ఏపీగా ప్రకటించనున్నారు. తిరుపతి, నెల్లూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను త్వరలో నాటు సారా రహిత జిల్లాలుగా ప్రకటించనున్నారు. ఇందుకోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ముమ్మరంగా దాడులు నిర్వహిస్తోంది. సరిహద్దు ప్రాంతాలలో పొరుగు రాష్ట్రాల సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దాడులు చేస్తున్న చోట్ల మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. మద్యంతో పోలిస్తే నాటు సారా ధర తక్కువ కావడంతో కొందరు దాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు నాటు సారా స్థావరాలపై దాడులు చేస్తూ, దాని వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. నాటు సారా అందుబాటులో లేని చోట్ల మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. అలాగే పక్క రాష్ట్రాల నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు కూడా చాలా వరకు అడ్డుకట్ట పడింది. ఈ చర్యల ఫలితంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి.

రూ.99 మద్యానికి డిమాండ్

అధికారంలోకి వచ్చాక తక్కువ ధరలతో మద్యం అందుబాటులో ఉంచుతామని కూటమి హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా జాతీయ కంపెనీలు ఉత్పత్తి చేసే మద్యాన్ని క్వార్టర్ రూ.99కు అందుబాటులోకి తీసుకొచ్చింది. 12 కంపెనీలు ఈ రకం మద్యాన్ని సరఫరా చేస్తున్నాయి. క్వార్టర్ రూ.99 అమ్మకాలు ప్రారంభించిన సమయంలో అమ్మకాల్లో వాటి వాటా 30 శాతానికి చేరింది. గత ప్రభుత్వంలో పిచ్చి పిచ్చి 'జే' బ్రాండ్లను ఎక్కువ ధరలకు అమ్మేవారు. ఇప్పుడు తక్కువ ధరలో లభిస్తున్న క్వార్టర్ రూ.99కు డిమాండ్ పెరిగింది. అయితే వీటి అమ్మకాలు పెరుగుతున్నా విలువ (అమ్మకాల మొత్తం) తగ్గుతోంది. అమ్మకాలకు తగినట్టుగా ఆ మేరకు ఆదాయం రావడం లేదు. దీంతో ఈ మధ్యకాలంలో ఈ బ్రాండ్ల మద్యాన్ని కొంతమేర నియంత్రిస్తున్నారు. ఇటీవల క్వార్టర్ రూ.99 బ్రాండ్ల అమ్మకాల మార్కెట్ 20 శాతానికి తగ్గింది. నాటు సారా ప్రభావిత, గ్రామీణ ప్రాంతాలకు ఈ బ్రాండ్లను పరిమితం చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. తక్కువ ధర బ్రాండ్లను గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉంచితే అటు వినియోగదారులకు, ఇటు ప్రభుత్వ ఆదాయానికి అనుకూలంగా ఉంటుందనే వాదన వినిపిస్తోంది.

కొత్త బార్ పాలసీ

ఈ ఏడాది ఆగస్టుతో ప్రస్తుత బార్ పాలసీ ముగుస్తుంది. దీంతో కొత్త బార్ పాలసీపై ఎక్సైజ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 870 బార్లు ఉన్నాయి. వాటిలో 42 బార్లు ఎవరూ తీసుకోకపోవడంతో ఖాళీగా మిగిలాయి. గత ప్రభుత్వం బార్లను వేలం విధానంలో కేటాయించింది. ఈసారి వేలం పెట్టాలా? లేదా లాటరీ ద్వారా ఎంపిక చేయాలా? అనేదానిపై కసరత్తు జరుగుతోంది. వచ్చే సెప్టెంబరులో కొత్త బార్ పాలసీ అమల్లోకి రానుంది. పర్యాటకులను ఆకర్షించడంలో భాగంగా ఇటీవల 37 స్టార్ హోటళ్లలోని బార్లకు లైసెన్స్ ఫీజులు తగ్గించారు. దీంతో సుమారు రూ.12 కోట్ల ఆదాయం తగ్గే పరిస్థితి వచ్చింది. అమ్మకాలు పెరిగితే పన్నుల రూపంలో ఆ మేరకు ఆదాయం సర్దుబాటు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం

- నాణ్యమైన విద్యతో పాటు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం
- 3,400 మందికి ఉచితంగా డీఎస్సీ శిక్షణ
- గురుకులాల్లో నీట్ శిక్షణ కేంద్రాలు పెంచుతున్నాం
- త్వరలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ
- సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నాణ్యమైన బియ్యంతో భోజనం
- విశాఖ పర్యటనలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి



డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రంలో మెటీరియల్ పంపిణీ చేస్తున్న మంత్రి వీరాంజనేయస్వామి. చిత్రంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు ఉద్యోగాలు కల్పించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. గురువారం విశాఖలోని ద్వారకానగర్‌లో ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని, మధురవాడలోని కాలేజీ ఎస్సీ వసతి గృహాన్ని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్సీ శిక్షణ కేంద్రంలో బోధనా తీరును, అందుతున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,400 మందికి ఉచితంగా డీఎస్సీలో శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గురుకులాల్లో ప్రస్తుతం నీట్ శిక్షణ కేంద్రాలు మూడే ఉన్నాయని, సీఎం చంద్రబాబు సూచనలతో వాటిని పదికి పెంచుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక కొత్త ఎస్సీ హాస్టళ్ల నిర్మాణం, గురుకులాలు, వసతి గృహాలకు మరమ్మతులకు రూ. 300 కోట్లు ఖర్చు చేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామన్నారు. అనంతరం విశాఖ ఎంవీపీ కాలనీలోని సాంఘిక సంక్షేమ జిల్లా కార్యాలయాన్ని మంత్రి తనిఖీ చేశారు. కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలన్నారు. ఆ తరువాత మధురవాడలోని కాలేజీ వసతి గృహాన్ని సందర్శించారు. పర్యటనలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు, వినెక్స్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ శ్రీనివాసరావుతోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుంటూరులో అగ్నిమాపక శాఖ వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీజీ మాదిరెడ్డి ప్రతాప్, రీజనల్ అధికారి జిలానీ, డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

కాంప్లెక్స్‌లపై స్టడీసర్కిళ్లు ప్రమాదకరం

- అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కమర్షియల్ కాంప్లెక్స్‌లు, హోటళ్లపైన స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమని అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు. వాటికి అగ్నిమాపక శాఖ ఎటువంటి నిరభ్యంతర పత్రాలను మంజూరు చేయబోదని స్పష్టం చేశారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గుంటూరులోని నెక్స్‌జన్ పాఠశాలలో గురువారం నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కమర్షియల్ కాంప్లెక్స్‌పై స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం వల్ల సూరత్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగిందని గుర్తుచేశారు. బడుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని తెలిపారు. సంవత్సరంలో ఒక్కసారైనా పాఠశాలల్లో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రమాదం సంభవించినప్పుడు కంగారుపడకుండా ఎలా బయటపడాలన్న దానిపై విద్యార్థులకు ఆచరణాత్మకంగా అవగాహన కల్పించాలని డీజీ సూచించారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలలను సందర్శించి అగ్ని ప్రమాదాల నివారణకు తగిన ఏర్పాట్లు ఉన్నాయో, లేవో పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి జిలానీ, డీఎఫ్‌వో ముక్కు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, వారోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీనియర్ ఐపీఎస్ అధికారి మాదిరెడ్డి ప్రతాప్ పాఠశాల విద్యార్థులతో పూర్తిగా కలిసిపోయారు. నేలపైనే కూర్చొని వారితో ముచ్చటించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ చక్రవర్తి



తిరుమల ఆలయం ముందు జస్టిస్ చక్రవర్తి

తిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి వైభవం చాటిచెప్పేలా డిజిటల్ మీడియా

- వసతి గదుల నిర్వహణపై పర్యవేక్షణ ఉండాలి
- టీటీడీకి అసెంబ్లీ అంచనాల కమిటీ సూచన

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు గతంలో కంటే ఇప్పుడు అందుతున్న సేవల్లో మార్పు కనిపిస్తోందని ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ పేర్కొంది. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, సభ్యులు టీటీడీ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, వసతి గదుల నిర్వహణపైనా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నవతరానికి శ్రీవారి వైభవాన్ని తెలియజేసేలా డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలన్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు మాట్లాడుతూ శ్రీవారి సేవను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.



టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు

రేపు ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల


తిరుమల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన జూలై కోటాను టీటీడీ శనివారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం భక్తులు ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 22వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, దానికి సంబంధించిన దర్శన టికెట్లను విడుదల చేయనున్నారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి టికెట్లను, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక అనారోగ్య బాధిత భక్తులకు టోకెన్లు విడుదల చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల కోటా అందుబాటులో ఉంచుతారు.

28, 29 తేదీల్లో ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు

విజయవాడ (బస్‌స్టేషన్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పట్ల యాజమాన్య వ్యతిరేక ధోరణికి నిరసనగా ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని డిపోలు, యూనిట్లలో నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినా సంస్థ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల ఉద్యోగ భద్రత, సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలన్నారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ, సెలవులు వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- వైసీపీ ప్రభుత్వంలో భూముల రికార్డులు మార్చేశారంటూ ఆరోపణ
- న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీతో కిందకు



సెల్ టవర్‌పై పెట్రోలు బాటిల్, లైటర్‌తో శంకరరావు

అచ్యుతాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో తమ భూములకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని అధికారులకు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం వెదురువాడ పంచాయతీ లంకధర్మవరానికి చెందిన లంక హరనాగ శంకరరావు గురువారం ఉదయం 'న్యాయం కోసం' అంటూ ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేశాడు. గత ప్రభుత్వంలో అధికారులు భూముల రికార్డులు తారుమారు చేసి తమ కుటుంబాన్ని దీనస్థితికి తీసుకువచ్చారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా తమను ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు మెసేజ్ పెట్టాడు. తొమ్మిది గంటల సమయంలో మండల కాంప్లెక్స్‌లో గల సెల్ టవర్ ఎక్కేశాడు. విషయం తెలుసుకున్న సీఐ నమ్మి గణేష్ అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక శకటాన్ని కూడా సిద్ధం చేశారు. ఎవరు ఫోన్ చేసినా టవర్‌పై ఉన్న శంకరరావు స్పందించలేదు. ఉదయం పదిన్నర గంటలకు తహశీల్దార్ వరహాలరావు అక్కడకు చేరుకుని శంకరరావుతో మాట్లాడారు. కిందకి దిగి విషయం చెబితే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో శంకరరావు కిందకి దిగాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సూడాన్ సంక్షోభం

అరబ్ రాచరిక ప్రభుత్వాల స్వార్థం, అగ్రరాజ్య అధినేత నిర్దయ, దేశీయుల మధ్య కత్తి వైరం కారణంగా ఎడతెగని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్రికా దేశం సూడాన్. గాజా, ఉక్రెయిన్ యుద్ధాలతో తల్లడిల్లుతున్న అంతర్జాతీయ సమాజం ఈ ఆఫ్రికన్ అభాగ్యుల దుస్థితిని పూర్తిగా ఉపేక్షించడం నేటి ప్రపంచ విస్మయకర, విషాద పోకడకు ఒక తార్కాణం.

19వ శతాబ్దంలో ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఆవిర్భవించి, ఇరవయో శతాబ్ది ప్రథమార్థంలో ఆంగ్లో–ఈజిప్షియన్ ఉమ్మడి పాలనలో ఉండి, 1956లో వలసపాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన సూడాన్ తన 69 ఏళ్ల అస్తిత్వంలో, మరే ఆఫ్రికన్ దేశం కంటే ఎక్కువసార్లు తిరుగుబాట్లను చవిచూసింది. 2019లో సంభవించిన తిరుగుబాటులో 1989 నుంచి నిరంకుశ పాలన చేసిన ఒమర్ అల్ బషీర్ పదవీ భ్రష్టుడయ్యాడు. ఆయన స్థానంలో అధికారంలోకి వచ్చిన పౌర–సైనిక ప్రభుత్వం సుస్థిర ప్రజాస్వామిక పాలననందిస్తామని హామీ ఇచ్చింది. అయితే జనరల్ అబ్దేల్ ఫత్తా బుర్హన్ తన సహచర పౌర పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి అధికారాన్ని కైవసం చేసుకున్నాడు. ఇందుకు అతడికి సహకరించిన వ్యక్తి హెమెడ్తీగా ప్రసిద్ధుడైన పారా-మిలిటరీ దళం ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అధిపతి మొహమద్ హమ్దాన్ డగాలో. అయితే ఆ తరువాత ఇరువురి మధ్య అధికారం కోసం ప్రారంభమైన పెనుగులాట ఫలితమే 2023 నుంచి కొనసాగుతున్న అంతర్యుద్ధం, తత్పర్యవసాన మానవతా సంక్షోభం.

ఆఫ్రికాలో చమురు ఉత్పత్తి దేశాలలో సూడాన్ అగ్రగామిగా ఉండేది. చమురు విక్రయాలతో అపారంగా సమకూరిన ధన రాశులతో కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు బషీర్ పూనుకున్నాడు. అందులో భాగంగా పదివేల కోట్ల డాలర్ల వ్యయంతో నైలునదిపై డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపట్టాడు. ఆ కార్యక్రమం పూర్తయ్యేలోపే దక్షిణ సూడాన్ ప్రజలు తిరుగుబాటు చేసి స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చమురు నిక్షేపాలు ఉన్న ప్రాంతాలన్నీ దక్షిణ సూడాన్‌వే కావడంతో కొత్త ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణ ప్రయత్నాలకు తీరని విఘాతం కలిగింది. చమురు ఆదాయం లేకపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయింది. అఫ్రికాలో మరే దేశంలో కంటే అధికంగా ఉన్న బంగారు గనులకు నెలవు అయిన పశ్చిమ సూడాన్‌లో తనతో విభేదించిన తెగలను అణచివేసేందుకు ప్రైవేట్ మిలీషియాలను బషీర్ సృష్టించాడు. అటువంటి ఒక ప్రైవేట్ సైన్యం నుంచి ప్రభవించిందే ప్రస్తుతం హెమెడ్తీ నాయకత్వంలోని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్. బంగారు గనులు ఉన్న పశ్చిమ సూడాన్‌లో హెమెడ్తీదే రాజ్యం. తన పారా మిలిటరీ దళాన్ని జనరల్ బుర్హాన్ నేతృత్వంలోని సైన్యంలో విలీనం చేసేందుకు తిరస్కరిస్తూ వచ్చిన హెమెడ్తీ గత మంగళవారం నాడు తన నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో 'గవర్నమెంట్ ఆఫ్ పీస్ అండ్ యూనిటీ'ని ఏర్పాటు చేశాడు. పక్షం రోజుల క్రితం తన పారా మిలిటరీ అధీనంలో ఉన్న దేశ రాజధాని ఖార్టూమ్‌ను జనరల్ బుర్హాన్ సైన్యానికి కోల్పోయాడు. అయినప్పటికీ తమ ప్రభుత్వమే సూడాన్ ప్రజల నిజమైన ప్రతినిధి అంటున్న హెమెడ్తీ బుర్హాన్‌తో రాజీకి ససేమిరా అంటున్నాడు. రెండు సంవత్సరాలుగా ఈ ఇరువురి సైన్యాల మధ్య సూడాన్ కకావికలమై పోయింది. తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాచరిక ప్రభువులు ఈ ప్రత్యర్థులలో చెరొకరి కొమ్ముకాస్తూ అంతర్యుద్ధ పరిస్థితిని మరింత విషమింపచేస్తున్నారు.

అంతర్యుద్ధంతో నెలకొన్న విపత్కర పరిస్థితులు 'ప్రపంచంలోని అత్యంత భయంకరమైన ఆకలి సంక్షోభం' అని ఐక్యరాజ్యసమితి అభివర్ణించింది. మూడు కోట్ల మందికి పైగా సూడానీలు మానవతా పూర్వక సహాయంపై ఆధారపడి ఉన్నారు. లక్షలాది కుటుంబాలు సర్వం కోల్పోయాయి. అనేక లక్షల మంది ఇరుగు పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. హెమెడ్తీ నేతృత్వంలోని పారామిలిటరీ దళాలు పాల్పడిన అకృత్యాలు యుద్ధనేరాలే అని పరిశీలకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ప్రపంచ ప్రజలకు మానవతాపూరిత సహాయాన్ని సమకూర్చే 'యుఎస్ ఎయిడ్' కార్యకలాపాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పూర్తిగా నిలిపివేయడంతో సూడాన్‌లో సహాయ చర్యలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సూడాన్ ప్రజల అవస్థలు మాటల్లో చెప్పలేని విధంగా మిక్కుటమయ్యాయి. అమెరికా నిర్దాక్షిణ్య నిర్ణయం సూడాన్ ప్రజలను వారి కర్మకు వదిలివేయడమే అయింది.

అభివృద్ధికి తోడ్పడే కీలక సహజ వనరులు ఉన్నప్పటికీ సూడాన్ రాజకీయంగా, ఆర్థికంగా పథభ్రష్టమవడం ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్య పద్ధతులు, సమాజంలో ప్రజాస్వామిక నైతికత అవసరమనే సత్యాన్ని ఎత్తి చూపుతోంది. కడుపు తరుక్కుపోయే కన్నీళ్ల విషాద గాథలు కళ్ల ముందుకు వచ్చినప్పుడు ఆ అభాగ్యగతులకు కనీస సానుభూతి, సహానుభూతి చూపడం విశాల ప్రపంచ విధ్యుక్త ధర్మం.

వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక మాంద్యాలు, అధోగతులు!

ఆర్థిక విషయాలు రాజకీయాల మంచిచెడులను నిర్ణయిస్తాయంటే నమ్మని వాళ్లు ఇప్పటికీ ఉన్నారు. మనుషులను కొన్ని విలువలు నడిపిస్తాయనీ అన్నిటినీ ఆర్థికంతో ముడిపెట్టలేమన్న వాదనలూ బలంగానే వినిపిస్తాయి. ఆర్థిక అంశాలను పూర్తిగా విస్మరించి ఊహాలోకాల్లోకి వెళ్లటం అసాధ్యం. అలా వెళ్లటానికి కూడా జీవితంలో ఆర్థిక వెసులుబాట్లు ఉండాలి. వ్యవసాయం కనిపెట్టకముందు మనుషుల ఆలోచనలు ఒకరకంగా ఉండేవి. అప్పుడు దేవుళ్లు ప్రత్యేకంగా ఉండేవారు. నీతులూ భిన్నంగా ఉండేవి. వ్యవసాయం స్థిరపడి, రాచరికాలు ఏర్పడిన తర్వాత పరిస్థితి మారిపోయింది. కొందరు శారీరక శ్రమలేకుండా ఇతర వ్యాపకాల్లో నిష్ణాతులు కావటానికి వీలుపడింది. వ్యవసాయ సంపదలో వాటాలు పొందినవారు మేధావులు అయ్యారు. రుషులుగా మారారు. కవులు అయ్యారు. కళాకారులుగా తయారయ్యారు. ప్రవక్తలుగా వెలుగొందారు. వాణిజ్యకారులుగా వ్యవహరించారు. ఇక గడచిన అయిదారొందల ఏళ్లల్లో వాణిజ్య ప్రయోజనాల కోసం ఘోర యుద్ధాలూ జరిగాయి.

ఇదంతా గతచరిత్ర అనుకోవచ్చు. ఈనాటి సమాజంలో వాణిజ్య ప్రయోజనాలను శాంతియుతంగా పొందొచ్చని భావించొచ్చు. అందుకు ఉదాహరణలనూ చెప్పుకోవచ్చు. కానీ వాణిజ్య ప్రయోజనాలు గతంలో లాగే యుద్ధాలకూ నియంతృత్వాలకూ దారితీసే పరిస్థితులు ఇప్పటికీ ప్రబలంగానే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సాగిస్తున్న వాణిజ్య యుద్ధాలను చూస్తే ఇదే భావన కలుగుతుంది. చైనా కేంద్రంగా ట్రంప్ సాగిస్తున్న ఆ యుద్ధాలు.. ఎటు దారితీస్తాయన్న దానిపై భిన్న అంచనాలు ఉన్నాయి. కానీ దేశాల మధ్య అసలు యుద్ధాలకు అవి దారితీయవని ఖచ్చితంగా చెప్పలేం! యుద్ధమంటే మనుషుల హతమే కాదు. వాస్తవాల హతం కూడా! అబద్ధాలు, వక్రీకరణలు లేకుండా యుద్ధాలు ఉండవు. ఈనాటి వాణిజ్య యుద్ధమూ దీనికి మినహాయింపు కాదు.

తీవ్ర వాణిజ్యలోటు, చాంతాడంత అప్పులతో అమెరికా సతమతమవుతోంది. అమెరికా చేసే ఎగుమతుల కంటే ఏదైనా దేశం నుంచి దిగుమతులు ఎక్కువ ఉంటే ట్రంప్ దృష్టిలో దోపిడీ జరుగుతున్నట్లే లెక్క! అమెరికా కంటే ఏ దేశమైనా సుంకాలను కాస్త ఎక్కువగా విధిస్తే ఆ దేశం అమెరికాపై అత్యాచారానికి పాల్పడినట్లే లెక్క! స్వేచ్ఛా వాణిజ్యాన్ని శ్లాఘించిన ఆర్థికవేత్తలెవరూ ఇలాంటి వాదన తలెత్తుతుందని ఊహించలేదు. స్వదేశీ పరిశ్రమల రక్షణకు అధిక సుంకాలను కొంతకాలం విధించాలని ప్రతిపాదించిన ఆర్థికవేత్తలు ఉన్నారు. ఒక దేశం వాణిజ్యలోటుకు ఇతర దేశాల దోపిడీయే కారణమని సూత్రీకరించిన ఆర్థికవేత్తలు ప్రధాన స్రవంతిలో పెద్దగా కనపడరు.

అమెరికా ఎందుకంతగా దిగుమతులపై ఆధారపడాలి? శాస్త్ర, సాంకేతికతల్లో అగ్రగామిగా ఉండగా ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఒకనాటి అమెరికా పాలకులకు ట్రంప్‌కు ఉన్నంతగా దేశభక్తి లేకుండా పోయిందా? ఈ ప్రశ్నల లోతుల్లోకి వెళితే అమెరికా ఎలాంటి మార్పులకు లోనైందో అర్థమవుతుంది. వాటితో ఎవరు లాభపడ్డారో తెలుస్తుంది. అమెరికానే అనుసరిస్తూ దాని స్థాయికి చేరుకోవాలని ప్రయత్నిస్తున్న చైనాను కేంద్రంగా చేసుకుంటూ సాగుతున్న వాణిజ్య యుద్ధ నైజమూ బోధపడుతుంది.

అమెరికా నుంచి తయారీ పరిశ్రమలు తరలటానికి ఇతర దేశాల ఒత్తిడి లేదు. పరిశ్రమలు, సేవలు ఇతర దేశాలకు తరలిపోవటాన్ని వ్యాపార పరిభాషలో 'ఆఫ్‌షోరింగ్' అంటారు. ఈ ఆఫ్‌షోరింగ్‌ను వివరిస్తూ లక్షల విశ్లేషణలు వచ్చాయి. వాటన్నిటిలోనూ ఒక విషయంలో ఏకాభిప్రాయం ఉంది. తక్కువ వేతనాలకు దొరికే కార్మిక–నిపుణుల శ్రమ, చౌక ధరలకు ముడిసరుకుల లభ్యత ఒకనాటి అమెరికా పరిశ్రమలకు అవసరమయ్యాయి. ఎక్కువ లాభాల కోసం ఆ అవసరం తలెత్తింది. వేతనాలు పెరిగాలని ఒత్తిడిచేసే కార్మిక సంఘాలు, సంక్షేమ పథకాల కోసం పన్నులను పెంచాల్సిన అవసరాలు, పర్యావరణ పరిరక్షణ కోసం అమల్లోకి వచ్చిన కట్టుదిట్టమైన చట్టాలు.. అమెరికా, పశ్చిమ యూరోపుల్లో పరిశ్రమల లాభాలను బాగా ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. ఆ పరిస్థితుల్లో లాభాలను నిలబెట్టుకోవటమూ కష్టంగా మారింది. లాభాల్లో ఎదుగూబొదుగూ లేకుండా పరిశ్రమలు ఉండలేవు. పోటీలో నిలబడాలంటే అధిక లాభాలను అన్వేషించాలి. అందుకే 1960ల నాటికి అమెరికా పరిశ్రమలను తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందగలిగే దేశాలకు తరలించటం అనివార్యమైంది. అప్పటి నుంచి 2015 వరకూ ఆఫ్‌షోరింగ్ అనేది అవిచ్ఛిన్నంగా కొనసాగింది. 1990ల నుంచి 2015 మధ్యకాలాన్ని దాని ఉచ్ఛదశగా భావించొచ్చు. 1989 నుంచీ యూరపులో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోవటం, అంతకు పదేళ్లకు ముందే చైనాలో ప్రైవేటు రంగానికి తలుపులీయటం, 1991లో భారత్‌లో పెద్దఎత్తున ఆర్థిక సంస్కరణలు మొదలవ్వటం.. ఆనాటి ప్రధాన సంఘటనలుగా చెప్పుకోవచ్చు. అవన్నీ ఆఫ్‌షోరింగ్‌కు బాగా తోడ్పడ్డాయి. పరిశ్రమలతో పాటు సేవలు, ఐటీ రంగంలో కూడా ఆఫ్‌షోరింగ్ మొదలైంది. బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్, బ్యాకెండ్ ఆఫీస్ యాక్టివిటీస్, మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్, సాఫ్ట్‌వేర్ కోడింగ్, డిజిటల్ ఆఫ్‌షోరింగ్, వర్చువల్ ఆఫ్‌షోరింగ్.. ఇలా ఎన్నో పేర్లతో పలు పనులు.. తక్కువ వేతన ఖర్చు, తక్కువ ఆఫీసు నిర్వహణా భారంతో అభివృద్ధి చెందుతూన్న దేశాలకు తరలి వచ్చాయి. జర్మనీకి చెందిన తయారీ పరిశ్రమలు పలు విదేశాలకు తరలాయి. అందులో 80శాతం పరిశ్రమలు వేతన ఖర్చులను తగ్గించుకోవటానికే తరలి వెళ్లాయి. ఇతర దేశాల్లో పనిచేయించుకోగలిగిన ఉద్యోగాలెన్ని అన్న విషయంలో కూడా చాలా లెక్కలు ఉన్నాయి. ఒక అంచనా ప్రకారం 11శాతం నుంచి 38 శాతం ఉద్యోగాలు అందుకు అనువైనవిగా తేలాయి. మరో అధ్యయనం ప్రకారం.. అమెరికాలో సేవలకు సంబంధించిన 515 రకాల ఉద్యోగాల్లో 160 వరకూ ఇతర దేశాల వ్యక్తులతో చేయించగలిగినవిగా లెక్కించారు. 2021–22 నాటి మరో అంచనా ప్రకారం అమెరికాలోని ఉద్యోగాల్లో 26 శాతం వాటిని విదేశాల్లోనే చేయించుకోవచ్చని తేల్చారు.

అమెరికాకు చెందిన పెద్ద సంస్థలు చాలా దేశాల్లో పరిశ్రమలూ కంపెనీలనూ నడుపుతున్నాయి. 2014 నాటికే 14 మిలియన్ ఉద్యోగులు వాటిల్లో పనిచేస్తున్నారు. అందులో 17 లక్షలు ఒక్క చైనాలో ఉంటే వాటిల్లో సగం మంది తయారీ రంగంలోనే పనిచేస్తున్నారు. మెక్సికోలో అమెరికన్లు నడుపుతున్న కంపెనీల్లో 7,06,200 మంది ఉన్నారు. ఇప్పుడు ఈ రెండు దేశాలపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. విదేశాల్లోని అమెరికా కంపెనీల్లో చౌకగా తయారైన ఉత్పత్తులను స్థానిక మార్కెట్లల్లో అమ్మి లాభాలను గడించటం ఒకవైపు చిత్రమే. వాటిని అమెరికాకు దిగుమతి చేసుకుని సొంత పౌరులకు చౌకగా అందించటమే ప్రధానమైంది. యాపిల్ ఫోన్లే ఇందుకు ఉదాహరణ. ఇప్పటికీ అవి అమెరికాలో తయారు కావు. అయిదారేళ్ల క్రితం వరకూ మొత్తం అన్నీ చైనా నుంచి రావాల్సిందే.

వేతన భారాలనూ ఇతర ఖర్చులనూ గణనీయంగా తగ్గించుకునే లక్ష్యంతో పరిశ్రమలనూ సేవలనూ విదేశాలకు తరలించి దశాబ్దాల పాటు అమెరికా బాగా లాభపడింది. దీనివల్ల కొన్నిరకాల ఉద్యోగాలు పోతే మరెన్నో కొత్త ఉద్యోగాలు అమెరికాలో వచ్చాయనీ ఆఫ్‌షోరింగ్‌తో అంతా నష్టం జరిగిందనే వాదన నిజం కాదనే అధ్యయనాలు కూడా చాలానే ఉన్నాయి.

అసలు విషయం ఏమిటంటే అమెరికాకు కావాల్సిన వస్తు, సేవలను అందిస్తూ ఆ మార్కెట్టుపై ఆధారపడి ఉన్నంతవరకూ చైనాతో ఏ ఇబ్బందీ కలగలేదు. సాంకేతిక, శాస్త్ర రంగాల్లో సొంత పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, రక్షణరంగంలో కూడా ముందుకు దూసుకుపోవటంతో పాటు ఇతర దేశాల్లో తన ఉత్పత్తులకు, సేవలకు మార్కెట్‌ను చైనా విస్తరించుకోవటంతో సమస్య మొదలైంది. దేశాల మధ్య వ్యాపారపరమైన అడ్డంకులను తొలగించటానికి ఏర్పాటైన వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ లాంటివన్నీ అమెరికా ప్రోద్బలంతోనే ఏర్పడ్డాయి. అవన్నీ ఇప్పుడు కంటగింపుగా మారాయి. అమెరికాకు అగ్రతాంబూలం అందకుండా అవే అడ్డంకిగా మారాయని అంటూ వాటి నుంచి వైదొలుగుతామనే హెచ్చరికలూ పెరిగాయి. ఆఫ్‌షోరింగ్ స్థానంలో రీషోరింగ్ నినాదం మొదలైంది. అమెరికాకు అవసరమైన అన్ని ఉత్పత్తులూ స్వదేశంలోనే జరగాలనే ఆర్భాటత్వమూ ఆరంభమైంది.

చేజారుతున్న ఆధిపత్యాన్ని నిలబెట్టుకోటానికి, జాతీయభద్రత పేరుతో చైనా ఉత్పత్తులను నిలువరించే కఠిన చర్యలతో మొదలుపెట్టి, అసాధారణ వాణిజ్యయుద్ధానికి అమెరికా శ్రీకారం చుట్టింది. ఆధిపత్యం కోల్పోయే పరిస్థితి ఉన్న చోట అభద్రతలూ, అనిశ్చితులూ కూడా వేగంగా ముసురుకుంటాయి. ట్రంప్‌లాంటి నేతలు ఆ పరిస్థితుల నుంచే బలపడతారు. దేశపరిరక్షకుల అవతారంతో చెలరేగి పోతారు. అధిక సుంకాలతో ఆర్థికవ్యవస్థను అన్నిసార్లూ రక్షించుకోలేరు. 1920–1930ల్లో అమెరికా విధించిన అత్యధిక దిగుమతి సుంకాల విధింపుతో తేలింది అదే. ప్రపంచ వ్యాప్త ఆర్థిక మహామాంద్యానికి ఆ సుంకాలే ప్రధాన కారణం అయ్యాయి. ఆ మాంద్యమే హిట్లర్ లాంటి వాళ్లను సృష్టించి రెండో ప్రపంచ యుద్ధానికి దారులు పరచింది. 1922లో ఫోర్డ్నీ–మెకంబర్ చట్టంతో అమెరికా సగటు దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచింది. అమెరికా చరిత్రలో అది అధికం. యూరోపు వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను దండిగా విధించాలన్న డిమాండ్లూ మొదలయ్యాయి. వాటికి సరేనంటూ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి హెర్బర్ట్ హూవర్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ఇతర ఉత్పత్తులపై కూడా సుంకాలను పెంచాలనే ఒత్తిడి మొదలైంది. ఈ లోగా స్టాక్ మార్కెట్ కుప్పకూలటంతో (1929) స్మూట్–హాలీ పేరుతో తెచ్చిన దిగుమతి సుంకాల చట్టం ఆర్థికమాంద్యాన్ని తీవ్రం చేసింది. అమెరికాను వాణిజ్యపరంగా ఏకాకిగా మార్చింది. జరిగే ప్రమాదాన్ని పసిగట్టి 1000 మంది ఆర్థికవేత్తలు ఆ చట్టాన్ని వీటో చేయాలని హూవర్‌కు పిలుపునిచ్చారు. లక్ష్యపెట్టలేదు. అమెరికాని చూసి రెండేళ్లల్లో మరో 24 దేశాలు అధిక సుంకాలతో రక్షణ గోడలు కట్టుకున్నాయి. యూరప్–అమెరికాల మధ్య ఎగుమతులు–దిగుమతులు 1929–32 మధ్య 66 శాతం పడిపోయాయి. వాణిజ్యం అస్తవ్యస్తమైంది. అంతటా ఆర్థిక అస్థిరత చుట్టుముట్టింది. రెండో ప్రపంచ యుద్ధానికి రంగం సిద్ధమైంది. వాణిజ్య యుద్ధాలతో జరిగే దారుణాలకు ఇంతకంటే నిదర్శనం లేదు! చరిత్ర పునరావృతం అవుతుందా?



> చేజారుతున్న ఆధిపత్యాన్ని నిలబెట్టుకోటానికి, జాతీయభద్రత పేరుతో చైనా ఉత్పత్తులను నిలువరించే కఠిన చర్యలతో మొదలుపెట్టి, అసాధారణ వాణిజ్యయుద్ధానికి అమెరికా శ్రీకారం చుట్టింది. ఆధిపత్యం కోల్పోయే పరిస్థితి ఉన్న చోట అభద్రతలూ, అనిశ్చితులూ వేగంగా ముసురుకుంటాయి. ట్రంప్‌లాంటి నేతలు ఆ పరిస్థితుల నుంచే బలపడతారు. దేశపరిరక్షకుల అవతారంతో చెలరేగిపోతారు. అధిక సుంకాలతో ఆర్థికవ్యవస్థను అన్నిసార్లూ రక్షించుకోలేరు. 1920–1930ల్లో అమెరికా విధించిన అత్యధిక దిగుమతి సుంకాల విధింపుతో తేలింది అదే. ప్రపంచ వ్యాప్త ఆర్థిక మహామాంద్యానికి ఆ సుంకాలే ప్రధాన కారణం అయ్యాయి. ఆ మాంద్యమే హిట్లర్ లాంటి వాళ్లను సృష్టించి రెండో ప్రపంచ యుద్ధానికి దారులు పరచింది.



■ రాహుల్ కుమార్

> అసలు విషయం ఏమిటంటే అమెరికాకు కావాల్సిన వస్తు, సేవలను అందిస్తూ ఆ మార్కెట్టుపై ఆధారపడి ఉన్నంతవరకూ చైనాతో ఏ ఇబ్బందీ కలగలేదు. సాంకేతిక, శాస్త్ర రంగాల్లో సొంత పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, రక్షణరంగంలో కూడా ముందుకు దూసుకుపోవటంతో పాటు ఇతర దేశాల్లో తన ఉత్పత్తులకు, సేవలకు మార్కెట్‌ను చైనా విస్తరించుకోవటంతో సమస్య మొదలైంది.

శ్రేయో సమాజమే ధరిత్రికి రక్ష

మట్టివాసన

వాతావరణ మార్పును అరికట్టే చర్యలు భారత్ చేపట్టకూడదు– ఇవి, 'యూరోపియన్ దేశాల వాతావరణ మార్పు నిరోధక కార్యక్రమ' ప్రతినిధులతో సంభాషిస్తూ నేను అన్న మాటలు. ఆ మాటలకు వారు కంగారుపడడాన్ని నేను గమనించాను. నేను ఏ కారణాలతో ఆ అభిప్రాయాన్ని వ్యక్తం చేశానో వారికి వివరించాను. భారత్ లాంటి దేశాలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్లలో అభివృద్ధి ప్రధానమైనది. అభివృద్ధి అనేది సమ్మిళితంగా, సుస్థిరంగా ఉండి తీరాలని మనం నేడు సునిశ్చితంగా విశ్వసిస్తున్నాం కదా. స్థానిక కాలుష్యాన్ని తగ్గించేందుకు, హరిత జీవనాధారాలను పెంపొందించేందుకు మేము చేపట్టే చర్యలే హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించుతాయి. ఈ విధంగా గ్రీన్ హౌజ్ వాయు ఉద్గారాలను తగ్గించేందుకు ఉద్దేశించిన మార్పు.. 'వాతావరణ మార్పు నిరోధక కార్యాచరణ ప్రణాళిక' (నేషనల్లీ డిటర్‌మైన్డ్ కంట్రిబ్యూషన్ – ఎన్‌డీసీ) అభివృద్ధి సాధన, వాతావరణ మార్పును అరికట్టడం అనే సహ–ప్రయోజనాల ప్రాతిపదికన ఉంటుంది. ఆ ప్రణాళికను సరైన విధంగా అమలుపరిచిన పక్షంలో సంభవించే అభివృద్ధి తక్షణ వాతావరణ మార్పు సంక్షోభాన్ని కూడా నివారిస్తుంది.



■ సునీతా నారాయణ్

ఈ ద్వంద్వ లక్ష్యాల (అభివృద్ధి సాధన, వాతావరణ మార్పు నిరోధం)ను సాధించడమనేది మా ప్రయోజనాలను కాపాడుకునేందుకు చాలా ముఖ్యం. వాతావరణ మార్పు ప్రభావాలకు మేము అమితంగా నష్టపోతున్నాం. అయితే భిన్న వ్యూహంతో అభివృద్ధి సాధనకు మేము పూనుకుంటే వాతావరణ మార్పును నివారించే ఏకైక లక్ష్యంతో రూపొందించిన కార్యాచరణ పథకాల వల్ల ఉత్పన్నమయ్యే అనూహ్య ప్రమాదాలను నివారించుకోగలుగుతాము. ఏమంత సులువు కానివి, సరళమైనవి కానివీ అయిన మేము తీసుకుంటున్న చర్యలు ప్రజల ఆమోదాన్ని పొందేందుకు దోహదం చేస్తాయి.

ఇంతకూ నా ఈ వాదనలను యూరోపియన్ వాతావరణ మార్పు నిరోధక నిపుణులు ఆమోదించారని నేను కచ్చితంగా చెప్పలేను. ఎందుకంటే యూరోపియన్ దేశాలు ప్రధానంగా హరిత గృహ వాయు ఉద్గారాల తగ్గింపునకు మాత్రమే అమిత ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ అంశాన్ని విపులీకరిస్తాను. చాలా ఇతర దేశాల వలే భారత్ కూడా సత్వర సమ్మిళిత అభివృద్ధిని సాధించవలసి ఉన్నది. కోట్లాది మందికి ఉపాధి, ఆరోగ్య భద్రత, విద్య, గృహవసతి, విద్యుత్ సరఫరా సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఇదే భారతదేశ అభివృద్ధి నమూనాలో ప్రథమ ప్రాధాన్యం పొందుతున్న అంశం. సమస్త ప్రజల అవసరాలను తీర్చే విధంగా మా అభివృద్ధి ఉండి తీరాలి. ఈ దృష్ట్యా అభివృద్ధి నమూనాను మార్చుకోవలిసిన అవసరమున్నది. పెట్టుబడి–సాంద్ర, సహజ వనరుల వనరుల –సాంద్ర అభివృద్ధి మార్గాన్ని మేము అనుసరించలేము. ఆ అభివృద్ధి పథం పర్యావరణ విధ్వంసానికి, సమాజంలో అసమానతల పెరుగుదలకు మాత్రమే దారితీస్తుంది. పాశ్చాత్య దేశాల అభివృద్ధి నమూనాను భారత్ అనుసరించకూడదని, అనుసరించడం వాంఛనీయం కూడా కాదనే వాస్తవాన్ని దశాబ్దాల అనుభవాల ఆధారంగా మేము గ్రహించాము. అభివృద్ధి మూలంగా ధ్వంసమైన పర్యావరణాన్ని పునరుద్ధరించుకునేందుకు అవసరమైన ఆర్థిక వనరులు మాకు లేవు. అభివృద్ధి సాధనకు ఉద్దేశించిన విధానాలలోనే వాతావరణ చర్యలు అంతర్భాగంగా ఉండి తీరాలి.



> సహజవనరులను మితిమీరిన స్థాయిలో వినియోగించుకుని సరుకులు ఉత్పత్తి, ఎగుమతులతో స్థూల దేశీయోత్పత్తి పెంపుదలే లక్ష్యంగా ఉండే ఆర్థిక వ్యవస్థ భారత్‌కు మేలు చేయదు. స్థానిక జీవనాధారాలను ఇతోధికంగా పెంపొందించేలా పర్యావరణ భద్రత, అభివృద్ధికి తోడ్పడే ఆర్థిక వ్యవస్థే మనకు శ్రేయస్కరమైనది. వాతావరణ మార్పును నిరోధించే భారత్ కార్యాచరణ పథకం ప్రజల సంక్షేమానికి, ధరిత్రి రక్షణకు ఉపయోగపడేలా ఉండాలి.

ఉదాహరణకు 'వాయు' కాలుష్యాన్ని నివారించలేమని మాకు తెలుసు. చలనశీలతకు కొత్త రూపమివ్వకుండా వాయుకాలుష్య సమస్యను పరిష్కరించుకోలేము. వ్యక్తిగత వాహనాల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. రోడ్లు అన్నీ వాటితో నిండిపోతున్నాయి. రద్దీని, కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఈ కారణంగానే విద్యుత్ వాహనాల వినియోగాన్ని పాశ్చాత్య దేశాలు ప్రోత్సహిస్తున్నాయి.

పారిశ్రామిక రంగం వ్యయాల తగ్గుదలకు, పోటీ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు తోడ్పడే సాంకేతికతల అభివృద్ధికి పెద్ద ఎత్తున మదుపులు చేయవలసి ఉందనే వాస్తవాన్ని మా అనుభవాల నుంచి తెలుసుకున్నాం. ఉదాహరణకు సిమెంట్ పరిశ్రమనే తీసుకోండి. అది ఫ్లైయాష్‌ను సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా ముడి పదార్థంగా ఉపయోగించుకుంటోంది. దీని వల్ల విద్యుత్ ఉత్పాదన వ్యయాలు తగ్గుతున్నాయి. తక్కువ–కార్బన్ ఉద్గారాల పారిశ్రామికీకరణ భవిష్యత్తు అదే విధంగా సమరీతిలో లబ్ధికరంగా ఉండగలదు.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే హరిత ఆర్థిక వ్యవస్థ భావనపై కొత్త ఆలోచన చేయవలసిన అవసరమున్నది. దాని నిర్మాణాన్ని పునః రూపొందించుకోవాలి హరిత ఉపాధి గురించి ప్రశంసాపూర్వక, ప్రోత్సాహకరమైన మాటలు మాట్లాడితే సరిపోదు, పునరుద్ధరణీయ ఇంధనాలు, విద్యుత్ వాహనాలతో జీవనోపాధుల అవకాశాలు పెరగవుగాక పెరగవు. నిజానికి బొగ్గు ఆధారిత వేడి కొలిమి (బ్లాస్ట్ ఫర్నేస్) నుంచి విద్యుత్ ఫర్నేస్‌కు మారినప్పటికీ బ్రిటన్‌లో వేలాది ఉద్యోగాలు మటుమాయమయ్యాయి. ఈ కారణంగానే ప్రజలు వాతావరణ మార్పు గురించి ఎంతగా కలవరపడుతున్నారో జీవనోపాధుల గురించి కూడా అంతే ఆందోళన చెందుతున్నారు.

చెప్పవచ్చినదేమిటంటే స్థానిక జీవనాధారాలకు స్థానిక వనరులను ఉపయోగించుకోవడం ద్వారా భారత్ తన ఆర్థిక వ్యవస్థను సరికొత్త రీతిలో నిర్మించుకోవాలి. తద్వారా వాతావరణ వైపరీత్యాలను తట్టుకోగలగడంతో పాటు ఉపాధికై ప్రజల వలసలను కూడా నిలిపివేయగలుగుతాము. సహజవనరులను మితిమీరినస్థాయిలో వినియోగించుకుని సరుకులు ఉత్పత్తి, ఎగుమతులతో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పెంపుదలే లక్ష్యంగా ఉండే ఆర్థిక వ్యవస్థ భారత్‌కు మేలు చేయదు. స్థానిక జీవనాధారాలను ఇతోధికంగా పెంపొందించేలా పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడే ఆర్థిక వ్యవస్థే భారత్‌కు శ్రేయస్కరమైనది. వాతావరణ మార్పును నిరోధించే భారత్ కార్యచరణ పథకం ప్రజల సంక్షేమానికి, ధరిత్రి రక్షణకు ఉపయోగపడేలా ఉండాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్,

భూదానోద్యమానికి వజ్రోత్సవం!


భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గాంధీజీ కన్న కలలను నెరవేర్చాలని ఎంతో తాపత్రయపడిన మొట్టమొదటి వ్యక్తి ఆచార్య వినోబా భావే. ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి విడిపించుకున్న భారతదేశాన్ని జన సామరస్య దేశంగా, సుసంపన్న, సుస్థిర దేశంగా చూడాలని ఆశించారు. సమాజంలో సామాన్య, సగటు ప్రజా జీవన అభ్యున్నతి కోసం, సామాజిక, ఆర్థిక తారతమ్యాల నిర్మూలన కోసం దేశవ్యాప్త సర్వోదయ వికాసానికి 'స్వచ్ఛంద భూసేకరణ', 'చట్టబద్ధమైన భూవితరణ' జరగాలని, దానికి మళ్లీ భారతదేశంలో ప్రజలందరినీ కదిలించే ఒక సామరస్య పోరాటం చేయాలని భావే నిర్ణయించుకున్నారు. దేశమంతా పాదయాత్ర చేసి, 'స్వచ్ఛంద భూదాన్' ఉద్యమానికి నాంది పలికారు. ఈ ఉద్యమ స్ఫూర్తికి ఈ ఏడాది ఏప్రిల్ 18 నాటికి 74 ఏళ్ళు నిండి, 75వ (వజ్రోత్సవ) సంవత్సరం ఆరంభమైంది.

పాదయాత్రలో భాగంగా నల్గొండ జిల్లా పోచంపల్లి గ్రామానికి చేరుకున్న వినోబా భావే అక్కడి ప్రజల స్థితిగతులను తెలుసుకుని, స్థానిక భూస్వామి వెదిరే రామచంద్రారెడ్డిని కలిసి మాట్లాడారు. వినోబా భావే భావోద్వేగమైన ప్రసంగానికి మంత్రముగ్ధుడైన జమీందార్ రామచంద్రారెడ్డి, తక్షణమే స్పందించి 100 ఎకరాల భూమిని దానంగా ఇస్తున్నట్లు ప్రకటించి, 1951, ఏప్రిల్ 18న దానపత్రాన్ని భావేకు అందించారు. ఇది దేశంలోనే తొట్ట తొలి స్వచ్ఛంద భూదానం. అందుకే ఈ రోజును భారతదేశ సామాన్య ప్రజలంతా 'భూదాన్ డే'గా జరుపుకుంటున్నారు.

1951 నుంచి 1957 వరకూ విడతలు విడతలుగా భారతదేశంలోని అన్ని రాష్ట్రాలను తన పాదయాత్ర ద్వారా వినోబా భావే సందర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల ఎకరాల భూమిని దానంగా స్వీకరించి, సామాన్యుడి సర్వోదయానికి బలమైన పునాది వేశారు. ఈ భూదాన్ ఉద్యమం ప్రపంచ దేశాలను ఎంతగానో ప్రభావితం చేసింది.

దేశ వ్యాప్తంగా తాను దానంగా స్వీకరించిన భూమిని తానే స్వయంగా ప్రజలకు పంచేస్తే, దానిని ప్రజలు తాను చేసిన సహాయంగానే చూస్తారని, దానికి చట్టబద్ధత ఉండదని, వారు భవిష్యత్‌లో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకి భావే తెలిపారు. అందుకే ఆ భూమిని నిరుపేదలకు పంచడానికి ఒక సమగ్ర చట్టాన్ని రూపొందించి, తాను భూదానంగా స్వీకరించిన భూములను ఆ చట్ట పరిధిలోకి తీసుకువచ్చి, ప్రభుత్వ ప్రమేయంతో తానే స్వయంగా ప్రజలందరికీ చట్టబద్ధంగా ఆ భూములను పంచేందుకు సహకరించాలని నెహ్రూని కోరారు.

> భూమిని దానంగా స్వీకరించి, సామాన్యుడి సర్వోదయానికి బలమైన పునాది వేశారు ఆచార్య వినోబా భావే. ఈ భూదానోద్యమం ప్రపంచ దేశాలను ఎంతగానో ప్రభావితం చేసింది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాది ఎకరాల భూదాన్ భూములు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకుని ఉన్నాయి.



1965లో అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో దీనిని భారతదేశ సమగ్ర చట్టంగా ఆమోదించారు. అయితే ఈ చట్టాన్ని అమలు చేసే బాధ్యతను మాత్రం ఆయా రాష్ట్రాలకు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 1965, మే 10 నుంచి ఈ 'భూదాన్–గ్రామదాన్' చట్టం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో సూచించిన ప్రకారంగా ఆయా రాష్ట్రాలలో వినోబా భావే సూచించిన వారికి అధికారాన్ని ప్రకటిస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు 11 మంది సభ్యులతో కూడిన 'భూదాన్ యజ్ఞ బోర్డు'ను నిర్మాణం చేయాలి. ఆ బోర్డుని ఆ రాష్ట్ర 'భూదాన్ యజ్ఞ బోర్డు'గా గుర్తిస్తూ, నాలుగేళ్ళ పాటు కాలపరిమితి కలిగిన అధికారాలను కలిగిఉండేలా అధికారికంగా గెజిట్ ద్వారా ప్రభుత్వాలు ప్రకటించాలి. సభ్యుల ఎంపికలో ప్రభుత్వ ప్రమేయం ఉండకూడదు. వినోబా భావేకు గాని, ఆయన ధృవీకరించిన గాంధేయవాద సంస్థ 'సర్వ సేవా సంఘ్'కు గాని భూదాన్ భూములన్నీ పేద ప్రజలకు పంపిణీ జరిగే వరకూ ఈ చట్టం యథావిధిగా అమలులో ఉండాలి. ఈ విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాటు అనేక రాష్ట్రాలలో 1969లో మొదటగా 'భూదాన్ యజ్ఞ బోర్డు'లు ఏర్పడి, పని ప్రారంభించాయి.

భూములను దానం పొందిన గ్రహీతలు సక్రమంగా వాటిని వినియోగించుకుంటున్నారా? లేదా? అనే సమీక్ష కూడా తరచూ జరుపుతూ, తదనుగుణ చర్యలు కూడా తీసుకోవాలి. ఇదీ, ఆయా 'భూదాన్ యజ్ఞ బోర్డు' సభ్యులు పారదర్శకంగా చేయవలసిన పని. అయితే 1982, నవంబరు 15న ఆచార్య వినోబా భావే హఠాన్మరణం తరువాత 'భూదాన్–గ్రామదాన్' చట్టం అమలు విధానాలు అనేక రాష్ట్రాలలో మెల్లమెల్లగా తగ్గుతూ వచ్చాయి. అందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కూడా ఉండడం దురదృష్టకరం.

మహారాష్ట్ర, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో 'భూదాన్–గ్రామదాన్' చట్టం ఎంతో పటిష్టంగా అమలు జరుగుతోంది. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కొన్ని రాష్ట్రాలలో ఈ చట్టాన్ని కొన్ని పరిస్థితులు మరుగున పడేశాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ చట్టానికి ఎన్నో తూట్లు పడ్డాయన్న విషయం చాలా స్పష్టంగా తెలుస్తోంది.

వినోబా భావే తన మరణానికి ముందు ఒక వీలునామా రాశారు. దాని ద్వారా తన మరణానంతరం భూదాన్ భూములపైనా, భూదాన్ యజ్ఞ బోర్డు నియామకంపైనా సర్వాధికారాలు 'సర్వ సేవా సంఘ్' అనగా వార్ధాలోని 'అఖిల భారత సర్వోదయ మండలి'కు చెందుతాయని నిర్ధారించారు. ఈ వీలునామాను దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, పాటిస్తున్నాయి. కానీ ఒక్క ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సర్వ సేవా సంఘ్‌కు సంబంధం లేకుండా దొడ్డిదారిన 1988, 2012లలో అడ్డగోలుగా అప్పటి ప్రభుత్వాల సొంత నిర్ణయాలతో భూదాన్ యజ్ఞ బోర్డులను నియమించాయి. సర్వ సేవా సంఘ్ న్యాయస్థానాల ద్వారా న్యాయాన్ని పొందే లోపు ఆయా బోర్డుల కాలపరిమితి ముగిసిపోయింది. ఈ బోర్డుల పదవీ కాలాలలోనే అనేక వేల ఎకరాలు అక్రమంగా చేతులు మారాయి.

ఇక 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగినప్పుడు భూదాన్ భూములు– సుమారు 80 వేల ఎకరాల ఆంధ్రప్రదేశ్‌లోనూ, సుమారు 1 లక్షా 30 వేల ఎకరాలు తెలంగాణలోనూ ఉన్నట్లు లెక్కలు చూపించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా ఇప్పటివరకూ భూదాన్ యజ్ఞ బోర్డుల నిర్మాణం జరగలేదు. అయితే 2023లో మాత్రం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్వ సేవా సంఘ్ సిఫారసు లేకుండా తమ పార్టీకి చెందిన ఒక వ్యక్తిని భూదాన్ యజ్ఞ బోర్డుకు ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రత్యేక గెజిట్‌ను తీసుకొచ్చింది. దీనిని సవాలు చేస్తూ సర్వ సేవా సంఘ్ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, న్యాయస్థానం ఆ గెజిట్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాది ఎకరాల భూదాన్ భూములు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకుని ఉన్నాయి. ఈ భూములు చట్ట ప్రకారం ఎవ్వరికీ బదలాయించబడవని తెలిసినా, ఆ భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో కొందరు రాజకీయ నాయకులు, అధికారులు వాటిని దక్కించుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అందరూ గ్రహించాల్సిన విషయమేమిటంటే భూదాన్ భూములు గెజిట్ ప్రకారం ఎప్పటికైనా సర్వ సేవా సంఘ్‌కు చెందవలసినవే గాని, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎవరికీ బదలాయించబడవు. సర్వ సేవా సంఘ్... భూదాన్ యజ్ఞ బోర్డు ద్వారా చట్ట ప్రకారంగా స్వచ్ఛందంగా ఎవరికైనా వితరణ చేయాలి లేదా వితరణకు సమ్మతించాలి. ఒక మహోన్నత ఆశయంతో, దృఢ సంకల్పంతో ఆచార్య వినోబా భావే యజ్ఞంగా భావించి కొనసాగించిన 'భూదాన్' ఉద్యమ స్ఫూర్తిని పరిరక్షించే విధంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

■ నీలం రాంబాబు నాయుడు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్



ఓం టర్నింగ్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలున్నా కనెక్షన్ ఇవ్వని దృశ్యం



నగరంలోని బందరు రోడ్డులో పరిస్థితి రోజురోజుకూ ఘోరంగా మారుతోంది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విపరీతమైన రద్దీతో వాహనాలు గంటలకొద్దీ నిలిచిపోతున్నాయి. సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, వీఐపీల రాకపోకల సమయంలో ఈ రోడ్డు దాటడం గగనంగా మారుతోంది. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బందరు రోడ్డులో కనిపించిన పరిస్థితి ఇది. గంటలకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



భక్తుల సామాన్లు భద్రపరిచే చోట సీసీ కెమెరా పరిస్థితి ఇదీ..



నిద్దరోతున్న నిఘా..!

ఇంద్రకీలాద్రిపై భద్రత ప్రశ్నార్థకం

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఓ పక్క దళారులు.. భక్తులను నిలువు దోపిడీ చేస్తుంటే, మరోపక్క దొంగలు.. భక్తుల బంగారు ఆభరణాలు కాజేస్తున్నారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతున్నా అందుకు తగిన సదుపాయాలు మాత్రం ఇక్కడ కనిపించడం లేదు. తాజాగా ఘాట్‌రోడ్డులో ఓం మలుపునకు ముందే నిలిపిన కారులో 241 గ్రాముల బంగారం చోరీ ఘటన ఇందుకు అద్దం పడుతోంది. ఇంద్రకీలాద్రి వద్ద దిగువ నుంచి పైవరకు విజిల్స్‌తో మోతెక్కిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది భక్తులకు ఎలాంటి భద్రతను ఇవ్వడం లేదని తెలుస్తోంది.

- ఘాట్‌రోడ్డులో బయటపడ్డ నిఘాలోపం
- సీసీ కెమెరాల ఏర్పాటు అంతంతమాత్రమే
- భక్తుల కారులో బంగారు ఆభరణాలు చోరీ
- సీసీ కెమెరాలు లేకపోవడం కారణంగానే..
- చోరీ తర్వాత అధికారుల హడావిడి
- ఆగమేఘాలపై నిఘా నేత్రాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కనకదుర్గమ్మ సన్నిధికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. కొందరు మెట్లపూజ చేసుకుంటూ కొండ ఎక్కుతారు. మరికొందరు ఘాట్‌రోడ్డు మార్గంలో పైకి వెళ్తారు. ఇంకొందరు లిఫ్టు మార్గాల్లో రాజగోపురం వద్దకు చేరుకుంటారు. వీరి భద్రత కోసం కొండ మొత్తాన్ని సీసీ కెమెరాల నిఘాలో ఉంచామని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే ప్రధానమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మిగిలిన ప్రదేశాలపై పెద్దగా అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంద్రకీలాద్రిపై మొత్తం 214 సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని పర్యవేక్షించడానికి మహామండపంలో ప్రత్యేకంగా ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహిస్తున్నారు.

సెక్యూరిటీ గార్డులు ఉన్నా ప్రయోజనం శూన్యం

కొండకు దిగువ నుంచి పైవరకు వివిధ పాయింట్లలో సెక్యూరిటీ గార్డులు ఉంటారు. వారంతా పైకి వచ్చే వాహనాల ట్రాఫిక్‌ను నియంత్రించడమే చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఓం మలుపు వద్ద బారికేడ్లు అమర్చి ఉంటాయి. ఇక్కడి నుంచి ఏ కేటగిరీకి సంబంధించిన కార్లను సమాచార కేంద్రం వరకు పంపాలో తెలుసుకునే పనిలోనే సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. కారులో బంగారు ఆభరణాలు చోరీ అయిన ప్రదేశంలో సెక్యూరిటీ ఉన్నప్పటికీ తానేమి చూడలేదని పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

కరోనా సమయంలో వెండి సింహాలు మాయం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చిన్న రథానికి నాలుగు వైపులా ఉండే వెండి సింహాల్లో మూడింటిని దొంగలు కాజేశారు. కరోనా సమయంలో మొత్తం లాక్‌డౌన్‌లో ఉన్నప్పుడు ఈ చోరీ జరిగింది. అప్పుడే భద్రతపై అనేక సందేహాలు వచ్చాయి. నాడు అధికారంలో ఉన్న వైసీపీ ఇంద్రకీలాద్రిని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రతి ఏడాది దేవస్థానంపై భద్రతా ఆడిట్ జరుగుతుంది. కొద్దిరోజుల క్రితమే ఈ ఆడిట్‌ను నిర్వహించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ బలగాలు ఈ ఆడిట్‌లో పాల్గొన్నాయి. దేవస్థానానికి కింద నుంచి కొండ పై వరకు భద్రతాపరమైన లోపాలు ఉన్నాయని ఈ ఆడిట్‌లో స్పష్టమైంది. ఏటా జరిగే భద్రతా ఆడిట్‌లో పలు సూచనలు, సిఫార్సులు చేస్తున్నా అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఘాట్‌రోడ్డులో కారులో ఉన్న బంగారు ఆభరణాలు చోరీ జరిగిన తర్వాత ఆలయ అధికారులు అత్యంత వేగంగా స్పందించారు. ఘటన జరిగిన ప్రదేశంలో చుట్టుపక్కల మొత్తం పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు ప్రారంభంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. తర్వాత ఓం మలుపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు ఎక్కిన తర్వాత మొదటి మలుపు నుంచి ఓం మలుపు చేరుకునే వరకు మధ్యలో ఎలాంటి సీసీ కెమెరాలు లేవు. ఈ ప్రాంతంలోనే మిగతా 6లో..

రాజధాని నిర్మాణానికి రండి

పట్టభద్రులకు ప్రభుత్వ అవకాశం

- సీఆర్‌డీఏలో ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- రాజధాని నిర్మాణంలో పాల్గొనవచ్చు
- అవగాహన, నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు
- గౌరవ భత్యం కూడా పొందవచ్చు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అమరావతి నిర్మాణంలో పట్టభద్రులకు కూడా ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం కల్పిస్తోంది. మూడు నుంచి ఆరు నెలల పాటు ఈ ఇంటర్న్‌షిప్‌లు చేసుకునే వీలుంది. వీటిద్వారా పెద్ద ఎత్తున పట్టభద్రులు తగిన అనుభవాన్ని, నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు. అమరావతి వంటి అంతర్జాతీయ రాజధాని నిర్మాణ పనుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలు పంచుకోవచ్చు.

మూడు రకాలుగా..

ఈ ఇంటర్న్‌షిప్‌ను సీఆర్‌డీఏ మూడు రకాలుగా కల్పిస్తోంది. గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్, యంగ్ ప్రొఫెషనల్స్ కేటగిరీలో చేయొచ్చు. తగిన గౌరవ భత్యాన్ని కూడా అందజేస్తారు. గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్‌కు రూ.7,500, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంటర్న్స్‌కు రూ.10 వేలు, యంగ్ ప్రొఫెషనల్స్‌కు రూ.15 వేల చొప్పున ఇస్తారు. ఇంజనీరింగ్ విభాగంలో సివిల్, స్ట్రక్చరల్, జియో టెక్నికల్, హైవే ట్రాన్స్‌పోర్టేషన్, ఎలక్ట్రికల్, పవర్ సిస్టమ్స్, మెకానికల్, ఫైర్ అండ్ సేఫ్టీ, వాటర్ సప్లై, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ అంశాలు కలిగినవారు ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్లానింగ్ విభాగంలో అర్బన్, రీజనల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ట్రాన్స్‌పోర్టేషన్,

మాయలేడీలు

నగరంలో మహిళా ముఠా హల్‌చల్

- ధనవంతులే టార్గెట్‌గా పెట్టుబడుల పేరుతో వసూళ్లు
- ఖరీదైన అపార్టుమెంట్లలో ఫ్లాట్ తీసుకుని బిజినెస్
- రెట్టింపు డబ్బు ఇస్తామని చెప్పి మాయమాటలు
- రూ.56 లక్షలు ఇచ్చి మోసపోయిన ఓ కాలనీవాసి
- గుట్టుగా వ్యాపారం ముగించుకుని పరార్
- కాలనీవాసి ఇంట్లో డాక్యుమెంట్ల చోరీకి యత్నం
- డాక్యుమెంట్లు దొరక్కపోవడంతో బంగారం దొంగతనం

కొమ్ముకాస్తున్న టీడీపీ నేత.. ఎట్టకేలకు మహిళ అరెస్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరానికి చెందిన వంకాయలపాటి పావని, చెన్నైకు చెందిన కొప్పకొండ లక్ష్మి, ఆమె తల్లి శ్యామల, వైజాగ్‌కు చెందిన గంగాధర్, కావ్య అనే మరో మహిళ ఓ గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. నగరాలు, పట్టణాల్లో ధనవంతులు ఉండే కాలనీల్లోని అపార్టుమెంట్లలో ఫ్లాట్లను అద్దెకు తీసుకుంటారు. అందులో టేబుళ్లు, కుర్చీలు, కంప్యూటర్లు అమర్చుకుని ఓ పేరు పెడతారు. అలాగే, నగరంలోని వెటర్నరీ కాలనీలో 'యుక్తాస్' పేరుతో ఓ కంపెనీని ప్రారంభించారు. ఆ ప్రాంతంలో ఉన్న ధనవంతులను టార్గెట్ చేసుకుని వ్యవహారాలు నడిపించారు. చెన్నైకు చెందిన లక్ష్మి స్వస్థలం నెల్లూరు. ఆమె భర్త తమిళనాడులోని జెన్‌కోలో ఉద్యోగి. భర్త, పిల్లలు అక్కడ ఉంటే ఆమె విజయవాడలో కంపెనీని ప్రారంభించింది. పెద్ద కుమార్తె పేరు యుక్త. చిన్న కుమార్తె పేరు లాస్య. రెండింటిని కలిపి యుక్తాస్ అని నామకరణం చేసింది. ఈ కంపెనీలో కావ్యను రీజనల్ మేనేజర్‌గా పరిచయం చేసింది. వంకాయలపాటి పావనిని డైరెక్టర్‌గా చూపించింది. ఇలా.. లక్ష్మి, పావని కలిసి ధనవంతులకు వల వేయడం మొదలుపెట్టారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెడితే ఏడాదిలోపే రెట్టింపు చేసి చూపిస్తామని ఆశలు రేకెత్తించారు. తామంతా ఆన్‌లైన్ షేర్ ట్రేడింగ్ నిర్వహిస్తున్న కంపెనీని ప్రారంభించామని చెప్పుకొచ్చారు.

బ్యాంకులు చేయలేని పని తాము చేస్తామంటారు. పెట్టుబడిని డబుల్ చేస్తామని నమ్మబలుకుతారు. తమది ఒక మల్టీ నేషనల్ కంపెనీ అని బిల్డప్ ఇచ్చి ట్రాప్ చేస్తారు. ధనవంతుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తారు. తర్వాత చిరునామా లేకుండాపోతారు. విజయవాడ కేంద్రంగా ఓ మహిళా ముఠా చేస్తున్న మోసాలకు బలైపోయిన వారు పోలీసులను ఆశ్రయించారు. అప్పులు ఇచ్చిన వారి ఇంటికెళ్లి చోరీలు చేస్తున్న సదరు ముఠా లీడరైన మహిళను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు.



పెడితే పెట్టుబడి... లేకపోతే అప్పు

లక్ష్మి, పావని ధనవంతులకు వల వేసేటప్పుడు రెండు రకాల ప్రణాళికలు అమలు చేస్తారు. తమ కంపెనీలో పెట్టుబడులు పెట్టాలని మొదట ఆఫర్ ఇస్తారు. ఈ ప్లాన్‌లో అవతలి వ్యక్తులు పడకపోతే కంపెనీ మల్టీనేషనల్ కంపెనీగా మారిందని, దానికి పెట్టుబడిగా కొంత అప్పు ఇవ్వాలని అడుగుతారు. ఆ విధంగా లక్ష్మి వెటర్నరీ కాలనీకి చెందిన రాజవర్ధనరావు అనే వ్యక్తి నుంచి రూ.56 లక్షలు తీసుకుంది. ఆయన ఫ్లాట్‌కు దిగువనే లక్ష్మి అద్దెకు ఉండేది. లక్ష్మి వేసిన స్కెచ్‌కు తల్లి శ్యామల వంత పాడేది. ఆయన దగ్గర నుంచి అప్పు తీసుకునేటప్పుడు చెన్నై నుంచి లక్ష్మి భర్త దయాకర్ వచ్చాడు. ఈ ఇద్దరూ కలిసి అప్పునకు సంబంధించి ప్రామిసరీ నోట్లు రాసిచ్చారు. గడువు ముగిసినా అప్పు తీర్చకపోవడంతో ఆయన లక్ష్మిని ప్రశ్నించారు. ఒత్తిడి పెరగడంతో లక్ష్మి కనిపించడం మానేసింది. తర్వాత గుట్టుచప్పుడు కాకుండా కంపెనీని మూసేసింది.



పీఎన్‌బీఎస్ వద్ద తగలబడుతున్న ప్రైవేట్ బస్సు

ఫిట్‌నెస్‌పై అనుమానాలు!

- కాలం తీరిన బస్సు కావడం వల్లేనని ఆరోపణలు
- మంటలు ఆర్పే పరికరాలు కూడా లేవు!
- రవాణాశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు

పీఎన్‌బీఎస్ ఎదుట ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం

(ఆంధ్రజ్యోతి, బస్‌స్టేషన్) : బెజవాడలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్) ఎదురుగా ఎన్‌హెచ్ - 65పై ఏవీఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు గురువారం దగ్ధమైన నేపథ్యంలో బస్సు ఫిట్‌నెస్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణలంక వైపు ప్రయాణికులు ఎవరు లేకుండా వెళుతున్న బస్సులో ఒక్కసారిగా పొగలు రావడంతో స్థానికులు డ్రైవర్, క్లీనర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో వారు వెంటనే కిందకు దిగారు. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఏసీ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చునని జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి కె.వినయ్ పేర్కొన్నారు. అయితే ఘటనా స్థలానికి రవాణా శాఖ అధికారులు రాకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది. లారీలు, కార్లు, ద్విచక్రవాహనాలను పరీక్షించినట్టుగా ప్రైవేటు బస్సులను పరీక్షించకుండా వదిలేస్తున్నారన్న విమర్శలు ఎప్పటి నుంచో వస్తున్నాయి. ప్రైవేటు బస్సుల యాజమాన్యాల నుంచి పెద్ద ఎత్తున మామూళ్లు వస్తుండటం వల్లనే రవాణా శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కావటానికి ఏసీ కారణమని చెబుతున్నా.. వాస్తవానికి వైరింగ్ సిస్టమ్ సరిగా లేదని తెలుస్తోంది. వైర్ల ద్వారా వచ్చే షార్ట్‌సర్క్యూట్‌ను నియంత్రించే వ్యవస్థలు లేకపోవటంతోనే ఈ ప్రమాదం సంభవించినట్టు సమాచారం. ప్రైవేటు బస్సులపై కొంత కాలంగా రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు కూడా నిర్వహించటం లేదు.

మిగతా 6లో..

ఉత్కంఠ, హైడ్రామా నడుమ తిరువూరు కౌన్సిల్ వాయిదా!

- అర్ధంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోయిన చైర్‌పర్సన్
- అయోమయానికి గురైన వైసీపీ కౌన్సిలర్లు
- ఆ తర్వాత అనారోగ్యానికి గురయ్యారన్న సమాచారం
- తర్జనభర్జన నడుమ కౌన్సిల్ సమావేశం వాయిదా

6లో

ఎటూ తేలని చైర్‌పర్సన్ రాజీనామా అంశం



నగరంలో ఆపరేషన్ బ్లాక్

- కార్ల అద్దాల టింట్ ఫిల్మ్ తొలగింపు
- విస్తృతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్
- కూడళ్లలో సిగ్నల్ పడినప్పుడు తనిఖీలు చేస్తున్న పోలీసులు
- డ్రైవర్ సీట్లో కూర్చున్న వారితోనే తొలగింపు

8లో

వంశీ బెయిల్‌పై విచారణ 21కి వాయిదా

విజయవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జిల్లా జైల్లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు 21వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న వెలినేని శివరామకృష్ణ ప్రసాద్ బెయిల్ పిటిషన్‌పై విచారణ కూడా అదేరోజు జరుగుతుందని న్యాయాధికారి భూపాల్‌రెడ్డి ఆదేశాలిచ్చారు.

ఇద్దరు బెట్టర్ల అరెస్టు

విజయవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : యాప్ ద్వారా ఐపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగ్ ఆడుతున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. భానునగర్‌కు చెందిన నారపురెడ్డి నరసింహారెడ్డి పాలవ్యాపారం చేస్తుంటాడు. న్యూ ఆర్ఆర్‌పేటకు చెందిన అన్న వెంకటేశ్వరరావు వన్‌టౌన్‌లో స్టీల్ సామాన్ల షాపులో పనిచేస్తాడు. ఇద్దరూ కలిసి ఎంఎస్‌సీ 99 బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగ్ ఆడుతున్నారు. సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారికి యాప్‌ను ఇచ్చిన భానునగర్‌కు చెందిన నారపురెడ్డి శివారెడ్డి పరారీలో ఉన్నాడు.



జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతులు అందజేస్తున్న 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ వి.మురళీ

'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా
జిల్లా విజేతలకు బహుమతుల ప్రదానం

గుణదల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రచురితమైన కూపన్ల లక్కీ డ్రాలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ కార్యాలయంలో బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయిలో కూపన్ల డ్రా కార్యక్రమం మార్చి 24న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విజేతలైన పాఠకులకు 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళి బహుమతులను అందజేశారు. ప్రథమ విజేత పెనమలూరు మండలం గోసాల గ్రామానికి చెందిన పోలవరపు రామకోటేశ్వరమ్మ కోరిక మేరకు బైక్‌కు బదులు నగదును చెక్కు రూపంలో అందజేశారు. ద్వితీయ విజేత కృష్ణాజిల్లా గుడివాడటౌన్‌కు చెందిన జంధ్యవరపు కృష్ణమూర్తికి రిఫ్రిజిరేటర్, తృతీయ విజేత విజయవాడ సీతారామపురానికి చెందిన వీవీ చంద్రశేఖర్‌కు ఎల్‌సీడీ టీవీ అందజేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ డీజీఎం పి.ఎస్.వాసు, సర్క్యులేషన్ మేనేజర్ రాజగోపాల్ తదిత

వైసీపీ బాగోతాలు బయటపడతాయనే!

» గోవుల మృతిపై భూమన అసత్య ప్రచారం

» నెట్టెం రఘురాం ధ్వజం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో టీటీడీలో జరిగిన అవినీతి బాగోతం సిట్ దర్యాప్తులో బట్టబయలవుతాయనే భయంతోనే వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. హేతువాదినని, వెంకటేశ్వరస్వామి వారిని నల్లరాయి అని మాట్లాడిన వ్యక్తి టీటీడీ చైర్మన్‌గా లడ్డూ ప్రసాదాల్లో నెయ్యి కల్తీతో పాటు ఎన్నో దురాగతాలకు పాల్పడ్డాడని, వాటిని కప్పుపుచ్చుకునేందుకు గోశాలలో గోవులు చనిపోతున్నాయని విషప్రచారం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఆయన గురువారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ హయాంలో గోవులకు గ్రాసంలోను, దాణాలోను కక్కుర్తిపడ్డారని, అప్పుడు మృతిచెందిన గోవుల ఫోటోలను ఇప్పుడు బయటపెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. భూమన ఆరోపణలకు టీటీడీ ఈవో శ్యామలరావు పూర్తి ఆధారాలతో ఖండించారని చెప్పారు. పంచాయతీపరిషత్ ఉపాధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, భూమన అసలు హిందువే కాదని ఆరోపించారు.



సమావేశం మధ్యలోనే వెళ్లిపోతున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి


ఉత్కంఠ, హైడ్రామా నడుమ
తిరువూరు కౌన్సిల్ వాయిదా!

తిరువూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదానికి గురువారం చేపట్టిన కౌన్సిల్ అత్యవసర సమావేశం తీవ్ర ఉత్కంఠ, హైడ్రామా నడుమ వాయిదా పడింది. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం మధ్యాహ్నం ప్రారంభమైంది. తొలుత అజెండాలోని నాలుగు అంశాల్లో చైర్‌పర్సన్ రాజీనామా విషయంపై పార్టీ అధ్యక్షుడు(వైసీపీ)ఆదేశాల ప్రకారం పదవికి రాజీనామా చేస్తున్నట్టు, దానిని అంగీకరించాలన్నారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో మంచి పాలన సాగించాలని ప్రజలు 17 మందిని కౌన్సిలర్లుగా ఎన్నుకుంటే, అంతర్గత కుమ్ములాటలతో రెండేళ్లుగా పాలనను కుంటుపరుస్తున్నారని, రాజీనామాతో అభివృద్ధి మరింత కుంటుపడుతుందని అన్నారు. దీనిపై చైర్‌పర్సన్ తరఫున 7వ వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు(బీరువాలబాబు)మాట్లాడుతూ, చైర్‌పర్సన్ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామాచేస్తున్నారని, మరోకారణం లేదని చెబుతుండగానే చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో కౌన్సిలర్లు అయోమయానికి గురయ్యారు. తర్వాత చైర్‌పర్సన్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారన్న సమాచారం రావడంతో సమావేశం కొనసాగించాలా లేదా అన్న మీమాంసలో వైసీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తర్జనభర్జన పడ్డారు. అనంతరం సమావేశం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. సమావేశం వాయిదాతో ఉత్కంఠకు తెరపడింది.

ఈ నెలాఖరుతో ముగియనున్న ఈ కేవైసీ గడువు

» ఎన్టీఆర్ జిల్లాలో చేయించాల్సిన వారు లక్షకు పైగానే..


మొగల్రాజపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల్లో ఈ కేవైసీ చేయించుకోవల్సిన వారికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. ఎన్టీఆర్ జిల్లాలో ఈకేవైసీ చేయించుకోవాల్సినవారు ఇంకా 1,25,049మంది ఉన్నారు. వీరిలో ఐదేళ్లలోపు వారు 22,834 మంది, 80 సంవత్సరాలు పైబడినవారు 1001 మంది ఉన్నారు. ఈ రెండు కేటగిరీల వారికి ఈ కేవైసీ అవసరం లేదు. మిగిలిన 1,01,214 మంది ఈ కేవైసీ చేయించుకోవాలి. మార్చి 31తో ముగిసిన గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించారు.



2021లో నాటి ప్రభుత్వం ఇచ్చిన రైస్ కార్డుల్లో రెండు, మూడేళ్ల వయస్సు పిల్లలు తప్పనిసరిగా ఆధార్ సెంటర్‌లో వేలిముద్రలు నవీకరించుకోవలి. వారం రోజుల తర్వాత రేషన్ డీలర్ వద్దగాని, ఎండీయూ వాహనం వద్ద గాని ఈ కేవైసీ చేయించుకోవాలి. వీరు కాకుండా దీర్ఘకాలం రేషన్ తీసుకునే సమయంలో వేలిముద్ర వేయని వారిలో అత్యధిక శాతం ఆరు నుంచి పదేళ్ల వయస్సు వారు, ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి పేర్లు ఉంటాయి. ఇంటర్‌నెట్‌లో గూగుల్‌లో ఈపీడీఎస్1 అని టైప్ చేస్తే ఈపీడీఎస్.ఏపీ.జీవోవి.1అని వస్తుంది. దీనిని ఓపెన్ చేస్తే పలు ఎంపికలు ఉంటాయి. వాటిలో రైస్ కార్డు సెర్చ్‌లోకి వెళ్లి మీ కార్డు నెంబరు టైప్ చేయాలి. కార్డు వివరాలు వస్తాయి. ఆ వివరాల్లో పేర్ల చివర ఈ కేవైసీ అయిందా లేదా అనే సమాచారం ఉంటుంది. అవ్వకపోతే వెంటనే ఈ కేవైసీ చేయించుకోవాలి.



రియల్ బూమ్!



జాతీయ రహదారి చెంతన.. నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సమీపంలో.. పెద్ద రైల్వేస్టేషన్, భారీ కార్గో టెర్మినల్ ఏర్పాటు కానుండటంతో రియల్టర్ల చూపు ఎన్టీఆర్ జిల్లా పరిటాలపై పడింది. ఇప్పటికే పలు సంస్థలు ఏర్పాటవుతుండటం, సమీప భవిష్యత్తులో పెద్ద నగరంగా రూపాంతరం చెందనుండటంతో ఇక్కడి భూములకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. అనూహ్యంగా భూముల ధరలకు రెక్కలు వచ్చి రూ.కోట్లు పలుకుతున్నాయి.

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

» అందరిచూపు పరిటాల వైపు..!
» అమరావతికి అతి చేరువలో..
» జాతీయ రహదారులను అనుసంధానిస్తూ..
» లాజిస్టిక్ హబ్‌గా అడుగులు
» తరలి వస్తున్న భారీ సంస్థలు
» రూ. కోట్లలో ధర పలుకుతున్న భూములు

ఆంజనేయస్వామి విగ్రహం వెనుక ఉన్న భూములు

కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. జాతీయ రహదారితో పాటుగా ప్రధాన రహదారుల వెంబడి భూముల ధరలు రూ. కోట్లు పలుకుతున్నాయి. ఈనెల మొదటి వారంలో ఆంజనేయ స్వామి విగ్రహం-గనిఆత్కూరు వెళ్లే రోడ్డుకు మధ్యలో సర్వీస్ రోడ్డు పక్కన ఎకరం రూ.3.48 కోట్లు పలికింది. బేరసారాలు కుదరటంతో వారంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. పదిరోజుల క్రితం చెరువు కట్ట వద్ద ఓ రియల్టర్ ఎకరం రూ.2.50 కోట్ల వంతున 1.33 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇటీవల సర్వీస్ రోడ్డుకు ఫర్లాంగు దూరంలో గనిఆత్కూరు వెళ్లే రోడ్డులో ఎకరం రూ. 2.20 కోట్లకు బేరం కుదిరింది. కొద్ది నెలల క్రితం జాతీయరహదారికి కిలోమీటరు దూరంలో పీఆర్ రోడ్డు పక్కన గుంటూరుకు చెందిన వ్యాపారులు ఎకరం రూ.1.25 కోట్ల వంతున 26 ఎకరాలు కొన్నారు. ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక భాగంలో సైతం ఎకరం రూ.1.50 కోట్ల నుంచి రూ. 1.75 కోట్ల ధర పలుకుతోంది. మున్ముందు ధర ఇంకా పెరుగుతుందన్న ఆశతో రైతులు భూములు అమ్మేందుకు సిద్ధపడటం లేదు. పిల్లల చదువులు, అప్పుల భారం, ఇతరత్రా ఆర్థిక అవసరాల నిమిత్తం తప్పని పరిస్థితుల్లో కొద్ది మంది మాత్రమే తమ భూములను విక్రయిస్తున్నారు.

రహదారుల అనుసంధానం

65వ నెంబరు జాతీయరహదారిపై ఉన్న పరిటాల విజయవాడకు 30 కిలోమీటర్లు, కృష్ణానదికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతిపాదిత అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), ఇన్నర్ రింగు రోడ్డు (ఐఆర్ఆర్)కు మధ్యలో ఉంటుంది. నాణ్యత కలిగిన రోడ్డు మెటల్, బిల్డింగ్ కంకర పుష్కలంగా దొరుకుతుంది. ఇప్పటికే పరిటాల పరిధిలో లైట్ వెయిట్ బ్రిక్స్ ఫ్యాక్టరీ ఉంది. రెండు భారీ ఆయిల్ బంకులున్నాయి. మరో బంకు నిర్మాణంలో ఉంది. దొనబండ వరకు జాతీయరహదారి వెంబడి పలుసంస్థలు, కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా రిలయన్స్ ఆధ్వర్యంలో కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న బయో ఎనర్జీ ప్లాంట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండు ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి.

రవాణాకు కీలకంగా కార్గో టెర్మినల్

పరిటాల గ్రామ రెవెన్యూ పరిధిలో రీ సర్వే రికార్డుల ప్రకారం 6,187 ఎకరాల భూమి ఉంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎర్రుపాలెం-అమరావతి రైల్వే లైను, స్టేషన్ కోసం ఈ గ్రామ పరిధిలో ప్రభుత్వం 75 ఎకరాలు తీసుకోనుంది. ఈ మార్గంలో పరిటాల అతిపెద్ద స్టేషన్ అని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. దీనికితోడు సరుకు రవాణాకు సంబంధించి రైల్వే లైనుకు అనుసంధానంగా భారీ కార్గో టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించగా.. రోడ్డు, జల, రైల్వే రవాణాకు సంబంధించి ఇది కీలకం కానున్నది. కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులకు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోలకత్తా, ఇతర ప్రధాన నగరాలకు అనుసంధానం చేయనున్నారు. దీంతో పరిటాల ముఖ్యమైన లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, రాజధాని అమరావతికి ప్రధాన ఆదాయ వనరుగా మారుతుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ పేర్కొనటంతో వెయ్యి ఎకరాలకు పైగా తీసుకుంటారన్న ప్రచారం మాత్రం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రియల్టర్లు, వ్యాపారులు, బడాబాబుల చూపు పరిటాలపై పడింది. ఈ గ్రామ పరిధిలోని భూములను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ధరకు వెనుకాడటం లేదు. అయితే ఎక్కువ మంది రైతులు భూములు అమ్మేందుకు నిరాకరిస్తున్నారు. ఒకటి రెండేళ్లు ఆగితే ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో ఉన్నారు.

కాల్వల మరమ్మతులు పూర్తి చేయండి

» అభివృద్ధి పనులపై మంత్రి నారాయణ సమీక్ష



అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

కార్పొరేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభం నాటికి విజయవాడ నగరంలో అన్ని వరద నీటి కాలువల పూడికతీతతో పాటు మరమ్మతులు పూర్తిచేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై ఎక్కడా నీరు నిలవ ఉండకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కరించడంపై మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. విజయవాడలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దెరామ్మోహన్, బోడె ప్రసాద్‌లతో పాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, టౌన్ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ విద్యుల్లత, ప్రజారోగ్య విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ మరియన్న, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న సమస్యలను అధిగమించడం, అభివృద్ధి ప్రణాళికలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నగరంలో త్వరలో నిడమానూరు ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభం కానుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మహానాడు జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకూ ఫ్లైఓవర్ నిర్మించటానికి అడుగులు పడుతున్న తరుణంలో ఈలోగానే ప్రత్యామ్నాయ రహదారులను ఎంపిక చేసి కొత్తగా రోడ్లు వేయాలని సూచించారు..అమరావతి నుంచి గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు వెళ్లే ప్రధానమైన రహదారి కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ట్రాఫిక్ మళ్లింపు కొరకు పలు రహదారులను ఎంపిక చేసినట్టు ఎంపీ కేశినేని చిన్ని మంత్రి నారాయణకు వివరించారు. ఈ రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు కారిడార్‌లో గ్రీనరీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మరోవైపు తమ నియోజకవర్గాల్లో పార్కుల అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యేలు పలు ప్రతిపాదనలు మంత్రి ముందుంచారు. కార్పొరేషన్‌లో ఉన్న నిధులను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో పార్కులను అభివృద్ధి చేయాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. నగరంలో మెప్మాలో ఉన్న స్వయం సహాయక మహిళలకు ఆదాయం సమకూరేలా పలు ప్రతిపాదనలపై చర్చించారు. మెప్మా ఎండీతో చర్చించి ఆయా అంశాలపై నిర్ణయం తీసుకోవాలని విజయవాడ కమిషనర్ ధ్యానచంద్రకు మంత్రి నారాయణ సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేయాలని మంత్రి నారాయణ దిశానిర్దేశం చేసారు.



చారిత్రక ఘట్టాల
గుట్టు తెలపండి

» రైల్వే బ్రిడ్జిలు, వంతెనలపై 'కాఫీ టేబుల్ బుక్'కు వివరాలు పంపండి

» ఈనెల 30 వరకు గడువు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్ పరిధిలోని రైల్వే బ్రిడ్జిలు, వంతెనలపై 'భారతీయ రైల్వే 172వ ఆవిర్భావ దినోత్సవం' సందర్భంగా 'కాఫీ టేబుల్ బుక్'ను తీసుకురానున్నది. విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం. మండ్రూపకర్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇందుకు సంబంధించిన చారిత్రాత్మక అంశాలను ఆసక్తిపరులు పంపించాల్సిందిగా కోరారు. ఈనెల 30 లోగా ఈమెయిల్ లేదా పోస్టు ద్వారా పంపించవచ్చునని తెలిపారు. సీటీబీ.విజెడ్ఎఎస్ఈఆర్ అట్‌ది రేట్ ఆఫ్ జిమెయిల్.కామ్‌లో గానీ, విజయవాడ డీఆర్ఎం కార్యాలయం ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం, గాంధీనగర్ విజయవాడకు గానీ వివరాలను పంపాలన్నారు. కాఫీ టేబుల్ బుక్ డిజిటల్ ఫార్మాట్‌లో ఉంటుందని, వంతెనలు, బ్రిడ్జిల కథలు, విజువల్స్, వాటియొక్క వారసత్వం, చారిత్రక కథనాలు రాబోయేతరాలకు అందుబాటులో ఉండేందుకు భద్రపరుస్తామని తెలిపారు. హేవలాక్ వంతెన, గోదావరి వంతెన, కృష్ణానదిపై వంతెన, పెన్నానదిపై వంతెన వంటి చారిత్రాత్మక, అద్భుత నిర్మాణాలకు ప్రతీకగా విజయవాడ రైల్వే డివిజన్‌లో 225 బ్రిడ్జిలు, వంతెనలు ఉన్నాయన్నారు. వీటిలో ఇంజనీరింగ్ అద్భుతాలే కాకుండా, సాంస్కృతిక, చారిత్రాత్మక ప్రాముఖ్యత కూడా ఉందన్నారు. భారతీయ రైల్వే ప్రగతికి నిశ్శబ్ద సాక్షులుగా ఇవి ఉన్నాయని నుస్రత్ ఎం. మండ్రూపకర్ వివరించారు. విజయవాడ డివిజన్‌లోని ప్రయాణికులు, విద్యార్థులు, రైల్వే ఔత్సాహికులు, చరిత్రకారులు, మీడియా నిపుణులు, ఈ 'కాఫీ టేబుల్ బుక్'ను రూపొందించేందుకు సహకరించాలని కోరారు. చరిత్రను ప్రత్యక్షంగా చూసిన వృద్ధుల వ్యక్తిగత కథనాలు, హైరిజల్యూషన్ ఛాయాచిత్రాలు, అరుదైన వాస్తవ కథనాలు పంపించవచ్చునని, పాఠశాల విద్యార్థులు, కవితలు, డ్రాయింగ్‌లు, కథలు, వారి అనుభవాలు, లేదా ఊహలను హైలెట్ చేయవచ్చునని తెలిపారు.

ఒకటో తరగతికి దరఖాస్తుల ఆహ్వానం

» బలహీనవర్గాల పిల్లలకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం సీట్లు

» 28 నుంచి మే15 వరకు స్వీకరణ

» సమగ్ర శిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు వెల్లడి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొనే పిల్లలు, బలహీన వర్గాల పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల వయస్సు నిండిన పిల్లలు ఈనెల 28 నుంచి మే15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత గ్రామ సచివాలయం లేదా మండల విద్యావనరుల కేంద్రం లేదా సంబంధిత పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 1.44 లక్షలు మించరాదన్నారు. వివరాల కోసం టోల్‌ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించాలని శ్రీనివాసరావు కోరారు.

స్వయం ఉపాధిపై అవగాహన పెంచాలి

» విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉద్యోగ, స్వయం ఉపాధి రంగాలపై అవగాహనతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంచాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో పంచాయతీ చాంపియన్స్, మండల సమాఖ్య అధ్యక్షులకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై గ్రామీణాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, సిడాప్, ఎంప్లాయిమెంట్ విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరాతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ దిశగా మండల సమాఖ్య అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ పంచాయతీ చాంపియన్స్ ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. యువతకు ప్రభుత్వం నిర్వహించే జాబ్ మేళా వివరాలను తెలియజేయాలన్నారు. యువత చెడు మార్గాలు పట్టకుండా గ్రామాల్లో క్రీడలను అభివృద్ధి చేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్ఐఆర్డి ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఎ.ఎన్.వి. నాంచారావు మాట్లాడుతూ, పంచాయతీ చాంపియన్స్ ద్వారా వచ్చే స్వయం సహాయక సంఘాలకు కావాల్సిన లోన్లు విషయం పరిశీలిస్తామన్నారు. సిడాప్ జేడీఎం (జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్) సుమలత మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కార్యక్రమం కింద శిక్షణ, ఉపాధి అవకాశాలను వివరించారు. సిడాప్ ద్వారా బీఎస్సీ నర్సింగ్ యువతకు శిక్షణ ఇచ్చి జర్మనీ పంపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ జనార్ధనరావు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వై.ఎ్.బ్రహ్మం, ఎన్టీఆర్ జిల్లా ఎన్ఐఆర్డి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్స్ జి.వి.నరసింహారావు, సొంగా సంజయవర్మలతో పాటు డ్వాక్రా సంఘాల మండల సమాఖ్య అధ్యక్షులు, పంచాయతీ చాంపియన్స్ పాల్గొన్నారు.

మాయలేడీలు

(5వ పేజీ తరువాయి)

లక్ష్మి రాసిచ్చిన ప్రామిసరీ నోట్లను సంబంధిత వ్యక్తుల ఇళ్ల నుంచి దొంగిలించే బాధ్యతను పావని నిర్వర్తిస్తుంది. ఆమె ఇచ్చిన స్కెచ్‌తో పావని అప్పు ఇచ్చిన రాజవర్ధనరావు ఇంటికి వెళ్లి మాట్లాడింది. ప్రామిసరీ నోట్లను ఆయన ఎక్కడ పెడుతున్నాడో పావని అడిగి తెలుసుకుంది. తర్వాత ఆయనకు అనుమానం రావడంతో ఆ డాక్యుమెంట్లను మరోచోటకు మార్చాడు. ఆయన కుటుంబంతో బయటకు వెళ్లేటప్పుడు తాళం ఎక్కడ పెడతారో పావని గుర్తించింది. ఇంట్లో కుటుంబం లేదని తెలుసుకున్న పావని తాళం తీసుకుని లోపలి ప్రవేశించింది. లోపల డాక్యుమెంట్లు దొరక్కపోయేసరికి పది కిలోల వెండి, బంగారు ఆభరణాలను దొంగిలించింది. ఆభరణాలు కనిపించకపోవడంతో ఆయనకు పావనిపై అనుమానం వచ్చింది. మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి సీసీఎస్‌కు బదిలీ చేశారు. పావని పాత్ర తేలడంతో ఆమెను అరెస్టు చేశారు. పెట్టుబడుల పేరుతో వసూలు చేసిన డబ్బుతో లక్ష్మి గ్యాంగ్ విశాఖకు పారిపోయినట్టు తెలిసింది. చోరీ కేసులో పావని పాత్ర తేలినప్పటికీ అరెస్టు చేయడానికి పోలీసులకు చాలారోజులు పట్టింది. దీనివెనుక ఓ టీడీపీ నాయకుడి ఒత్తిడి ఉన్నట్టు తెలిసింది. పావనిపై 2019 చోరీ కేసులు ఉన్నాయి. మూడు కేసులు పటమట పోలీస్‌స్టేషన్‌లో, ఒక కేసు మాచవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యాయి. ఇప్పటి వరకు పావనీని పోలీసులు ఏ కేసులోనూ అరెస్టు చేయలేదు. తాజాగా రాజవర్ధనరావు ఇంట్లో జరిగి చోరీ కేసులో మాత్రం అరెస్టు చేశారు.

ఫిట్‌నెస్‌పై అనుమానాలు!

(5వ పేజీ తరువాయి)

బస్సులో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఆర్పటానికి కనీసం ఫైర్ ఎగ్సింజషర్లు కూడా లేవని తెలుస్తోంది. ఏసీ బస్సులో ఖచ్చితంగా అగ్ని నిరోధక పరికరాలు ఉండాలి.

ప్రయాణికులు ఉంటే పెనుప్రమాదమే!

బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో సరిపోయింది. అదే ప్రయాణికులు ఉంటే.. డ్రైవర్ ముందు భాగం నుంచి రావాలి. బస్సులో దట్టంగా పొగలు వ్యాపించాయి. ఈ పొగ నుంచి ప్రయాణికులు బయట పడటం అనేది దుర్లభమనే చెప్పాల్సి వస్తుంది. సరిగ్గా బస్సు మధ్యభాగంలో పొగలు వ్యాపించాయి. పొగలు వ్యాపించిన కొన్ని క్షణాలకే మంటలు వచ్చాయి. ఈ మంటలు అద్దాలను పగులగొట్టుకుని మరీ బయటకు వ్యాపించాయి. ప్రయాణికులు ఉండి ఉంటే ఘోర ప్రమాదమే జరిగి ఉండేది.

నిబంధనలకు పాతర

ప్రైవేటు బస్సులను తరచూ తనిఖీ చేయకపోవటంతో నిబంధనలకు విరుద్ధంగా చాలా మంది ఆపరేటర్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ బస్సులను బస్‌స్టాండ్ ఎదురుగా నిలపకూడదని స్పష్టమైన నిబంధనలు ఉన్నా ఇక్కడే నిలుపుదల చేస్తున్నారు. రవాణా శాఖ అధికారుల కనీస తనిఖీలు కూడా లేకపోవటంతో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. బస్‌స్టేషన్ దగ్గర ప్రయాణికులను ఎక్కించుకోవటానికి ఈ బస్సు ప్రతిరోజూ వస్తుందని తెలుస్తోంది. బస్టాండ్ అవుట్ గేట్ దగ్గర, రాజీవ్‌గాంధీ పార్కు దగ్గర నిలిపి ఉంచి ఆర్టీసీ ప్రయాణికులను ఎక్కించుకెళ్తారు. ఈ బస్సుకు హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చే వారి తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో విజయవాడ నుంచి ఖాళీగా వెళ్లటం కంటే కూడా తక్కువ ధరకు ఆర్టీసీ ప్రయాణికులను తీసుకువెళుతుంటారని సమాచారం. హైదరాబాద్ నుంచి వచ్చేటపుడు మాత్రం నూరు శాతం ఆక్యుపెన్సీతో ఈ బస్సు విజయవాడ వస్తుంది. అదృష్టవశాత్తూ బస్‌స్టేషన్ దగ్గర ఇంకా ప్రయాణికులను ఎక్కించుకోకముందే అగ్ని ప్రమాదం సంభవించింది. అదే ప్రయాణికులు ఎక్కిన తర్వాత జరిగి ఉంటే మాత్రం ఘోర ప్రమాదం జరిగి ఉండేదనటంలో ఎలాంటి సందేహం లేదు.

రాజధాని నిర్మాణానికి రండి

(5వ పేజీ తరువాయి)

ఎన్విరాన్‌మెంట్, ఆర్కిటెక్చర్, ల్యాండ్‌స్కేప్, ఆర్కిటెక్చర్, అర్బన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ వంటి అంశాలు కలిగిన వారిని తీసుకుంటారు. ఎన్విరాన్‌మెంట్ విభాగంలో ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఎకోలజీ, ఎన్విరాన్ మేనేజ్‌మెంట్, క్లైమేట్ సైన్స్, బయో డైవర్సిటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ ఎకనామిక్స్, మెట్రాలజీ, వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించిన వారిని తీసుకుంటారు. ఎకనామిక్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎకనామిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఇన్వెస్ట్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్, స్టాటిస్టిక్స్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించిన వారిని ఈ ఇంటర్న్‌షిప్‌నకు తీసుకుంటారు. ఇతర విభాగాలకు సంబంధించి జీఐఎస్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో తీసుకుంటారు. ఔత్సాహిక విద్యాసంస్థలు కానీ, విద్యార్థులు కానీ నేరుగా సీఆర్‌డీఏకు ఈ-మెయిల్ చేయటం ద్వారా కానీ, ప్రత్యక్షంగా కార్యాలయానికి వచ్చి కానీ దరఖాస్తు చేసుకోవచ్చు.

నిద్దరోతున్న నిఘా

(5వ పేజీ తరువాయి)

చోరీ జరిగింది. కాగా కొండపై జరిగిన చోరీపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు చెబుతున్న కథనం ప్రకారం 30 సెకన్ల వ్యవధిలో బంగారు ఆభరణాలు మాయమైనట్టు పోలీసులు భావిస్తున్నారు. కారుకు వేసిన లాక్‌లు వేసినట్టే ఉన్నాయి. ఎక్కడా అద్దాలు పగులగొట్టిన దాఖలాలు లేవు. కారుకు ఎక్కడా గీతలు పడిన చాయలు లేవు. బాధితులు మాత్రం వస్తువులు ఇక్కడే కనిపించడం లేదని బలంగా చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

అన్నప్రసాద వితరణ



లబ్బీపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గురువారం భక్తురాలు ఇంటి సంపదలక్ష్మీ సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రసాద పంపిణీ చేశారు. అన్నప్రసాద వితరణలో పాల్గొనదలచిన భక్తులు కల్యాణ మండపంలోని కార్యాలయంలో సంప్రదించాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి తెలిపారు.

ఆకతాయిల అడ్డాగా ఆస్పత్రి ఆవరణ

- చీకటి పడితే రామలింగేశ్వరనగర్ యూపీహెచ్‌సీలో అసాంఘిక కార్యకలాపాలు
- విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే హాస్పటల్ ఆవరణ ఆకతాయిలకు అడ్డాగా మారడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16వ డివిజన్ పరిధి రామలింగేశ్వరనగర్‌లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థానికులకు ఆరోగ్య రక్షగా ఉంది. ఇక్కడికి నిత్యం వందమందికి పైగా స్థానికులు వైద్యం కోసం వస్తుంటారు. వీరికి అవసరమైన వైద్యసేవలతో పాటు రక్త పరీక్షలు, ఉచితంగా మందులు అందజేస్తారు. ఇక్కడి సేవలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఒక సమస్యను 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. హాస్పటల్ ముందు పెద్ద ఖాళీ స్థలం, నీడకోసం స్థలం మధ్యలో ఒక భారీ వృక్షం కూడా ఉంది.



హాస్పిటల్ ఆవరణ



రామలింగేశ్వరనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఈ చెట్టు నీడనే హాస్పటల్‌కు వచ్చేవారు సేదతీరతారు. అయితే ఈ స్థలంలో ఎటువంటి విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటి పడితే ఆకతాయిల అడ్డాగా మారి, మద్యంతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇబ్బందిగా ఉందని స్థానికులు అంటున్నారు. వీరిని ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగు తున్నారని, ఈ సమస్య చాలా రోజుల నుంచి ఉందని స్థానిక ప్రజాప్రతినిధికి తెలిసినా పట్టించుకున్న సందర్భాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుం దంటున్నారు. సంబంధిత అధికారులు స్పం దించి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ముగిసిన శిక్షణ

బెంజిసర్కిల్,ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): పవర్ బీఐ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై డిగ్రీ విద్యార్థినులకు మారిస్ స్టెల్లా కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ మూడు రోజుల సదస్సులో 70మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కౌశిక్ టీమ్ నిర్వహణలో జరిగిన ఈ శిక్షణలో సమన్వయకర్తలుగా డాక్టర్ భారత జ్యోతి, మంజుల వ్యవహరించారు. అతిథిగా పొలిటికల్ సెక్రటరీ నరసింహాచారి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థినులు ప్రణాళిక ప్రకారం చదువుకుంటే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. జిల్లా సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల సమన్వయకర్త గురునాథ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, ఉషాకుమారి తదితరులు శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు అందజేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

జాబ్ క్యాలెండర్-2025 ఆవిష్కరణలో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లాలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్ల మెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో గురు వారం ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సిడాప్ సంయుక్తంగా 2025 సంవత్సరానికి సంబంధించిన జిల్లాలో నిర్వహించనున్న జాబ్‌మేళాల తేదీలు, నిర్వహించే ప్రదేశాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు.జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్ఐఆర్‌డీ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఏఎన్‌వీ నాంచారరావు, డిస్ట్రిక్ ఎంపా_యిమెంట్ ఆఫీసర్ వై.ఎస్.బ్రహ్మం, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్‌డీవో) ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఏడీఎస్‌డీవో దుర్గాప్రసాద్, సిడాప్ జేడీఎం (జాబ్స్‌డిస్ట్రిక్ మేనేజర్) సుమలత పాల్గొన్నారు.



జాబ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే వసంత, తదితరులు

మర్యాదపూర్వక కలయిక

పటమట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో కష్టపడిన వారికి పదవులు లభిస్తాయని జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. విజయవాడలోని పార్టీ జిల్లా క్యాంపు కార్యాలయంలో మైలవరం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పొనకల్ల నవ్యశ్రీ, ఆమె భర్త జనసేన నేత శీలం బ్రహ్మయ్యలు మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఆయన అభినందించారు. అక్కల గాంధీ, యర్రబోలు నాగేశ్వరరావు, చేపలమగుడు కాంతారావు, వై.ఎస్ నరసింహారావు, సురేష్, పాల్గొన్నారు.

బొప్పనను కలిసిన నర్రా

గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నియమితులైన నర్రా వాసు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వాసుకు ఆయన అభినందించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి కూటమితోనే సాధ్యం

పటమట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి సాధ్యమవుతుందని తూర్పు ఎస్సీ సెల్ నాయకులు నందిపాటి దేవానంద కుమార్ తెలిపారు. అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకణకు క్యాబినెట్ ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీలో అందరికీ న్యాయం జరిగేలా చర్యలు ఉంటాయన్నారు. శౌరి, ఆనంద్‌లు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కలెక్టరేట్‌లోని ఎన్టీఆర్ వికాస కార్యాలయంలో వారి ఆధ్వర్యంలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ వికాసా విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజాబ్‌డ్రైవ్‌లో శాండ్‌స్పేస్ టెక్నాలజీస్ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, విస్‌టెక్ కంపెనీలో సేల్స్‌ఫోర్స్ డెవలపర్, హెచ్ 1హెచ్‌ఆర్‌లో కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, హెచ్‌డీఎఫ్‌సీలో అసిస్టెంట్ మేనేజర్, కోజెంట్ ఈ సర్వీసెస్‌లో బీపీవో, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్‌లో టెలిసేల్స్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబీస్ అండ్ హోండాయ్ గ్లోవీస్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 19న ఉదయం 9గంటలకు ఎన్టీఆర్ వికాస కార్యాలయంలో సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9849465427ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వక్ఫ్‌పై స్టేటస్ కో ఇవ్వడం సంతోషకరం



మిఠాయిలు పంచుకుంటున్న మత పెద్దలు

లబ్బీపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని నిలుపుదల చేయవల్సిందిగా ఆదేశాలు జారీ చేస్తూ స్టేటస్ కో ఇవ్వడంపై విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. లబ్బీపేటలోని మసీదు వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

సౌకర్యాలున్నా...పర్యవేక్షణ నిల్

- వాచ్‌మన్ లేని వైనం
- మందుబాబులకు స్థావరం నెల్సన్ మండేలా వీఎంసీ పార్కు



పార్కులో పడేసిన ఖాళీ సీసాలు



మధ్యాహ్నం తెరిచి ఉన్న గేటు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: నెల్సన్‌మండేలా పార్కులో అన్ని సౌకర్యాలున్నా కళ తప్పుతోంది. పార్కు గేటు నిత్యం తెరిచే ఉంటుంది. పార్కుకు వాచ్‌మన్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. నాల్గో డివిజన్ పరిధి ఐటీఐ కాలేజీ సమీపంలో ఎల్ఐసీ కాలనీ మెయిన్ రోడ్డులో నెల్సన్ మండేలా వీఎంసీ పార్కు ఉంది. ఈ పార్కులో ఆహ్లాదకర వాతావరణంతో పాటు విశాలవంతమైన వాకింగ్‌ట్రాక్ ఉంది. ఈ ట్రాక్‌పై ఉదయం, సాయంత్రం వేళ్లలో సుమారు 100 మంది పైగా వాకింగ్ చేస్తారు. ఆట పరికరాలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళ్లలో, సెలవు రోజుల్లో చిన్నారులు, పెద్దలతో కళకళలాడుతూ ఉంటుంది. ప్రస్తుతం ఈ పార్కు కళతప్పుతోంది. ఈ పార్కుకు పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు మందుబాబులు రాత్రి సమయంతో మద్యం తాగుతున్నారు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

గవర్నర్‌పేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత అత్యున్నత రాష్ట్రపతి పదవి వరించే వరకు ఎదిగిన కృషీవలుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు వి.గుర్నాథం అన్నారు. రాధాకృష్ణన్ వర్ధంతిని పురస్కరించుకుని ఏపీసీసీ, సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రరత్న భవన్‌లో నివాళులు అర్పించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, సర్వేపల్లి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులు అన్సారీ, పోతురాజు ఏసుదాసు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కండెల వరప్రసాదరావు, సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు నేలపాటి సుభాష్, ఎం.పరశురామ్ యాదవ్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి నిధులిచ్చేందుకు సీఎం సిద్ధం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె

భారతీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి ఎన్ని కోట్ల రూపాయలు అయినా కేటాయించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం తూర్పు పరిధి 5వ డివిజన్ ఎల్ఐసీ కాలనీలోని 3,4 రోడ్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్థానిక నేతలు, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సుమారు రూ.29లక్షల వ్యయంతో చేపట్టిన రహదారుల పునర్నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ .రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, పార్టీ నేతలు యలమంచలి రాజేష్, డాక్టర్ జి .రామ్మోహన్, జి హరిబాబు, ఎస్ఎస్ శాస్త్రి, వేమూరి బాబురావు, ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్, కాలనీ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా సిరిజ్యోతి పూజ



మాట్లాడుతున్న మాతా శ్రీ వేణుశ్యామాజీ

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కామాఖ్యామృత శోధన పీఠాధిపతి మాతాశ్రీ వేణుశ్యామ పర్యవేక్షణలో అమ్మ సిరిజ్యోతి పూజ ఘనంగా జరిగింది. గార్లపాటి సుదర్శనరావు, సాయిరాణి ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి కల్యాణ మండపంలో గురువారం సిరి జ్యోతి పూజ (శ్రీ చ క్రపూజ), ఖడ్గమాల స్తోత్రం, లలితా సహస్ర సామూహిక పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా శ్రీ వేణుశ్యామాజీ మాట్లాడుతూ శ్రీ చక్ర ఆవరణలు - షట్ చక్రాలకు తాత్విక అనుసంధానం గురించి వివరించారు. శ్రీచక్రం ద్వారా కుండలినీ శక్తి మేల్కొలిపి, చక్రాల గుండా సాగి బిందువులో శివశక్తుల ఐక్యం ద్వారా పరమాత్మ స్థితిని సాధించవచ్చునని మాతాజీ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎంలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం



విద్యార్థినికి బ్యాడ్జీ ధరింపచేస్తున్న డాక్టర్ రామాయణపు రాధాకృష్ణ

పటమట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్లో పాఠశాల విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్టర్ రమేష్ హాస్పటల్ జనరల్ ఫిజీషియన్ రామాయణపు రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థి నాయకులచే ప్రమాణస్వీకారం చేయించి బ్యాడ్జీలను ధరింప చేసి బాధ్యతలను అప్పగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి మాట్లాడుతూ మనం, మన కుటుంబం, మన సంస్కృతి, మన చరిత్ర నుంచి నేర్చుకున్న విలువలే చక్కని పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్‌పోర్టు, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో వైద్య శిబిరం

గుణదల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోగాన్ని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే వైద్యుల సాయంతో నయం చేసుకోవడం సులభమేనని కార్డియాలజిస్ట్ జి.జె.నరసింహారావు తెలిపారు. గురునానక్ కాలనీలోని లివ్ హాస్పటల్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన 150 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వైద్యులు హర్షిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ టి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి యోగా శిక్షణా తరగతులు

గాంధీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి జూన్ 12వరకు వేసవి యోగా శిక్షణా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీ నాగేశ్వరరావు, పీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉదయం 5.45 నుంచి 6.45 గంటల వరకు సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఈ కార్యక్రమం ప్రముఖ యోగా గురువు అంకాల సత్యనారాయణ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 90147 46719, 98487 32626లో కానీ, స్టేడియం ఆవరణలోని తమ అసోసియేషన్‌లో సంప్రదించాలన్నారు.

పది ఫలితాలకు ముందే ఇంటర్‌లో ప్రవేశాలా?

- ఏఎస్ఎఫ్ఐ రాష్ట్ర నేత సాయికుమార్

గాంధీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలు రాక ముందే ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలను పూర్తి చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ తప్పుబట్టారు. దాసరిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన కూటమి నేతలు, ప్రముఖ విద్యాసంస్థల యాజమన్యాలు అసెంబ్లీలో ఉండటంతోనే వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు లక్షల కోట్ల లబ్ధి చేకూర్చే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత విద్యను దూరం చేయడం సరైందికాదన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజు వివరాలను నిర్ణయించాలని. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధ్యక్షులు కార్తీక్, సాదిక్‌బాబు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రంజిత్, జగదీష్, కోశాధికారి సురేష్, సహాయ కార్యదర్శి అభి, మధు తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్లతో మాదిగలకు అన్యాయం

- వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్లతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ లోపాలతో కూడిన ఆర్డినెన్స్ సరిచేసి మాదిగలకు 7, మాలలకు 7, రెల్లి ఉపకులాలకు 1 సమన్యాయం చేసి ఆర్డినెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. 2026 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలను యూనిట్‌గా తీసుకుంటామని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనతో మాదిగల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. మాదిగ జాతి హక్కుల సాధనకు మే 30న అమరావతిలో మాదిగ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. చెరుకూరి కిరణ్, పూనూరు జార్జ్, మందా నాగమల్లేశ్వరరావు, యర్రంశెట్టి ప్రసాద్ రెల్లి పాల్గొన్నారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన ఎంజీ రోడ్డు, సూర్యారావుపేట, నక్కలరోడ్డు, డోర్నకల్ రోడ్డు, ఏలూరు రోడ్డు, రామవరప్పాడు రింగ్, నేషనల్ హైవే, కనకదుర్గ వారధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడను వ్యర్థ రహిత నగరంగా మార్చేందుకు పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. డివైడర్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తుండాలని ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్‌ను ఆదేశించారు. డివైడర్లలో హరితాన్ని మరింత పెంచాలని, నగరంలో కాలుష్యం తగ్గించే విధంగా మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ హార్టికల్చర్ రామ్మోహన్‌ని ఆదేశించారు.



రాశుల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వమిది

- ధాన్యం కొనుగోలులో దళారుల ప్రయేయం లేకుండా చేశాం: మంత్రి నాదెండ్ల మనోహర్

కంకిపాడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు కొత్త ఆలోచనా విధానాలతో ముందుకు వెళుతోందని, దళారులతో ప్రమేయం లేకుండా రైతులకు అండగా నిలిచిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని పునాదిపాడు రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ధాన్యం రాశులను రైతులు, అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. దాళ్వాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే పద్ధతి లేకపోయినా 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రూ.8600 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. అనుకున్న దానికంటే వరి దిగుబడి ఎక్కువ కావడంతో గోనె సంచులు తక్కువ అయ్యాయని రైతులు చెబుతున్నారని, అవసరమైన సంచులు సరఫరా చేయాలని డీఈఎస్ఎం పద్మాదేవిని ఆదేశించారు. అనంతరం దావులూరులోని బాలాజీ మిల్లులో ధాన్యం దిగుమతిపై ఆరా తీశారు. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. తర్వాత వణుకూరు రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి, తహసీల్దార్ భవన్నారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, తెలుగురైతు జిల్లా కార్యదర్శి మద్దాలి సాయిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, జనసేన జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు పాల్గొన్నారు.

24 గంటల్లోనే నగదు జమ చేసింది ప్రభుత్వం

- మంత్రి నాదెండ్ల వద్ద రైతుల సంతోషం

ఖరీఫ్‌తో పాటు దాళ్వాలోనూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే ఖాతాల్లో కూటమి ప్రభుత్వం నగదు జమ చేసిందని రైతులు మంత్రి నాదెండ్ల మనోహర్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా రూ.1600 మద్దతు లభించిందని తెలిపారు. హమాలీలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు

విజయవాడ విమానాశ్రయ పనులను పూర్తి చేయండి

- అధికారులకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విజయవాడ విమానాశ్రయ విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే జూన్ నాటికి సిద్ధం చేయాలని విమానయాన అధికారులను కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. గురువారం ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్‌లో విజయవాడ విమానాశ్రయ ప్రాజెక్టు పనులపై అధికారులు, ప్రాజెక్టు భాగస్వాములతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. విమానయాన ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీసిన మంత్రి పనులు పూర్తి కావడంలో జరుగుతున్న జాప్యం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్తరణ పనుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, మే నెలాఖరులోగా పనులను పూర్తి చేసి, జూన్ నాటికి విమానాశ్రయాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ సమకూరుతుందని సూచించారు. ఈ సమావేశంలో పౌర విమానయాన కార్యదర్శి వుయల్నామ్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఛైర్మన్ విపిన్‌కుమార్, ప్రాజెక్టు భాగస్వాములు పాల్గొన్నారు.

ఉల్లి ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

వన్‌టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉల్లి ధరలు అకస్మాత్తుగా పడిపోతున్న దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి ఉల్లి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కె.వి.వి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల క్వింటా ఉల్లి రూ.1,800 నుంచి రూ.2,300 వరకు పలికిందని, ప్రస్తుతం రూ.1,300కు పడిపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కనిష్ఠంగా క్వింటా ధర రూ.600కు పడిపోయిందని, రైతుకు కిలో ఉల్లికి రూ.ఆరు దక్కుతుంటే మార్కెట్‌లో రూ.20కు పైగా అమ్ముతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఉల్లి ధరలు పడిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని, కిలో రూ.15 మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో

చిరుత మృతి ఘటనపై విచారణ

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉచ్చులో చిక్కుకుని ఆడ చిరుత మృతి చెందిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమగ్ర విచారణకు ఆదేశించారు. గర్భంలోని రెండు కూనలు చనియాయని తెలుసుకున్న ఆయన ఐఎఫ్ఎస్ అధికారి చలపతిరావును విచారణాధికారిగా నియమించారు. ప్రాథమిక సమాచారాన్ని పరిశీలించి, అధికారులు ఎలా స్పందించారనే దానిపై ఆయన ఆరా తీశారు. అటవీ ప్రాంతాల్లో జంతువుల కోసం ఉచ్చులు పెట్టి, వేటగాళ్లు చేసే నేరాలపై నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. విచారణను అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు పర్యవేక్షించాలని సూచించారని ఉప ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు గురువారం తెలిపాయి.



దేవరాగం నాటికలో ఓ సన్నివేశం

అలరిస్తున్న నాటిక పోటీలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చంద్రన్న వజ్రోత్సవ వేడుకల సందర్భంగా పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్య మండలి సంయుక్త అధ్వర్యంలో గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్ సమీపంలోని కందుకూరి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 44వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. గురువారం ఉత్తరాంధ్రకు చెందిన సౌజన్య కళా స్రవంతి బృందం 'దేవరాగం' అనే నాటికను ప్రదర్శించింది. ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంది. హర క్రియేషన్స్ ప్రదర్శించిన 'మనస్సాక్షి' నాటిక ఆకట్టుకొంది. నెల్లూరు ప్రాంతానికి చెందిన క్రాంతి ఆర్ట్ థియేటర్స్ బృందం ప్రదర్శించిన 'మోచేతి కంకణాలు' నాటిక సాంఘిక స్పృహను కలిగించి ప్రేక్షకుల హృదయాలను తాకింది. రంగస్థల నటులు కళారత్న డాక్టర్ దామోదర గణపతిరావు, యజ్జల విజయసాగర్, ఈవన రమేష్‌బాబులను నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాన్ని పసుపులేటి వెంకటరమణ నిర్వహించారు.

ఆపరేషన్ బ్లాక్

కార్ల అద్దాల టింట్ ఫిల్మ్ తొలగింపు ● నగరంలో విస్తృతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కారులో కూర్చున్న మనకు బయట రహదారులపై ఉన్న వాళ్లు కనిపించాలి. బయట ఉన్న వాళ్లకు మాత్రం కారు లోపల కూర్చున్న వారు కనిపించకూడదు. కార్ల యజమానుల ఆలోచన ఇది. దీని కోసం రెండు చేతులు అడ్డుగా పెట్టుకుని, అద్దాలపై ముఖం పెట్టి చూసినా కనిపించకుండా నలుపు రంగు ఫిల్మ్ అతికించారు. ఇప్పుడు ఈ నలుపు రంగు ఫిల్మ్‌ల తొలగింపునకు ట్రాఫిక్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రారంభించారు. కార్లకు ఉన్న ఈ ఫిల్మ్‌లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పోలీసులు కొన్నాళ్ల క్రితం ప్రకటించారు. కమిషనరేట్ పరిధిలో హెల్మెట్ ధారణను తప్పనిసరి చేసిన సమయంలోనే ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన స్పష్టమైన ప్రకటన చేశారు. ఒక్కో నిబంధనను ఉల్లంఘించిన వారికి ఎంతెంత జరిమానా విధిస్తారో ప్రకటించారు. హెల్మెట్‌పై ద్విచక్ర వాహనదారులు అవగాహనను పెంచుకున్నప్పటికీ కార్ల యజమానులు నలుపును తొలగించడానికి సుముఖత చూప డం లేదు. ఈ నలుపు రంగు ఫిల్మ్ తొలగింపునకు నిర్ణీత గడువు ఇచ్చినప్పటికీ యజమానుల్లో మార్పు రావడం లేదు.

70 శాతం విజిబులిటీ ఎక్కడ..

కార్ల అద్దాలకు ఉండే నలుపు రంగు ఫిల్మ్(టింట్ ఫిల్మ్) తొలగింపుపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కార్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ నలుపు ఫిల్మ్ అతికించవద్దని పేర్కొంది. కార్లలో కూర్చున్న వారు, వాటిని నడిపే డ్రైవర్ బయటి వారికి కచ్చితంగా కనిపించాలని స్పష్టం చేసింది. ఒకవేళ ఈ ఫిల్మ్‌ను అతికించుకున్నప్పటికీ విజిబులిటీ 70శాతం ఉండాలని నిబంధన విధించింది. కానీ కార్ల యజమానులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నారు. లోపల ఉండేవారు కనిపించకుండా ఈ ఫిల్మ్‌లను అతికిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు నలుపును తొలగించాలని నిర్ణయించారు. ఈ టింట్ ఫిల్మ్‌లను తొలగించడానికి ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. కూడళ్లలో ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడినప్పుడు నలుపు ఫిల్మ్ ఉన్న కార్లను గుర్తించి పక్కకు తీసుకొస్తున్నారు. కారులో డ్రైవర్ సీట్లో ఉన్న వారితో ఆ ఫిల్మ్‌లను తీయిస్తున్నారు.



బెంజ్‌సర్కిల్ వద్ద కారు అద్దాలకు ఉన్న నలుపు రంగు ఫిల్మ్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పెదపులిపాక ఇసుక రోడ్డుకు మహిళ బలి

- భర్తతో కలిసి కరకట్ట మీదుగా తాడిగడప వస్తుండగా ప్రమాదం
- ఇసుకలో స్కిడ్ అయిన ద్విచక్రవాహనం.. పాఠశాల వ్యాను కింద పడి దుర్మరణం

పెనమలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పెదపులిపాకలో ఇసుకతో నిండిపోయిన ప్రధాన రోడ్డు గురువారం ఒక మహిళను బలితీసుకొంది. వివరాల్లోకి వెళితే తాడిగడపకు చెందిన చిలుమూరి శ్రీనివాస్, శిరీష(38) భార్యాభర్తలు. శ్రీనివాస్ అవనిగడ్డలో సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం తాడిగడప శ్రీనివాసనగర్ కట్ట వద్ద ఉన్న తమ ఇంటికి భార్యాభర్తలిద్దరూ మోటారు సైకిల్‌పై వస్తున్నారు. పెదపులిపాక గ్రామంలోని ప్రధాన రోడ్డుపైన ప్రయాణిస్తుండగా వెనుక నుంచి పాఠశాల వ్యాను వస్తోంది. వ్యానుకు దారిచ్చేందుకు శ్రీనివాస్ మోటారుసైకిల్‌ను రోడ్డుకు ఒక పక్కకు తీసుకెళ్లారు. ఇసుకలోకి వెళ్లిన మోటారుసైకిల్ టైరు స్కిడ్ అయింది. దీంతో శిరీష కింద పడిపోయింది. వెనుక నుంచి వ్యాను శిరీష తలపైకి ఎక్కడంతో తల నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థులు శిరీషను పక్కకు తీసి పాఠశాల వ్యానును ఆపి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుకతో నిండిపోయిన పెదపులిపాక ప్రధాన రోడ్డు

పెదపులిపాక ప్రధాన రోడ్డు టిప్పర్లు, ట్రాక్టర్లు తెస్తున్న ఇసుకతో నిండిపోయింది. బైక్‌లపై ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. వారం క్రితం కరకట్టపై టిప్పరు ఢీకొనడంతో ఒక వాహనదారుడు కొద్దిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అదే రోజు మరొకరి బైక్ టైరు టిప్పరు కింద నలిగిపోయింది. ఇంతలోనే పాఠశాల వ్యాన్ కింద మహిళ దుర్మరణం చెందడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోకి ఇసుక టిప్పర్లు, భారీ వాహనాలు రాకుండా గడ్డర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేదంటున్నారు.

స్టార్టప్‌లకు సరికొత్త ఊపు

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో మారనున్న పారిశ్రామిక రంగ రూపురేఖలు
- విజయవాడలో స్పోక్ ప్రాంతీయ కేంద్రం అభివృద్ధికి ముమ్మర కసరత్తు: కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు సరికొత్త ఊపు రానుందని, ఈ హబ్‌తో పారిశ్రామిక రంగం రూపురేఖలు సమూలంగా మారనున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన టాటా ఇన్నోవేషన్ హబ్-స్పోక్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్(ఐటీఈ అండ్ సీ) ప్రత్యేక అధికారి దీప్తిరావుతో పాటు సమన్వయ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. స్టార్టప్, ఆవిష్కరణల వ్యవస్థలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ విధానాలను అమలు చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ హబ్‌కు అనుసంధానంగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ మద్దతు, ప్రైవేటు నిర్వహణలో ఉండే ప్రధాన హబ్‌తో పాటు ప్రాంతీయ కేంద్రాలకు ప్రత్యేక బోర్డులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రాంతీయ కేంద్రానికి ఒక ప్రమోటర్ ప్రెసిడెంట్‌గా, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది సహ ప్రమోటర్లు, ఇద్దరు స్వతంత్ర నిపుణులతో పాటు ప్రభుత్వం, విద్యారంగం, పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఇందుకు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. పెట్టుబడులు, ఫైనాన్సింగ్, ఇంక్యుబేషన్, భాగస్వాముల నిర్వహణ, అకౌంటింగ్, మార్కెటింగ్, కమ్యూనికేషన్ వంటి విధులను బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ నిర్వహిస్తుందని వివరించారు. విజయవాడ ప్రాంతీయ స్పోక్ కేంద్రం కార్యకలాపాల నిర్వహణకు శాశ్వత ప్రాంగణం అందుబాటులోకి వచ్చేంతవరకు తాత్కాలిక భవనంతో పాటు మౌలిక వసతులు కల్పించడం, కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యేలా చూడటంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి ఇన్నోవేషన్ టాస్క్‌ఫోర్స్ పని చేస్తుందని వివరించారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ లక్ష్య సాధనకు, స్వర్ణాంధ్ర 2047ను సాకారం చేయడంలో విద్యాసంస్థలు, పారిశ్రామిక సంఘాలు భాగస్వాములవుతాయని సమావేశానికి హాజరైన ప్రతినిధులు స్పష్టం చేశారు. విట్ ఏపీ ప్రతినిధి డాక్టర్ అమీత్ చరణ్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధి ఉదయన్ బక్షి, మోహన్ స్పింటెక్స్ ప్రతినిధి వి.రమేష్, ఏపీఐఐసీ జడ్ఎం కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు

- వర్షాకాలంలోనూ ఇసుక కొరత రాకుండా జాగ్రత్తలు
- ఈ-వ్యర్థాల నిర్వహణ ఇతివృత్తంతో ఈనెల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర': కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్: ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకొన్న చర్యలు, వచ్చే వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎంఎస్ఎంఈ సర్వే, అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, పీఎం సూర్యఘర్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సీఎస్ మార్గనిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. 'జిల్లాస్థాయిలో వేసవిలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేశాం. ప్రజావసరాలు, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ఇసుక స్టాక్ యార్డుల్లో 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను సిద్ధం చేసి, ఇసుక కొరతకు తావు లేకుండా చూస్తాం. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమిని అందుబాటులోకి తెస్తాం. ఈ నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ ప్రధాన అంశంతో నిర్వహిస్తాం. పర్యావరణ హిత ఈ-వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇస్తాం.' అని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు.

మహిళా న్యాయవాదుల డిష్యుం..డిష్యుం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్‌లో ఇద్దరు మహిళా న్యాయవాదులు కలబడ్డారు. న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న ఓ మహిళా న్యాయవాది, లా పూర్తి చేసి ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్(ఏఐబీ) రాయకుండా వకల్తాలు వేస్తున్న మరో మహిళా న్యాయవాది మధ్య మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు హాలులో మొదట వివాదం ప్రారంభమైంది. వకల్తాలు వేస్తున్న మహిళా న్యాయవాదిపై మరో మహిళా న్యాయవాది బెజవాడ బార్‌ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో బార్ జనరల్ సెక్రటరీ ఏవీ రంగారావు వకల్తాలు వేసి ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదికి కబురుపంపారు. దీంతో బార్ చాంబర్‌కు వచ్చిన ఆమె, తనపై ఫిర్యాదు చేసిన న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించడంతో గొడవ ప్రారంభమైంది. ఇద్దరూ న్యాయవాదుల ముందే తన్నుకున్నారు. అనంతరం వకల్తాలు వేసే మహిళా న్యాయవాది, దుస్తులు చించేసుకొని రోడ్డుపైకి వెళ్లి బైఠాయించింది. విషయం తెలుసుకున్న సూర్యారావుపేట పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీంతో బార్‌లో ఫిర్యాదు చేసిన మహిళా న్యాయవాదితో పాటు పలువురు మహిళ, పురుష న్యాయవాదులు స్టేషన్‌కు వెళ్లి వకాల్తాలు వేసి ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదిపై ఫిర్యాదులు చేశారు. వివాదాన్ని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పరిష్కరిస్తున్నట్లు సమాచారం.

వైసీపీ నేత, క్రికెట్ బుకీ అరెస్టు

సింగరాయకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన వైసీపీ నేత, ప్రధాన క్రికెట్ బుకీ మసనం వెంకట్రావును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై బి.మహేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. వెంకట్రావు దగ్గర కడపకు చెందిన సతీశ్‌కుమార్ కొద్దినెలల నుంచి క్రికెట్ పందేలు ఆడుతున్నాడు. అతను ఇప్పటికే చాలా నగదు పోగొట్టుకున్నాడు. బెట్టింగ్‌లకు సంబంధించి ఇంకా రూ.2లక్షలు వెంకట్రావుకు చెల్లించాలి. ఈ నగదును వెంటనే ఇవ్వాలని తరచూ సతీశ్‌కుమార్‌ను వెంకట్రావు బెదిరింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏపీ గేమింగ్ యాక్ట్ 386 ఐపీసీ 3, 4 సెక్షన్ల కింద సింగరాయకొండ ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేశారు. అనంతరం వెంకట్రావును అదుపులోకి తీసుకుని కందుకూరు కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించారు.

ఏసీబీకా.. సీఐడీకా!

- శాప్ ఇంజనీరింగ్ అధికారి కేసులో పోలీసుల ఆలోచన
- నిత్యం వివరాలు సేకరిస్తున్న రెండు విభాగాలు
- మహిళ పేరున ఉన్న భూముల వివరాలివ్వాలని రిజిస్ట్రార్‌కు లేఖ

విజయవాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): శాప్ ఇంజనీరింగ్ అధికారి కేసును ఏం చేద్దాం.. విజిలెన్స్‌కు ఇచ్చేద్దామా..ఏసీబీకి అప్పగిద్దామా? పోలీసుల ముందు ఉన్న ప్రశ్నలు ఇవి. శాప్‌లోని ఒక ఇంజనీరింగ్ అధికారికి, నందిగామలో ఒక మహిళకు మధ్య జరుగుతున్న ఆస్తుల వివాదం కేసులో కోట్లలో లావాదేవీలకు సంబంధించి వివరాలు వెలుగులోకి వస్తున్న విషయం తెలిసిందే. కొట్లాట కేసుగా నమోదు చేసిన పోలీసులు ఫిర్యాదురాలికి సంబంధించిన మొత్తం నగదు లావాదేవీలను గుర్తించారు. ఫిర్యాదు చేసిన మహిళ, ఆమె తల్లి పేరు మీద ఉన్న ఆరు బ్యాంకు ఖాతాల్లో రూ.9 కోట్లు ఉన్నట్టు ఇప్పటికే గుర్తించారు. ఎక్కడెక్కడ నుంచి ఏఏ మార్గాల్లో ఈ నిధులు వచ్చాయో తెలుసుకుంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ ఆమె ఖాతాకు రూ.2 కోట్లు బదిలీ చేసినట్టు మూడు రోజుల క్రితం నిర్ధారించారు. ఆ ఒక్క కాంట్రాక్టరే కాకుండా శ్రీకాకుళం, అమలాపురం, విజయవాడకు చెందిన కాంట్రాక్టర్లు ఆ మహిళ ఖాతాలకు డబ్బులు పంపినట్టు సమాచారం. తవ్వే కొద్దీ ఇందులో ఒక్కో మూలం బయటకు వస్తుండడంతో పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు మొత్తం కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక పక్క ఏసీబీ అధికారులు, మరో పక్క సీఐడీ అధికారులు ఈ కేసు గురించి పోలీసులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఇప్పటి వరకు సేకరించిన ఆధారాలను మొత్తం ఏసీబీకి గానీ, సీఐడీకి గానీ ఇచ్చేదామన్న యోచనలో పోలీసులు ఉన్నట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ అధికారిపై ఫిర్యాదు చేసిన మహిళ పేరు మీద ఉన్న భూముల వివరాలను మొత్తం ఇవ్వాలని పోలీసులు రిజిస్ట్రేషన్ అధికారులకు లేఖలు రాశారు. అధికార పార్టీ నాయకులు పోలీసు అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు ఎవరెవరు తలదూర్చుతున్నారన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.

చోరీ కేసుపై దుర్గగుడి ఈవో ఆరా


ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల కారులో బంగారు ఆభరణాలు, నగదు చోరీ కేసుపై దుర్గగుడి ఈవో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గురువారం ఆరా తీశారు. మూడు రోజుల క్రితం అమ్మవారి దర్శనానికి వ చ్చిన హైదరాబాద్‌కు చెందిన ఆచంట దుర్గాప్రసాద్ ఘాట్‌రోడ్డు ఓంకా రం మలుపు వద్ద పార్కింగ్ చేసిన కారులో 241 గ్రాముల బంగారు ఆభ రణాలు, రూ.10 వేలు చోరీ అయిన సంగతి విదితమే. చోరీ జరిగిన ప్రదేశం వద్దకు గురువారం ఈవో వెళ్లి పరిశీలించారు. అధికారులను, సెక్యూరిటీ గార్డులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెస్ట్ ఏసీపీ, డీసీపీలతో ఫోన్‌లో మాట్లాడి కేసు వివరాలు అడిగి తెలుసుకు న్నారు. అనంతరం ఆయన లిఫ్ట్ మార్గం నుంచి కాలినడకన వెళుతూ సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాలను పరిశీలించి సంబంధిత విభాగాల అధికా రులకు పలు సూచనలు చేశారు.

అదనపు కట్నం తెమ్మని వేధించిన ఐదుగురిపై కేసు

విద్యాధరపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనంగా డబ్బులు తెమ్మంటూ భార్యను వేధించి, కొట్టి చంపుతానని బెదిరించిన భర్తతో సహా ఐదుగురిపై గురువారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం కోళ్లఫారం రోడ్డుకు చెందిన యస్మినా బేగంకు 2017 మే 20న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం, సింగరాయపాలెం గ్రామానికి చెందిన షేక్ అక్బర్‌తో వివాహమైంది. వివాహం సందర్భంగా యస్మినా బేగం కుటుంబ సభ్యులు అక్బర్ తల్లిదండ్రులకు రూ.5లక్షల కట్నం, 100 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల సామగ్రి కట్నంగా ఇచ్చారు. వివాహమైన రెండేళ్ల వరకు భార్యాభర్తలు బాగానే ఉన్నారు. 2018లో వీరికి కుమారుడు పుట్టాడు. అక్బర్ రోజూ మద్యం తాగి ఇంటికెళ్లి అకారణంగా భార్యను కొట్టేవాడు. ఇతర మహిళలతో తరచూ ఫోన్లు మాట్లాడుతుండేవాడు. దీనిపై అత్త, మామ, ఆడపడుచులకు చెప్పినా వారు అక్బర్‌కే మద్దతిచ్చేవారు. వీరందరూ అదనంగా రూ.5లక్షలు పుట్టింటి నుంచి తీసుకురమ్మని యస్మినా బేగంను వేధించి, ఓ గదిలో బంధించి కొట్టేవారు. భర్త, అతని కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక బాధితురాలు 2021లో పుట్టింటికి వచ్చి భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అక్బర్, అతని కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ కాపురానికి పంపించారు. 2023 అక్టోబరు 17న యస్మినా బేగం పాపకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి బాధితురాలిపై వేధింపులు మరీ ఎక్కువ అయ్యాయి. 2024 నవంబరు 10న అక్బర్ మద్యం తాగి ఇంటికివెళ్లి భార్యను విచక్షణారహితంగా కొట్టాడు. ఈ వినయాన్ని తండ్రి, సోదరుడికి బాధితురాలు చెప్పగా వారు అక్బర్, కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి ప్రశ్నించారు. వారిని కూడా కొట్టి ఇంటి నుంచి పంపించివేశారు. అక్కడి పోలీసులకు యస్మినా బేగం ఫోన్ చేయటంతో ఆమెను కూడా పంపించేశారు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వచ్చింది. అదే నెల 29న అక్బర్, అతని సోదరి, సోదరి భర్త బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమె కుమారుడిని బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పెద్దగా కేకలు వేయటంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి అక్బర్ బాధితురాలికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ చంపయినా కుమారుడిని తీసుకువెళతానని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి, భర్త, అత్త, మామ, ఆడపడుచు, ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్ దుర్మరణం

- టైరు పేలి డివైడర్ ఢీకొన్న కారు
- ఒక్కసారిగా వెనుకనున్న ట్రాన్స్‌పోర్టు లారీకి బ్రేకులు
- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని డ్రైవర్ దుర్మరణం



దెబ్బతిన్న కారు


జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట- చిల్లకల్లు రహదారిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో జరిగింది. ముందు వెళుతున్న కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొనడంతో వెనుక వస్తున్న ఎస్ఆర్ఎంటీ వాహనం ఒక్కసారిగా బ్రేక్ కొట్టడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దాంతో వాహనం అదుపు తప్పి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డుకు ఉన్న వాహనాన్ని పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతి చెందిన డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉంది.





ట్రాన్స్‌పోర్టు లారీని తొలగిస్తున్న యంత్రం, దుర్మరణం చెందిన డ్రైవర్

లోకానికి వెలుగుదారి



దైవమార్గం

క్రీస్తు జననం, మరణం, పునరుత్థానం... ఈ మూడూ అద్భుతాలే. ఈ సందర్భాలను క్రిస్మస్, గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పేరిట క్రైస్తవులు జరుపుకొంటారు. జననం, పునరుత్థానం... సంతోషకరమైన ఘట్టాలు. మరి మరణించిన ఈ శుక్రవారం శుభమైనది ఎలా అయింది?

క్రీస్తు పుట్టడానికి కొన్ని వందల సంవత్సరాల క్రితమే... ఆయన మరణం గురించి ఎందరో భక్తులు, ప్రవక్తలు ముందుగానే ప్రవచించిన దాఖలాలు బైబిల్ గ్రంథంలో కనిపిస్తాయి. ఆయన జననం, మరణం యాదృచ్ఛికం కాదని, అది ముందుగానే నిర్దేశించి ఉందనీ బైబిల్ పూర్వ లేఖన సాహిత్యం చెబుతోంది. ఆయన మరణానికి ముందు జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుందాం.

గలిలియా సముద్రతీరాన ఉన్న ప్రాంతంలోని పల్లె పల్లెను ఏసు పలకరించి, అక్కడి ప్రజలకు తన సూక్తులను, ఉపమాన కథలను వినిపించాడు. ఆయన బోధలతో ప్రజలు అనేక సత్యాలు తెలుసుకొని చైతన్యవంతులు ఉన్నారు. అప్పటికే స్థిరపడి ఉన్న యూదా మత పెద్దరికం దీన్ని చూసి ఓర్వలేకపోయింది. అసూయతో, తమ ప్రాధాన్యం తగ్గిపోతుందనే భయంతో ఆయనపై కుట్రలు పన్నింది. అమాయక ప్రజలను రెచ్చగొడుతున్నారని క్రీస్తుపై నిందలు మోపింది, విప్లవకారుడిగా ముద్ర వేసింది. రాచరికానికి వ్యతిరేకంగా ప్రజల్ని మారుస్తున్నట్టు చిత్రీకరించింది. నాటి రోమన్ రాచరికం కూడా దీన్ని నమ్మింది. ఆయనను పట్టుకోవడానికి ప్రయత్నించింది. ఈ సంగతి తెలుసుకున్న ప్రభువే వారికి పట్టుబడ్డాడు. ఆయనను బంధించి, సంకెళ్ళు వేశారు. దోషిగా తీర్పు ఇచ్చారు. తలపై ముళ్ళ కిరీటం పెట్టి, భుజానికి బరువైన శిలువను ఎత్తి, కొరడాలతో కొడుతూ కొండపైకి నడిపించారు. బలహీనస్థితికి చేరుకున్న ఆయనను కల్వరి శిఖరానికి చేర్చారు. ఆయనను శిలువ కొయ్యపై ఉంచి, కాళ్ళకు, చేతులకు మేకులు కొట్టి వేలాడదీశారు. ఆ స్థితిలో కూడా "తండ్రీ వీరు ఏం చేస్తున్నారో వీరికే తెలియదు. కనుక వీరిని క్షమించు" అని ఆ దేవుణ్ణి వేడుకున్నాడు. శిలువపై అంతటి బాధలోనూ క్షమాగుణాన్ని వీడలేదు. తన ప్రేమ సందేశాన్ని వినిపించాడు. రక్తసిక్తమైన దేహంతో ఆ శిలువపైనే ఆయన మరణించాడు. అదే శుభ శుక్రవారం. గుడ్ ఫ్రైడే.

జీవన మార్గదర్శులు

అలా మరణించిన క్రీస్తు శరీరాన్ని ఆయన శిష్యులు అతి భద్రంగా సమాధి చేశారు. మరణించిన మూడో రోజు ఆదివారం... సమాధి నుంచి ఆయన తిరిగి లేచాడు. అదే ఈస్టర్... పునరుత్థానం. ఇద్దరు మహిళలు ఆయనను దర్శించుకోవడానికి తెల్లవారుజామునే సమాధి ఉన్న చోటుకు చేరుకున్నారు. అప్పటికే మరణం నుంచి లేచిన క్రీస్తు.. ఆ సమాధి తోటలో తిరగడం చూశారు. అతను తోటమాలి అనుకొని... ఆయన ఆచూకీ గురించి ఆయననే అడిగారు. క్రీస్తులో దైవత్వానికి ఈ పునరుత్థానమే సాక్ష్యం. ఆ తరువాత ఆయన అనేకసార్లు తన శిష్యులకు కనిపించాడు. వారి మధ్య తిరిగాడు. అయినా వారు గుర్తు పట్టీపట్టనట్టు అనుమానంతో ఉండిపోయారు. ఒకసారి... వారంతా గుమిగూడిన గదిలో ప్రభువు వారికి దర్శనమిచ్చి... ప్రజల కోసం ఏం చేయాలో ఆదేశించాడు. ప్రజలను బాప్తిస్మం (బాప్టిజం) ఇచ్చి, తన వాక్యం బోధించి, శిష్యులుగా చేయాలని, వారికి పవిత్రాత్మ తప్పకుండా తోడవుతుందని భరోసా ఇచ్చాడు. ఏసు ఈ భూమి మీద ముప్పై మూడేళ్ళపాటు జీవించాడు. ఆయన ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉన్నాడు. ఉపమానాలతో కూడిన ఎన్నో కథలతో, తనచుట్టూ ఉన్న సామాన్య జనానికి అర్థమయ్యే భాషలో బోధనలు చేశాడు. వాటిని ప్రపంచం నేటికీ ఆసక్తిగా వింటూనే ఉంది. ఎందుకంటే... అవి మానవ జీవనానికి మార్గదర్శులు. దేవుణ్ణి ఎలా ప్రేమించాలి? తోటి వారితో ఎలా మెలగాలి? ఏది సత్యమైన మార్గం? ఏది ఆదర్శమైన జీవనం?... ఇలా ఎన్నో అంశాలకు అవి నిర్వచనాలు.

గుడ్ ఫ్రైడే, ఈస్టర్... మనిషిలో ఆశావాదాన్ని నింపుతాయి. కష్టకాలంలో ఆత్మస్థైర్యంతో నిలబడాలని చెబుతాయి. మానవులకు కష్టాలు సర్వసాధారణం. మానవుడిగా జన్మించిన దైవపుత్రుడు కూడా అందుకు అతీతుడు కాదు. క్రీస్తు మరణం రాబోయే శుభాలకు సంకేతం. ఎండిపోయిన విత్తనం తిరిగి జీవాన్ని పుంజుకొని, చిగిర్చి, పైకి లేచినట్టు... ఆయన మరణం నుంచి తిరిగి లేచాడు. క్రీస్తు మానవునిలా పుట్టి, మానవునిలా మరణించిన ఘట్టాలు రెండూ ఈ భూమిపైనే జరిగాయి. ఆయన పునరుత్థానం ఇక్కడే జరిగింది. ఇది ఆయన పట్ల జనంలో విశ్వాసాన్ని బలోపేతం చేసింది. ఆయన చూపిన వెలుగుదారిని లోకం అనుసరించేలా చేసింది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

తెలుసుకుందాం

దివ్య తేజోశక్తి

వినయంగా మొర ఆలకించే గణేశుడు, చైతన్యంతో సంచరించే హనుమంతుడు. అంతఃశ్రద్ధతో పరితపించే బుద్ధుడు... ఈ పవిత్ర మూర్తులందరూ పెద్ద చెవులు కలిగిన శ్రవణ శక్తికి ప్రతీకలు. ఐరావతం మనలో దాగి ఉన్న వినికిడి శక్తికి చిహ్నం. అర్థవంతమైన శ్రవణమే జ్ఞానానికి మూలం. వేదాంతం 'శ్రవణం... మననం... నిదిధ్యాసనం' అనే త్రికరణ మార్గంలో నడుస్తుంది. జాతక కథల ప్రకారం, బుద్ధుడు తన గత జన్మలో ఐరావతంగా జన్మించాడు. బౌద్ధ ధర్మంలో క్షమ, సహనం అనే తత్త్వాలకు ప్రతిరూపంగా ఆ గజ రూపం తేజస్సుతో మెరిసింది. తూర్పు ఆసియాలో మూడు గజ ముఖాలతో పూజలు అందుకొనే 'ఎరవాన్' రూపం ఈ విశ్లేషణకు భౌతికమైన ఆధారం. పురాణాల్లో శత్రువును బలంతో జయించే ఐరావతం... బౌద్ధంలో సహనంతో సమరసత పొందే శాంతమూర్తిగా దర్శనమిస్తుంది. చగలగడం మనలోని శ్రద్ధను ప్రతిబింబిస్తుంది. భూమిపై పండే ఫలాలే యజ్ఞఫలమనే తత్త్వానికి ఇది ప్రతిపాదన.

విష్ణు వంశ వృత్తాంతం

ఐరావతుడు... విష్ణువు వంశంలో జన్మించినవాడు. విష్ణువు, బ్రహ్మ, కశ్యపుడు, ఇరావతి, ఐరావతుడు.. ఇదీ వంశక్రమం. దక్షప్రజాపతి కుమార్తె భద్రమతకు, కశ్యపునికి జన్మించిన ఇరావతి కుమారుడే ఐరావతుడు. రామాయణంలోని అరణ్యకాండ ప్రకారం... అతను మానవ రూపంలో కాకుండా మహా గజ రూపంలో జన్మించాడు. రావీ నదికి 'ఇరావతి' అనే మరో పేరు ఉండడం విశేషం. కాగా... దుర్వాసుడు ఇచ్చిన ఒక పుష్పమాలికను ఐరావతుడి కాళ్ళకు ఇంద్రుడు అలంకరించాడు. ఆ పూలపై తేనెటీగలు వాలి, తనను బాధించడంతో... ఆ మాలను ఐరావతుడు విసిరేశాడు. దాన్ని ఇంద్రుని అహంకారంగా భావించిన దూర్వాసుడు... దేవతలందరూ ముసలివారై, సమస్త శక్తులు కోల్పోతారని శాపం ఇచ్చాడు. క్షీరసాగరాన్ని మథించి... అమృతం పొందితే తిరిగి శక్తిమంతులు కావచ్చంటూ శాపవిమోచన మార్గాన్ని కూడా చెప్పాడు. దేవతలు తమ శక్తిని నష్టపోవడానికి కారణమైన ఈ సంఘటనే క్షీరసాగర మథనానికి నాంది. శాపం పొందడానికి కారణం... శ్రద్ధను కోల్పోవడమే. దానికి ప్రేరణా సూత్రధారి ఐరావతం. స్కాంద పురాణం ప్రకారం, సురపద్ముడనే రాక్షసుడితో జరిగిన యుద్ధంలో... అతని రథాన్ని ధ్వంసం చేసిన ఐరావతుడు 'వాహనశూరుడు' అనే బిరుదు పొందాడు. ఈ యుద్ధంలో అతని దంతాలు విరిగితే... వాటిని శివుడు మళ్ళీ ప్రసాదించాడు. ఐరావతుణ్ణి మరింత శక్తిమంతుడిగా అనుగ్రహించాడు.



ఐరావతుడు... విష్ణువు వంశంలో జన్మించినవాడు. విష్ణువు, బ్రహ్మ, కశ్యపుడు, ఇరావతి, ఐరావతుడు.. ఇదీ వంశక్రమం. దక్షప్రజాపతి కుమార్తె భద్రమతకు, కశ్యపునికి జన్మించిన ఇరావతి కుమారుడే ఐరావతుడు. రామాయణంలోని అరణ్యకాండ ప్రకారం... అతను మానవ రూపంలో కాకుండా మహా గజ రూపంలో జన్మించాడు.

ఐరావతం... ఒక తెల్లని గజరూపం మాత్రమే కాదు, ఒక తేజోమయమైన శ్రద్ధాశక్తి. వినిపించని ధ్వనుల్ని అందుకోగలిగే ఒక దివ్య శ్రవ్య శక్తి. ఆ శ్రవ్య శక్తికి మూలమైన కరుణ ఆ (అతని) స్వరూపంలో ఆవిష్కృతం అవుతుంది. ఆ శ్వేత (తెల్లని) కాంతికి మూలం ఏమిటి? చెవుల విశాలతలో మర్మం ఏమిటి? ఆ పెద్ద చెవులు కేవలం శరీరావయవాలు కావు. అవి శ్రవణశక్తికి రూపాలుగా, దైవత్వపు సంకేతాలుగా నిలుస్తాయి. ఆకాశాన్ని తాకే మేఘంలా మెరిసే ఐరావతుడు.. భూమికి వర్షప్రసాదాల వాహకుడుగా పురాణాల్లో కనిపిస్తాడు. 'ఓంకారమే సృష్టికి ఆది' అని ఆర్యోక్తి. అది శబ్దరూపంగా గ్రహించదగినదే కానీ, దృష్టికి అందని తత్త్వం. అందుకే శ్రవణమే జ్ఞానానికి తొలి ద్వారం. వినగల యోగ్యతకు ప్రాధాన్యం ఇవ్వడమే పురాణాల్లోని ఈ ప్రతీకాత్మకత తాలూకు సంకల్పం. వినే సామర్థ్యానికి ప్రాధాన్యాన్నిస్తూ... పురాణాల్లో ముందొచ్చిన చెవుల ప్రశస్తి కనిపిస్తుంది. వేదాలలో వర్షాధిదేవతగా ఇంద్రుణ్ణి కీర్తించారు. అతని వాహనం ఐరావతం. రైతుకు వర్షం యజ్ఞఫలం. అందుకే ఐరావతాన్ని రైతు పూజిస్తాడు. అది మేఘాల మార్మిక నాదాన్ని గ్రహించి, వర్షంగా మార్చి అందిస్తుంది. ఈ విషయాన్ని గ్రహిం

తూర్పు దిక్పాలకుడిగా...

అష్టదిక్పాలకుల వ్యవస్థలో తూర్పు దిక్కు పాలనా బాధ్యతను ఐరావతుడికి బ్రహ్మ అప్పగించాడు. ఇది కేవలం ఒక హోదా కాదు... ఆధార శక్తికి సంకేతం. తూర్పు అంటే అభ్యుదయ దిశ. ఐరావతం దానికి అధిష్ఠాన రూపం. అన్ని నాదాలు అందరికీ వినిపించవు. దాన్ని వినగల చెవి 'ఐరావతం'గా మారుతుంది. ఐరావతం నడిచిన బాటలు మేఘాలను మోస్తాయి. దాని పదఘట్టనలతో యుద్ధ రంగాలు కంపిస్తాయి. కానీ వాటి వెనుక నిలిచి ఉన్న తెల్లని రంగులో ఉండే (శ్వేత) శక్తి... ధర్మాన్ని నిలబెడుతుంది. ఐరావతం, ఎరవాన్, ఏరావత... ఇలా పేర్లు మారినా రూపం ఒక్కటే. అది ధర్మాన్ని మోసుకువచ్చే తేజోమయమైన వినయ స్వరూపం. విశాలమైన ఐరావతం చెవులు... 'వినడం' అనే వినయపూర్వక అభ్యాసానికి నిరంతర హేతువులు.

• డాక్టర్ జి.వి. పూర్ణచంద్

భూమాతా! వందనం...

22న ధరిత్రీ దినోత్సవం

మనకు, మనతోపాటు ఈ భూమిమీద జీవించే సమస్త ప్రాణికోటికి ఆధారం భూమి. దానిలోనుంచి ప్రాణులు ఉత్పన్నమయ్యాయి. మానవులు ఉద్భవించారు. ప్రాణులు జీవించడానికి అనుకూలమైన, ఆరోగ్యవంతమైన, సమతుల్య జీవనానికి దోహదపడే వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. నీరు, చెట్లు, పండ్లు, భగవంతుణ్ణి ఆరాధించుకోవడానికి పుష్పాలు... ఇలా అన్నీ భూమిపై ఏర్పడ్డాయి. అందుకే... ఉదయం లేవగానే, మన పాదాలను నేలకు ఆన్చినప్పుడు... 'సముద్రవసనే దేవీ, పర్వతస్థన మండలే/ విష్ణుపత్నీం నమస్తుభ్యం, పాదస్పర్శం క్షమస్వమే... 'అనే శ్లోకం ద్వారా... 'నిన్ను నా పాదాలతో స్పృశిస్తున్నందుకు క్షమించాలి' అని భూమాతను ప్రార్థించడాన్ని ఒక విధిగా పూర్వులు నిర్దేశించారు. కానీ మానవులు భూమాత పట్ల మూర్ఖత్వంతో వ్యవహరిస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం మితిమీరి భూమిని వినియోగించుకుంటున్నారు. తనపై విసిరేస్తున్న అనేక మాలిన్యాలను ఆమె భరిస్తోంది తనలోకి స్వీకరిస్తోంది. కానీ పరిస్థితి విషమిస్తే... ఆమె రౌద్రాకారం దాల్చుతుంది. అప్పుడు వరదల ద్వారా, భూకంపాల ద్వారా, కరువుకాటకాల ద్వారా ఏర్పడే పరిస్థితులకు మానవులు మూల్యం చెల్లించుకోవాలి. కాబట్టి ఈ విషయంలో అందరూ ఆత్మపరిశీలన చేసుకోవాలి.

మూలాధార రూపంలో...

యోగ శాస్త్రపరంగా చూస్తే, మనలో... మూలాధార రూపంలో భూమాత నిక్షిప్తమై ఉంటుంది. మన సూక్ష్మ శరీరంలో వెన్నెముక చివరి భాగాన ఉండే త్రిభుజాకారపు ఎముకగా ఉండే మూలాధారంలో నిక్షిప్తమైన శక్తి కుండలినీ శక్తి. ఈ జగత్తు సృష్టి కర్త అయిన భూమాత. జీవ పరిణామ క్రమంలోని వివిధ దశలకు... భూమి మధ్యలోని అక్షం (ఇరుసు, మధ్యభాగం) కీలకపాత్ర పోషించింది. అదే విధంగా మానవుడిని గతంవైపు లేదా భవిష్యత్తువైపు అతిగా వెళ్ళకుండా... నిశ్చలమైన, నిర్దిష్టమైన సమతుల్య స్థితిలో ఉంచేది... అతని



సహజయోగ

లోని సుషుమ్నానాడి. మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఇది చాలా ముఖ్యమైనది. మనలోని నాడీ వ్యవస్థకు ఈ ఇరుసే (అక్షం) ఆధారం. ఈ నాటి సరైన రీతిలో ఉండకపోవడం వల్ల కుడి, ఎడమలకు ఊగిసలాడుతూ ఉండేవారికి వివిధ చక్రాలలో సమస్యలు, ఇబ్బందులు ఏర్పడతాయి. మానవులలో ఈ ఇరుసు మూడున్నర వంతులు చుట్టుకున్న కాగితంలా ఉంటుంది. దానిలోపల బ్రహ్మనాడి... చాలా సన్నగా, వెంట్రుక వాసిలో ఉంటుంది. అలాంటి బ్రహ్మనాడిద్వారా... కేవలం వెంట్రుక లాంటి సన్నటి కుండలినీ పోగు మాత్రమే ఊర్ధ్వముఖంగా ప్రయాణిస్తుంది. ఇలాంటి స్థితిలో ఉన్నవారు బాహ్యపరంగా చూడడానికి గంభీరంగా, ధైర్యంగా, తెలివైనవారిగా, మంచివారిగా కనిపిస్తారు. కానీ ఆధ్యాత్మికంగా అంత లోతుగా ఉండరు.

భక్తి, శ్రద్ధలే మార్గం

ఆత్మసాక్షాత్కారం పొంది... ఆధ్యాత్మికమైన లోతులకు వెళ్ళగలిగే వ్యక్తుల్లో... బ్రహ్మనాడి విశాలమవుతుంది. దానిలో ప్రయాణించే కుండలినీ పోగులు కూడా వెడల్పుగా ఉంటాయి. అంతర్గతంగా ఆధ్యాత్మికపరమైన లోతు ఉన్న వైఖరి ఎంతో సుందరంగా, మనోహరంగా ఉంటుంది. వారు అందరినీ ఆనందంగా ఉంచగలుగుతారు. ఎప్పుడైతే చిత్తం అంతర్గతంగా వెళ్ళడం ప్రారంభిస్తుందో... అప్పుడు బ్రహ్మనాడి విస్తరించడం ప్రారంభమవుతుంది. ఆధ్యాత్మికంగా లోతులకు వెళ్ళడం ప్రారంభమవుతుంది. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, యోగసాధన చేస్తున్నవారు ఈ స్థితిని సాధించగలరు. కాబట్టి మన సుషుమ్నా నాడిని దృఢంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ స్థితిని సాధించాలంటే భక్తి, శ్రద్ధలే మార్గం.

(శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



గీతాసారం

స్వధర్మంతో సమన్వయం

భగవద్గీతలో అత్యంత ప్రాచుర్యం పొందిన అంశాల్లో స్వధర్మం గురించి అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ ప్రధానమైనది. 'ఏది స్వధర్మం? దాన్ని ఎందుకు ఆచరించాలి? దాని నుంచి దూరం కావడం వల్ల ఏం జరుగుతుంది?' లాంటి విషయాలను శ్రీకృష్ణుడు ఈ సందర్భంలో స్పష్టంగా తెలియజేశాడు. యుద్ధం చేయడానికి కురుక్షేత్రంలోకి అడుగుపెట్టిన అర్జునుడి ఆలోచనలకు, మాటలకు, చర్యలకు మధ్య పొందన లేకపోవడాన్ని శ్రీకృష్ణుడు గమనించాడు. వాటిని సమన్వయపరుచుకొనే మార్గాన్ని అర్జునుడికి చూపించే ప్రయత్నం చేశాడు. అర్జునుడు తన స్వధర్మం ప్రకారం యుద్ధం చేయడమే... సమన్వయం. యుద్ధాన్ని నివారించాలనుకోవడం దానికి విరుద్ధం. ఇటువంటి అయాచితమైన యుద్ధం స్వర్గానికి ద్వారాలు తెరుస్తుందని, దాని నుంచి పారిపోవడం వల్ల స్వధర్మం, కీర్తి నశిస్తాయని, పాపం కలుగుతుందనీ శ్రీకృష్ణుడు చెప్పాడు. యుద్ధ క్షేత్రంలో అర్జునుడికి ఆయన ఇచ్చిన ఈ సలహాలు నిర్దిష్టమైన సందర్భాలకే పరిమితమని అర్థం చేసుకోవాలి. నిజానికి ఇక్కడ శ్రీకృష్ణుడు మాట్లాడుతున్నది... స్వధర్మంతో సామరస్యం, సమన్వయం గురించే తప్పయుద్ధం గురించి కాదు.

సామరస్యం అంటే...



సృష్టిలోని చిన్న ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్ల నుంచి పెద్ద పెద్ద నక్షత్ర మండలాలు, గ్రహాల వరకూ అన్నీ సామరస్యంతోనే ఉంటాయి. అందుకే సామరస్యతే ఈ సృష్టిని పరిపాలిస్తుంది. ఒక రేడియో స్టేషన్‌తో రేడియోకు సామరస్యత (ట్యూనింగ్) ఉన్నప్పుడు మనం అందులో వచ్చే సంగీతాన్ని ఆస్వాదించగలుగుతాం. సామరస్యానికి మానవ దేహాన్ని మించిన ఉదాహరణ లేదు. ఇందులో అనేక అవయవాలు, రసాయనాలు సమన్వయంతో పని చేసి మనకు జీవితాన్ని ఇస్తాయి. ఇక్కడ సామరస్యం అంటే యథాతథంగా ఉండే వస్తువులు, పరిస్థితులు, అంతే తప్ప మనం కోరుకొనే విధంగా అభిప్రాయాలు, ఆశించే విలువల ప్రకారం ఉండేవి కావు. మనం చేసిన మంచి పనులు మనం మరణించేక స్వర్గానికి, చెడ్డపనులు నరకానికి తీసుకువెళ్తాయని బాల్యం నుంచీ మనకు బోధిస్తూ ఉంటారు. స్వర్గం, నరకం అనేవి మరణం తరువాత చేరుకొనే ప్రదేశాలు కావనీ, ఒకరి సామర్థ్యాన్నిబట్టి, అవకాశాలు దొరకడాన్ని బట్టి అవి ఇక్కడే, ఇప్పుడే ఉంటాయని శ్రీకృష్ణుడు సూచిస్తున్నాడు. ఇతరుల స్వధర్మాన్ని మనం అర్థం చేసుకున్నప్పుడు... కుటుంబాలలో, పని చేసే ప్రదేశాలలో అనుబంధాల మధ్య సామరస్యత నెలకొంటుంది. అది స్వర్గంతో సమానం. అలా లేకపోతే నరకం. మన కోరికలు తీరడం లేక తీరకపోవడాన్ని బట్టి మనం సుఖాన్నో లేదా దుఃఖాన్నో అనుభూతి చెందుతాం. స్వధర్మంతో అంతర్గత సామరస్యత సాధించినట్టయితే... బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా జీవితం స్వర్గతుల్యంగా ఉంటుంది.


కె.శివప్రసాద్

సద్బోధ

సారిపుత్రుని గురుభక్తి

గౌతమ బుద్ధుని శిష్యుల్లో సారిపుత్రుడు ముఖ్యుడు. అతను బుద్ధుడి సూచనలకు అనుగుణంగా జీవిస్తూ, సాధన చేస్తూ జ్ఞానోదయాన్ని పొందాడు. అది జరిగిన కొంతకాలానికి సారిపుత్రునితో బుద్ధుడు "సారిపుత్రా! ఇక నీవు ఇక్కడే ఉండాల్సిన అవసరం లేదు. వెళ్ళు, గ్రామగ్రామానికి తిరుగు. ధర్మాన్ని బోధించు. ఇక్కడ నీకు బదులు మరొకరికి స్థానం కల్పించు" అని చెప్పాడు.

ఆ మాటలు వినగానే సారిపుత్రుని కళ్ళలో నీళ్ళు ఉప్పొంగాయి. బుద్ధుని పాదాలను పట్టుకొని "అలా అనకండి, నన్ను మీకు దూరంగా పంపకండి. మీతోనే ఉండనివ్వండి. నేను ఇంకా తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది. మీలా నేను పూర్ణ జ్ఞానిని కాలేదు" అని విలపించాడు.


అప్పుడు బుద్ధుడు ..నన్ను నీవు మోసగించలేవు సారిపుత్రా! ఇటువంటివి నా దగ్గర చెల్లవు. నీవు పొందవలసినదంతా పొందావు. నీకు జ్ఞానోదయం అయింది. అయినా ఇలా దుఃఖించడం సిగ్గుచేటు. నీవు విలపించినా, గుండెలు బాదుకున్నా ప్రయోజనం లేదు. నీవు వెళ్ళవలసిందే. ఇతరులను ఉద్ధరించవలసిందే. ఇలా నన్నే అంటిపెట్టుకొని ఎంతకాలం ఉండదలిచావు? అది కుదరదు. వెంటనే బయలుదేరు" అన్నాడు.

ఇక తప్పదని తెలిసిన సారిపుత్రుడి హృదయం బరువెక్కింది. బుద్ధుడికి నమస్కరించాడు. కళ్ళు ఆర్పకుండా, తనివితీరా బుద్ధుని రూపాన్ని సందర్శించాడు. ఆయన ఆశీస్సులను తీసుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత సారిపుత్రుడు తను ఎక్కడ ఉన్నప్పటికీ... ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బుద్ధుడు ఉండే దిశకు తిరిగి, తల వంచి నమస్కరించేవాడు. కృతజ్ఞతాపూర్వకంగా కన్నీరు కార్చేవాడు. ఇది చూసిన అతని శిష్యులు ..గురువుగారూ! మీరు కూడా జ్ఞాని అయ్యారు కదా! దాన్ని సాక్షాత్తూ గౌతమ బుద్ధుడే ధ్రువీకరించారు కదా! అయినా మీరు ఆయనకు నమస్కరించాలా?" అని ప్రశ్నించారు.

"నేను ఈ రోజు ఇలా ఉండడానికి కారణం ఆ దయామయుడి అనంతమైన ప్రేమే. నా శరీరంలోని ప్రతి అణువు ఆయనపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. ఆయన కాశీలో ఉన్నా, గయలో ఉన్నా... నా శరీరం తనకుతానుగా, దానంతట అదే బుద్ధుడు ఉన్న దిశకు తిరుగుతుంది. ఉదయం, సాయంత్రం ఆయనకు నమస్కరిస్తుంది" అని చెప్పాడు.

ఒక వ్యక్తితో పని ఉన్నంతకాలం నమస్కారాలు పెట్టి... ఆ పని అయిపోగానే అతణ్ణి మరచిపోవడం సామాన్యుల లక్షణం.




సహాయం చేసినవారి పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండడం సజ్జనుల లక్షణం. జ్ఞానామృతాన్ని పంచిన గురువు పట్ల ఎలా స్పందించాలి? 'గురుర్బ్రహ్మ...' అంటూ శ్లోకాలు చెబితే సరిపోదు... సారిపుత్రునిలా కజ్ఞతజ్ఞతా భావంతో మనసా వాచా, కర్మణా జీవితాన్ని గురువుకే అంకితం చేయాలి.

• రాచమడుగు శ్రీనివాసులు

సుభాషితం

అది అసాధ్యం



తెలియని మనుజుని
దెలుపందగు సుఖతరముగ, తెలుపగ వచ్చుం
దెలిసినవానిం దెలిసియు
తెలియని నరుల దెల్ప బ్రహ్మదేవుని వశమే

భర్తృహరి నీతిశతకంలోని 'అజ్ఞస్సుఖ మారాధ్య స్సుఖతర...' అనే ఈ శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి పద్య రూపంలో ఈ విధంగా అందించారు.

భావం: ఏదీ తెలియని వారికి, జ్ఞానం ఏమాత్రం లేనివారికి ఏ విషయాన్నైనా సులభంగా వివరించవచ్చు. అలాగే తెలివి, జ్ఞానం ఉన్నవారికి కూడా ఆ విషయాన్ని ఇంకా సులువుగా తెలియజేయవచ్చు. కానీ కొంత తెలిసి, మరికొంత తెలియని వారికి... తెలిసింది తక్కువే అయినా అన్నీ తెలుసునని అనుకొనేవారికి బోధించడం బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదు.



దీర్ఘకాలిక వ్యూహంతో గట్టెక్కుతాం

సుంకాల కల్లోలంపై నిర్మల

ముంబై: ట్రంప్ ప్రతీకార సుంకాలతో తలెత్తిన అంతర్జాతీయ వాణిజ్య పరిణామాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పరిణామాలపై భారత్ కుంగిపోవడం లేదన్నారు. విధానపరమైన సత్వర నిర్ణయాలు, దీర్ఘకాలిక ముందు చూపుతో ఈ అడ్డంకులను భారత్ అధిగమిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బలమైన ఆర్థిక పునాదులు ఈ విషయంలో మన దేశానికి కలిసి వస్తాయన్నారు. బీఎస్ఈ 150వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధంతో స్వీయ వాణిజ్య రక్షణ విధానాలు పెరిగిపోతాయన్నారు. దీంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడమే గాక అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలకూ ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దీంతో పెట్టుబడుల విషయంలోనూ అనిశ్చితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుదేలైనా, మన మార్కెట్ మాత్రం వేగంగా కుదుట పడిందన్నారు. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న మన ఆర్థిక వ్యవస్థ ఈ దశాబ్దం చివరికల్లా ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనున్నదన్నారు.

జర్మనీ, జపాన్‌లనీ దాటేస్తాం

వచ్చే మూడేళ్లలోనే భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణియం అన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 4.3 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.367 లక్షల కోట్లు) ఉన్న భారత జీడీపీ వచ్చే ఏడాది చివరికల్లా జర్మనీ జీడీపీని, ఆ పై సంవత్సరం జపాన్ జీడీపీని అధిగమించనుందన్నారు.

ఐటీసీ గూటికి 24 మంత్ర ఆర్గానిక్

ఒప్పందం విలువ రూ.472 కోట్లు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన ఆర్గానిక్ ఆహారోత్పత్తుల బ్రాండ్ '24 మంత్ర ఆర్గానిక్' యాజమాన్య సంస్థ శ్రేష్ఠ నేచురల్ బయోప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 శాతం వాటాను రూ.472.50 కోట్లకు కొనుగోలు చేసినట్లు దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ గ్రూప్ గురువారం ప్రకటించింది. ఈ డీల్‌లో భాగంగా తొలుత రూ.400 కోట్లు, కంపెనీ పనితీరు మైలురాళ్లను చేరుకోవడం ఆధారంగా వచ్చే రెండేళ్లలో రూ.72.5 కోట్లు చెల్లించనున్నట్లు తెలిపింది. దేశంలోని ప్రముఖ ఆర్గానిక్ ప్యాకేజ్డ్ ఆహారోత్పత్తుల బ్రాండ్లలో 24 మంత్ర ఆర్గానిక్ ఒకటి. పప్పులు, మసాలాలు, వంటనూనెలు సహా 100కు పైగా ఉత్పత్తులను విక్రయిస్తోందీ సంస్థ. అమెరికా సహా ఇతర దేశాలకూ వ్యాపారాన్ని విస్తరించింది.

వాటాదారుల ప్రయోజనాలే ముఖ్యం

ఎన్ఎస్ఈ ఐపీఓపై సెబీ చీఫ్ పాండే



ముంబై: ఎన్ఎస్ఈ ఐపీఓకు అనుమతిలో తమకు వాణిజ్య ప్రయోజనాల కంటే, వాటాదారుల ప్రయోజనాలే ముఖ్యమని సెబీ స్పష్టం చేసింది. ఈ విషయంలో వాటాదారుల ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు. కార్పొరేట్ గవర్నెన్స్‌పై సీఐఐ నిర్వహించిన ఒక సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో ఈ విషయం స్పష్టం చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజీల మధ్య తలెత్తే వివాదాల పరిష్కార బాధ్యత కూడా తమదేనన్నారు. ఎన్ఎస్ఈ ఐపీఓకు ఎప్పటిలోగా అనుమతి ఇస్తారన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానం చెప్పలేదు. అయితే త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని సెబీ చీఫ్ చెప్పారు. మేనేజ్‌మెంట్ ఉద్యోగులకు నష్టపరిహారం, క్లియరింగ్ కార్పొరేషన్ ఈక్విటీలో మెజారిటీవాటా ఉండడం ఎన్ఎస్ఈ ఐపీఓకు ప్రతిబంధకంగా మారాయి. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరించుకుని రావాలని సెబీ ఇప్పటికే ఎన్ఎస్ఈ మేనేజ్‌మెంట్‌ను కోరింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	130	విజయవాడ	125
వరంగల్	130	గుంటూరు	125
కరీంనగర్	130	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	97
కర్నూలు	130	నెల్లూరు	102
విశాఖపట్నం	114	అనంతపురం	102
గోదావరి	125		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	410
చిత్తూరు	460	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,310 ▲	89,200 ▲	1,10,000 ▲
విజయవాడ	98,500 ▲	91,000 ▼	98,500 ▲
విశాఖపట్నం	97,630 ▲	89,200 ▲	1,10,100 ▲
రాజమండ్రి	97,310 ▲	88,200 ▲	99,700 ▲
ప్రొద్దుటూరు	94,600 ▲	87,030 ▲	98,300 ▼
ముంబై	94,910 ▲	86,940 ▲	95,150 ▼



మెప్పించని ఇన్ఫీ

- క్యూ4 లాభంలో 12% క్షీణత .. ● రూ.7,033 కోట్లకు పరిమితం
- 2025-26లో 0-3% ఆదాయ వృద్ధి అంచనా ● ఒక్కో షేరుకు రూ.22 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ గురువారం ప్రకటించిన ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయాయి. మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికంలో ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం రూ.7,033 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.7,969 కోట్ల లాభంతో పోలిస్తే 11.7 శాతం తగ్గింది. క్యూ4లో కంపెనీ ఆదాయం మాత్రం 7.9 శాతం పెరిగి రూ.40,925 కోట్లకు చేరింది. గత ఏడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే లాభం 3.3 శాతం పెరగగా.. ఆదాయం 2 శాతం తగ్గింది. కాగా, సమీక్షా కాలానికి సంస్థ నిర్వహణ లాభాల మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 0.9 శాతం పెరగగా.. త్రైమాసిక ప్రాతిపదికన 0.3 శాతం తగ్గింది.

2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి లాభం 1.8% వృద్ధితో రూ.26,713 కోట్లుగా, ఆదాయం 6.06% పెరుగుదలతో రూ.1,62,990 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారిత) 0-3 శాతం శ్రేణిలో వృద్ధి చెందవచ్చని ఇన్ఫోసిస్ అంచనా వేసింది. నిర్వహణ మార్జిన్ 20-22 శాతం నమోదుకావచ్చని కంపెనీ భావిస్తోంది. కాగా, గడిచిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆదాయ వృద్ధిని 4.5-5 శాతంగా అంచనా వేసింది.

- క్యూ4లో కంపెనీకి ఆర్థిక సేవల రంగం నుంచి ఆదాయం 12.6 శాతం పెరగగా.. తయారీ రంగం నుంచి రెవెన్యూ 14 శాతం వృద్ధి చెందింది. ప్రాంతాల వారీగా చూస్తే, భారత మార్కెట్ నుంచి రాబడి 43.7 శాతం పుంజుకోగా.. యూరప్ రెవెన్యూ 15 శాతం పెరిగింది. కంపెనీకి కీలక మార్కెట్ అయిన ఉత్తర అమెరికా నుంచి ఆదాయం 0.4 శాతం తగ్గింది.
- గడిచిన క్వార్టర్‌లో 260 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను కుదుర్చుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దాంతో 2024-25 మొత్తానికి బడా ఆర్డర్ల విలువ 1,160 కోట్ల డాలర్లకు చేరుకుందని, అందులో 56 శాతం కొత్తవేనని తెలిపింది.
- గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నగదు ప్రవాహం 410 కోట్ల డాలర్లకు పెరిగింది. కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికమని ఇన్ఫీ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు.
- బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు గురువారం 0.51 శాతం పెరిగి రూ.1,420.20 వద్ద ముగిసింది.

2 కంపెనీల కొనుగోలు: తాజాగా రెండు కంపెనీలను చేజిక్కించుకున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఆస్ట్రేలియాకు చెందిన సైబర్ సెక్యూరిటీ సేవల సంస్థ 'ది మిస్సింగ్ లింక్'ను 9.8 కోట్ల ఆస్ట్రేలియన్ డాలర్లకు (సుమారు రూ.532 కోట్లు) కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కాగా, అమెరికాలోని హ్యూస్టన్, టెక్సాస్ కేంద్రాలుగా కార్యకలాపాలు సాగిస్తున్న టెక్నాలజీ అండ్ బిజినెస్ కన్సల్టింగ్ కంపెనీ ఎంఆర్ఈ కన్సల్టింగ్‌ను సైతం 3.6 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.307.4 కోట్లు) కొనుగోలు చేసేందుకు డీల్ కుదుర్చుకున్నట్లు ఇన్ఫీ వెల్లడించింది. ఈ జూన్ కల్లా పూర్తికానున్న ఈ రెండు డీల్స్ పూర్తిగా నగదు రూపంలో జరగనున్నాయి.

పరేఖ్‌కు రూ.50 కోట్ల షేర్ల కేటాయింపు: గడిచిన ఆర్థిక సంవత్సరంలో తమ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్‌కు ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్ ప్లాన్స్ (ఈఎస్ఓపీ) కింద రూ.50 కోట్ల షేర్లను కేటాయించడం జరిగిందని ఇన్ఫోసిస్ వెల్లడించింది.

మూర్తి మనవడికి రూ.3.3 కోట్ల బొనాంజా

గత ఆర్థిక సంవత్సరానికిగాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.22 తుది డివిడెండ్ చెల్లించాలని ఇన్ఫోసిస్ బోర్డు ప్రతిపాదించింది. తుది డివిడెండ్‌తో కలిపి గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ చెల్లించే డివిడెండ్ 2023-24 చెల్లింపుల కంటే 13.2 శాతం అధికం. తుది డివిడెండ్ చెల్లింపుల ద్వారా కంపెనీ సహ-వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి 17 నెలల మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తికి రూ.3.3 కోట్లు లభించనున్నాయి. ఇన్ఫోసిస్‌లో 0.04 శాతం వాటాకు సమానమైన 15 లక్షల షేర్లు ఏకాగ్రహ్ పేరిట ఉన్నాయి. నారాయణ మూర్తి తన మనవడికి 2024 మార్చిలో ఈ షేర్లను బహుమతిగా ఇచ్చారు. ఆ సమయంలో వాటి విలువ రూ.240 కోట్లు. కాగా, ఇన్ఫోసిస్‌లో 1.04 శాతం వాటాకు సమానమైన 3.89 కోట్ల షేర్లను కలిగిన మూర్తి కూతురు, బ్రిటన్ మాజీ ప్రధాని రిషీ సునాక్ భార్య అక్షతా మూర్తికి డివిడెండ్ రూపంలో రూ.85.71 కోట్లు లభించనున్నాయి.

ఈ సారి 20,000 మంది ఫ్రెషర్ల హైరింగ్

క్యూ4లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య మరో 199 మేర పెరిగి, ఈ మార్చి 31 నాటికి 3,23,578కి చేరింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఉద్యోగుల సంఖ్య 6,000 పెరిగింది. కాగా, గత త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల రేటు 14.1 శాతానికి పెరిగింది. క్యూ3లో ఇది 13.7 శాతంగా నమోదైంది. 2024-25లో ప్రాంగణ నియామకాల ద్వారా 15,000 మంది ఫ్రెషర్లను చేర్చుకున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు. గతంలోనే ప్రకటించిన విధంగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది ఫ్రెషర్ల నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

4 రోజుల ర్యాలీ-4700 పాయింట్ల లాభం



ముంబై: ట్రంప్ సుంకాల పోటుకు కుదేలైన ఈక్విటీ మార్కెట్ తదనంతరం ఏర్పడిన ఆశావహ సంకేతాలతో అంతకు మించిన ర్యాలీలో దూసుకుపోయింది. సుంకాలకు ట్రంప్ ప్రకటించిన 90 రోజుల విరామం, భారత-అమెరికా వాణిజ్య చర్చలు ఫలవంతం కావచ్చునన్న ఆశలు మార్కెట్లో జవసత్వాలు నింపాయి. దీనికి తోడు విదేశీ ఇన్వెస్టర్లు కూడా భారత ఈక్విటీలపై మరోసారి దృష్టి సారించారు. ఫలితంగా వరుసగా నాలుగో రోజు కూడా కొనసాగిన ర్యాలీలో సెన్సెక్స్ 1508.91 పాయింట్లు దూసుకుపోయి 78,553.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 414.45 పాయింట్ల మేరకు లాభపడి 23,851.65 వద్ద ముగిసింది. నాలుగు రోజుల ర్యాలీలో సెన్సెక్స్ 4706.05 పాయింట్లు, నిఫ్టీ 1452.50 పాయింట్లు లాభపడ్డాయి.

- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.56 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.52 శాతం లాభపడ్డాయి.
- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గురువారం రూ.4667.94 కోట్ల విలువ గల షేర్లు కొనుగోలు చేశారు.
- ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.70 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.98,170 వద్ద ముగిసింది.
- అమెరికన్ డాలర్ మారకంలో 26 పైసలు పెరిగి 85.38 వద్ద ముగిసింది.

శుక్రవారం సెలవు: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మార్కెట్లకు సెలవు. తిరిగి సోమవారం మార్కెట్ ఉంటుంది.

పేటెంట్లలో టాటా మోటార్స్ రికార్డు

ముంబై: ఇటీవల ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో 250 పేటెంట్లు, 148 డిజైన్ అప్లికేషన్లు, 81 కాపీరైట్ అప్లికేషన్లు దాఖలు చేసినట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఒక ఆర్థిక సంవత్సరంలో పేటెంట్లు, అప్లికేషన్ల దాఖలులో ఇది కొత్త రికార్డు అని పేర్కొంది. అలాగే ఈ ఏడాదిలో తమకు 68 పేటెంట్లు మంజూరు కావడంతో తాము పొందిన మొత్తం పేటెంట్ల సంఖ్య 918కి చేరిందని తెలిపింది.

స్టీమ్ కోల్ దిగుమతిలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులోని జనరల్ కార్గో బెర్త్ స్టీమ్ కోల్ దిగుమతిలో కొత్త రికార్డులు నమోదుచేసింది. ఎంవీ గినా ఓల్డెన్ డ్రాఫ్ నౌక ఈ నెల 14వ తేదీన 1,64,960 టన్నుల స్టీమ్ కోల్‌తో రాగా మొదటి 24 గంటల్లో 1,06,190 టన్నులు దిగుమతి చేశారు. ఏప్రిల్‌లో ఈ బెర్త్ రోజుకు సగటున 74,001 టన్నుల నిర్వహణను నమోదు చేసిందని పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. ఈ స్టీమ్ కోల్‌ను జేఎస్‌డబ్ల్యు అండ్ భూషణ్ స్టీల్స్ దిగుమతి చేసుకున్నాయి.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక: బెంగళూరు
బెంగళూరు x పంజాబ్ — రా.7.30 నుంచి

'కాంటినెంటల్' కింగ్.. నీరజ్



న్యూఢిల్లీ: డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా తాజా సీజన్‌ను విజయంతో ఆరంభించాడు. దక్షిణాఫ్రికాలో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ చాలెంజర్ జావెలిన్ త్రోలో నీరజ్ 84.52 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. 82.44 మీటర్ల దూరంతో డౌ స్మిత్ (దక్షిణాఫ్రికా) రెండోస్థానం దక్కించుకొన్నాడు. వచ్చే నెల 16న దోహాలో జరిగే డైమండ్ లీగ్ కోసం చోప్రా సన్నాహకాల్లో ఉన్నాడు. ఈసారి 90 మీటర్ల మార్క్ చేరుకోవడం పైనే అతడు ఎక్కువగా దృష్టిపెట్టినట్టు సమాచారం.

టీమిండియా అసిస్టెంట్ కోచ్ నాయర్‌పై వేటు!



అభిషేక్ నాయర్

- దిలీప్, సోహమ్ పొడిగింపు లేదు
- కోచింగ్ సిబ్బందిని కుదించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు సహాయక సిబ్బంది విషయంలో బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకొంది. ఇంగ్లండ్ పర్యటనకు ముందే కోచింగ్ స్టాఫ్‌ను కుదించింది. ఈ క్రమంలో గతేడాది జూలైలో నియమించిన అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌పై వేటు వేసింది. వాస్తవంగా స్వదేశంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టూర్‌లో టెస్ట్ సిరీస్‌ల్లో జట్టు వైఫల్యంపై బోర్డు సమీక్ష చేసింది. ముఖ్యంగా రోహిత్, కోహ్లీ లాంటి స్టార్ బ్యాటర్లు వరుసగా విఫలమవుతున్నా కోచ్‌లు ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీలు కూడా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో నాయర్‌పై వేటు వేస్తారనే ప్రచారం భారీగానే జరిగింది. జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కొటక్, బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే.

దిలీప్ కూడా అవుట్!: ఫీల్డింగ్ కోచ్ దిలీప్, స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్ కాంట్రాక్ట్‌లను పునరుద్ధరించకూడదనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. జూలైతో వీరిద్దరి మూడేళ్ల కాంట్రాక్ట్ ముగియనుంది. దిలీప్ స్థానంలో అసిస్టెంట్ కోచ్‌గా ఉన్న టెన్ డస్కటే ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలు నిర్వహిస్తాడని సమాచారం. ఇక, స్ట్రెంగ్త్ అండ్ కండీషనింగ్ కోచ్‌గా సౌతాఫ్రికాకు చెందిన అడ్రియన్ లీ రౌక్స్ మరోసారి భారత జట్టుకు సేవలందించనున్నట్టు సమాచారం.

ధోనీ.. నన్ను 'షరపోవా' అనేవాడు



ముంబై: ధోనీ తనను షరపోవా అనేవాడని ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ మోహిత్ శర్మ గుర్తు చేసుకొన్నాడు. గతంలో మోహిత్ చెన్నైకి ఆడాడు. బంతి రిలీజ్ చేసే సమయంలో టెన్నిస్ ప్లేయర్ తరహాలో గట్టిగా హూంకరించడం అతడికి అలవాటు. 'నేను బౌలింగ్ చేస్తున్నప్పుడు గట్టిగా అరిచేవాడిని. దీంతో ధోనీ నన్ను షరపోవా అంటూ ఆట పట్టించేవాడు. అలా చేస్తే నేనేదో గొప్ప వేగంతో బంతులేస్తున్నానని బ్యాటర్లు భ్రమపడే అవకాశం ఉంది. ఇది ఒకరకంగా నాకు లాభమే' అని మోహిత్ చెప్పాడు. రెండో ఇన్నింగ్స్‌లో బంతి తడిస్తే మార్చడం.. బౌలర్లకు ప్రయోజనమేనని మోహిత్ అన్నాడు.



హ్యారిట్ డార్ట్

'దుర్వాసన వస్తోంది.. స్ప్రే చేసుకోమనండి'

బ్రిటన్ టెన్నిస్ క్రీడాకారిణి తీరుపై విమర్శలు

పారిస్: ఫ్రాన్స్ క్రీడాకారిణి లిస్ బాసన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అభాసుపాలైంది బ్రిటన్ టెన్నిస్ ప్లేయర్ హ్యారిట్ డార్ట్. విషయమేమిటంటే..రోయన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో బాసన్‌తో డార్ట్ తలపడింది. అయితే బాసన్ నుంచి దుర్వాసన వస్తోందని, డియోడరెంట్ స్ప్రే చేసుకోవాలని ఆమెకు చెప్పాలంటూ అంపైర్‌కు డార్ట్ సూచించింది. ఇది కోర్టు పక్కన ఉన్న మైక్రోఫోన్ల ద్వారా బయటకు వినిపించింది. దాంతో డార్ట్ వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడ్డారు. వెల్లువలా విమర్శలు వచ్చి పడడంతో తప్పును గ్రహించిన హ్యారిట్.. బాసన్‌ను క్షమాపణలు కోరింది.

ఓటమి నెం.5

మళ్లీ నిరాశపర్చిన సన్‌రైజర్స్

ముంబై విజయం | విల్ జాక్స్ ఆల్‌రౌండ్ షో



విల్ జాక్స్ (2/14, 36 పరుగులు)

ముంబై: తాజా సీజన్‌లో పడుతూ.. లేస్తూ సాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఖాతాలో ఐదో ఓటమి చేరింది. తమ చివరి మ్యాచ్‌లో పంజాబ్‌పై 246 పరుగులను ఛేదించి ఆహో.. అనిపించిన రైజర్స్ వాంఖడేలో మాత్రం చెమటోడ్చింది. అటు బ్యాట్‌తోనూ ప్రభావం చూపలేక ఇటు బంతితోనూ రాణించలేక తమ ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇక సొంతగడ్డపై చెలరేగిన ముంబై ఇండియన్స్ 4 వికెట్ల తేడాతో అలవోకగా నెగ్గింది. ఇది వారికి వరుసగా రెండో విజయం. సన్‌రైజర్స్ మాత్రం ఇతర వేదికలపై ఆడిన మూడింట్లోనూ ఓడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 162 పరుగులు చేసింది. అభిషేక్ (28 బంతుల్లో 7 ఫోర్లతో 40), క్లాసెన్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) రాణించగా, చివర్లో అనికేత్ (8 బంతుల్లో 2 సిక్సర్లతో 18 నాటౌట్) వేగం కనబర్చాడు. విల్ జాక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.1 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసి నెగ్గింది. జాక్స్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 36), రికెల్టన్ (23 బంతుల్లో 5 ఫోర్లతో 31), సూర్యకుమార్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 26), రోహిత్ (16 బంతుల్లో 3 సిక్సర్లతో 26) వేగంగా ఆడారు. కమిన్స్‌కు మూడు, ఎషాన్ మలింగకు రెండు వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జాక్స్ నిలిచాడు.

సమష్టి రాణింపుతో..: ముంబై ఇన్నింగ్స్ ఛేదనలో బరిలోకి దిగిన ప్రతీ బ్యాటర్ తమ వంతు ప్రయత్నంతో ఆకట్టుకున్నాడు. ఆరంభంలో ఓపెనర్ రోహిత్ మూడు సిక్సర్లతో జోష్‌లో కనిపించినా.. నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆరో ఓవర్‌లో రికెల్టన్ హ్యాట్రిక్ సిక్సర్లు బాదగా పవర్‌ప్లేలో ముంబై 55/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. అయితే హర్షల్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు బాది రికెల్టన్ అవుటవడంతో రెండో వికెట్‌కు జాక్స్‌తో కలిసి 37 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం జాక్స్-సూర్యకుమార్ జోడీ రైజర్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. చెత్త బంతులను బౌండరీలుగా మలుస్తూ ఒత్తిడి తగ్గించారు. అలాగే 11వ ఓవర్‌లో చెరో సిక్సర్‌తో జట్టు స్కోరు వంద దాటింది. అయితే మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేరాక కమిన్స్ వరుస ఓవర్లలో ఈ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చాడు. కానీ హార్దిక్ (9 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 21)-తిలక్ (17 బంతుల్లో 2 ఫోర్లతో 21 నాటౌట్)ల ఎదురుదాడితో రైజర్స్ చేసేదేమీ లేకపోయింది. 17వ ఓవర్‌లో హార్దిక్ 6,4తో సమీకరణం 18 బంతుల్లో 2 రన్స్‌కు మారింది. అయితే మలింగ తర్వాతి ఓవర్‌లో ఒకే రన్ ఇచ్చి హార్దిక్, నమన్ (0)ల వికెట్లను తీశాడు. చివరకు 19వ ఓవర్ తొలి బంతిని ఫోర్‌గా మలిచిన తిలక్ ముంబైని సంబరాల్లో ముంచాడు.

కట్టడి చేశారు: టాస్ ఓడిన సన్‌రైజర్స్ మొదట బ్యాటింగ్‌కు దిగడంతో భారీ స్కోరు ఖాయమేనా? అనిపించింది. కానీ పిచ్ నుంచి సహకారం లేకపోవడంతో వారి ఇన్నింగ్స్ ఆద్యంతం నత్తనడకన సాగింది. ముంబై బౌలర్లు పకడ్బందీగా బౌలింగ్ చేయడంతో భారీ షాట్లకు వీల్లేకుండా పోయింది. అయితే చివరి మూడు ఓవర్లలో 47 పరుగులు చేయడంతో జట్టు పోరాడే స్కోరందుకుంది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్లు అభిషేక్, హెడ్ అవుట్ కావాల్సి ఉన్నా ఫీల్డర్లు క్యాచ్ పట్టలేకపోవడంతో బతికిపోయారు. ఐదో ఓవర్‌లో అభిషేక్ హ్యాట్రిక్ ఫోర్ల కారణంగా పవర్‌ప్లేలో జట్టు 43 పరుగులతో నిలిచింది. అయితే ఉన్న కాసేపు కాస్త వేగం చూపిన అభిషేక్ 8వ ఓవర్‌లో హార్దిక్‌కు చిక్కడంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే ఇషాన్ కిషన్ (2) స్టంపవుట్ కావడంతో పాటు బంతికో పరుగు చొప్పున ఆడిన హెడ్ (28) వెనుదిరగడంతో రైజర్స్ ఇన్నింగ్స్ నెమ్మదించింది. మధ్య ఓవర్లలో ముంబైదే పూర్తి హవా సాగింది. క్లాసెన్ కూడా ఆదిలో ఇబ్బందిపడ్డాడు. అయితే నాలుగో వికెట్‌కు నితీశ్ (19)తో 31 పరుగులు జోడించాక క్లాసెన్ 18వ ఓవర్‌లో బ్యాట్ ఝుళిపించాడు. చాహర్ వేసిన ఈ ఓవర్‌లో వరుసగా 6,4,4,6తో 21 పరుగులు రాబట్టాడు. అయితే 19వ ఓవర్‌లో తొలి బంతికే క్లాసెన్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా ఈ ఓవర్‌లో నాలుగు పరుగులే ఇచ్చాడు. కానీ ఆఖరి ఓవర్‌లో అనికేత్ 6,6, కమిన్స్ 6తో మరో 22 పరుగులు రాబట్టిన రైజర్స్ తమ స్కోరును 160 దాటించగలిగింది.

2 ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లోనే (575) వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా హెడ్. రస్సెల్ (545) ముందున్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
ఢిల్లీ	6	5	1	0	10	0.744
గుజరాత్	6	4	2	0	8	1.081
బెంగళూరు	6	4	2	0	8	0.672
పంజాబ్	6	4	2	0	8	0.172
లఖ్‌నవూ	7	4	3	0	8	0.086
కోల్‌కతా	7	3	4	0	6	0.547
ముంబై	7	3	4	0	6	0.239
రాజస్థాన్	7	2	5	0	4	-0.714
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	7	2	5	0	4	-1.276

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి/సబ్) బవ (బి) హార్దిక్ 40, హెడ్ (సి) శాంట్నర్ (బి) జాక్స్ 28, ఇషాన్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) జాక్స్ 2, నితీశ్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 19, క్లాసెన్ (బి) బుమ్రా 37, అనికేత్ (నాటౌట్) 18, కమిన్స్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 162/5; వికెట్ల పతనం:** 1-59, 2-68, 3-82, 4-113, 5-136; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-47-0, బౌల్ట్ 4-0-29-1, బుమ్రా 4-0-21-1, విల్ జాక్స్ 3-0-14-2, హార్దిక్ 4-0-42-1, శాంట్నర్ 1-0-8-0.

ముంబై: రికెల్టన్ (సి) హెడ్ (బి) హర్షల్ 31, రోహిత్ (సి) హెడ్ (బి) కమిన్స్ 26, విల్ జాక్స్ (సి) జీషన్ (బి) కమిన్స్ 36, సూర్యకుమార్ (సి) జీషన్ (బి) కమిన్స్ 26, తిలక్ (నాటౌట్) 21, హార్దిక్ (సి) ఇషాన్ (బి) మలింగ 21, నమన్ (ఎల్బీ) మలింగ 0, శాంట్నర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 18.1 ఓవర్లలో 166/6; వికెట్ల పతనం:** 1-32, 2-69, 3-121, 4-128, 5-162, 6-162; **బౌలింగ్:** షమి 3-0-28-0, కమిన్స్ 4-0-26-3, మలింగ 4-0-36-2, జీషన్ 3.1-0-35-0, హర్షల్ 3-0-31-1, రాహుల్ చాహర్ 1-0-9-0.

ఢిల్లీ కోచ్ మునాఫ్‌పై జరిమానా



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తను ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. తమ ఆటగాళ్లకు సందేశం ఇచ్చేందుకు రిజర్వ్ ఆటగాడిని అంపైర్ మైదానంలోనికి అనుమతించలేదు. దీంతో మునాఫ్ వాదనకు దిగడం వీడియోలో కనిపించింది. ఈ ప్రవర్తనకు ఫైన్‌తో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా మునాఫ్ ఖాతాలో చేర్చారు.

రెండో స్థానంలో హంపి

పుణె: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నమెంట్ నాలుగో రౌండ్ ఆఖరికి తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి (3 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతోంది. గురువారం జరిగిన నాలుగో గేమ్‌లో రష్యన్ గ్రాండ్‌మాస్టర్ పోలినా షువలోవాపై హంపి విజయం సాధించింది. జీఎం వైశాలీ రమేష్ బాబుతో నాలుగో రౌండ్‌ను మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక డ్రా చేసుకుంది. రెండు పాయింట్లతో హారిక నాలుగో స్థానానికి చేరింది. అలీనాపై గెలిచిన ఝు జినేర్ (చైనా, 3.5) అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

వెన్‌జున్.. ఐదోసారి



షాంఘై: చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ రికార్డుస్థాయిలో ఐదోసారి ఫిడే మహిళల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. 34 ఏళ్ల వెన్‌జున్ 6.5-2.5 తేడాతో చైనాకే చెందిన తాన్ జోంగ్యీని ఓడించి విజేతగా నిలిచింది. చెస్ చరిత్రలో ప్రపంచ చాంపియన్‌షిప్‌ను ఐదుసార్లు నెగ్గిన నాలుగో మహిళగా వెన్‌జున్ రికార్డుకెక్కింది.

సౌరవ్‌కు ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్



కార్లో (ఐర్లాండ్): భారత క్యూయిస్ట్ సౌరవ్ కొఠారి ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టైటిల్ నెగ్గాడు. ఫైనల్లో సౌరవ్ 725-480తో భారత్‌కే చెందిన స్టార్ పంకజ్ అడ్వాణీని ఓడించి విజేతగా నిలిచాడు. 35 ఏళ్ల సౌరవ్‌కు ఇదే తొలి ఐబీఎస్ఎఫ్ వరల్డ్ టైటిల్.

ఆసియా అథ్లెటిక్స్‌లో మరో రెండు కాంస్యాలు

న్యూఢిల్లీ: ఆసియా అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో రెండు కాంస్య పతకాలు లభించాయి. సౌదీ అరేబియాలో గురువారం జరిగిన పోటీల్లో మహిళల డిస్కస్‌త్రోలో లక్షిత, మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో శౌర్య అంబూర్ కాంస్యాలు అందుకున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

సిరాకైంది సింగిల్ బతుకు..



శ్రీవిష్ణు హీరోగా కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా కార్తిక్ రాజు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'సింగిల్'. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'సిరాకైంది సింగిల్ బతుకు..'అనే పాటను మేకర్స్ గురువారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాయగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు.

సీక్వెల్‌కు సిద్ధం



సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాలీవుడ్‌లో సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రానికి సీక్వెల్ రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'బాక్సాఫీసు వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న తర్వాత జాట్ విశ్రాంతి తీసుకోవాలనుకోవడం లేదు. ఈసారి మరో పెద్ద మిషన్‌తో అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో మీ ముందుకు వస్తాడు' అంటూ చిత్రబృందం పోస్టర్ విడుదల చేసింది.

మలయాళ చిత్రం 'పని' ఫేమ్, నటి అభినయ తన చిరకాల మిత్రుడు కార్తీక్ వేగ్నేశ (సన్నీ వర్మ)తో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఈ పెళ్లి వేడుక ఫొటోలను ఆమె సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. మార్చి 9న వీరి నిశ్చితార్థం జరిగింది. ఈనెల 20న సినీ ప్రముఖుల కోసం రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. కాగా, 'శంభో శివ శంభో', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రాలతో తెలుగులో గుర్తింపు తెచ్చుకున్నారు అభినయ.



కలెక్షన్ల సునామీ సృష్టిస్తుంది

-సంపత్ నంది



తమన్నా, హెబ్బా పటేల్, వశిష్ఠ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘనవిజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ చిత్రానికి దర్శకుడు సంపత్‌నంది కథను అందించి దర్శకత్వ పర్యవేక్షణ చేశారు. తాజాగా విడుదలైన ఈ సినిమా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమాకు ఇంతటి ఘనవిజయం అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. రానున్న రోజుల్లో ఈ సినిమా కలెక్షన్ల సునామీని సృష్టిస్తుంది. కుటుంబమంతా కలసి చూడాల్సిన చిత్రమిది" అని అన్నారు. "సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువవ్వడం ఆనందంగా ఉంది" అని చిత్ర నిర్మాత మధు చెప్పారు.

డ్రగ్స్ దాడుల నుంచి తప్పించుకున్న 'దసరా' విలన్



ఓ మలయాళ నటుడు డ్రగ్స్ మత్తులో తనను లైంగికంగా వేధించాడని కథానాయిక విన్సీ సోనీ అలోషియస్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆయన సెట్స్‌లోనే డ్రగ్స్ తీసుకొనేవాడని, దర్శకులకు, నిర్మాతలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పిన ఆమె ఆ నటుడి పేరు మాత్రం వెల్లడించలేదు. విన్సి సోనీ ఆరోపణలు మాలీవుడ్‌లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఆ నటుడు ఎవరై ఉంటారా అని అందరూ చర్చించుకుంటున్న సమయంలో.. తాజాగా ఓ హోటల్‌లో జరిగిన డ్రగ్స్ రైడ్ నుంచి 'దసరా' చిత్రంలో విలన్‌గా నటించిన షైన్ టామ్ చాకో తప్పించుకుని పారిపోయినట్లు వచ్చిన వార్తలు తీవ్ర కలకలం సృష్టించాయి. కొచ్చిలోని ఓ హోటల్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారం రావడంతో నార్కోటిక్ పోలీసుల బృందం రైడ్ చేసింది. ఆ దాడి జరగడానికి కొద్దిసేపటి క్రితం షైన్ టామ్ మూడో అంతస్తు కిటికీ నుంచి రెండో అంతస్తులోకి దూకి అక్కడి నుంచి మెట్ల మార్గం ద్వారా పారిపోయినట్లు తెలుస్తోంది. అతడు ముందస్తు సమాచారంతోనే పారిపోయి ఉంటాడని మాలీవుడ్‌లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో విన్సీ సోనీ ఆరోపించిన ఆ మలయాళ నటుడు షైన్ టామ్ అయ్యుంటాడనే ఊహాగానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అప్‌డేట్స్

అంబేద్కర్‌కు నివాళిగా..



మంధా కృష్ణ చైతన్య స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తూ హీరోగా నటిస్తోన్న చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ 'మరుగున పడుతున్న అంబేద్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయం. మన దేశ రాజ్యాంగ సృష్టికర్త అయిన అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరు గౌరవించాలి' అని అన్నారు. 'కుల, మత, ప్రాంత, వర్గ వైషమ్యాలకు అతీతంగా సమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు గొప్ప నివాళిగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అని కృష్ణచైతన్య అన్నారు.

యాక్షన్ థ్రిల్లర్



జ్యోతి పూర్వజ్, పూర్వజ్ జంటగా నటిస్తోన్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి పూర్వజ్, ప్రజయ్ కామత్, ఏ.పద్మనాభ రెడ్డి నిర్మాతలు. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 30న సినిమా గ్లింప్స్ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

అందరికీ కనెక్ట్ అవుతుంది

-ఉదయ్‌రాజ్



ఉదయ్‌రాజ్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'మధురం'. వైష్ణవి సింగ్ కథానాయిక. రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం.బంగార్రాజు నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు ఉదయ్. "మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చాను. క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించాను. ఇది పాఠశాలలో మొదలయ్యే అందమైన ప్రేమ కథ. సినిమా చూసిన ప్రేక్షకులందరికీ వారి బాల్యాన్ని గుర్తుకుతెస్తుంది. ఇందులోని పాటలు మనసుకు హత్తుకునేలా ఉంటాయి. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది" అని చెప్పారు.

సందేశాత్మక ప్రేమకథను ఆదరించండి

-సుమయ రెడ్డి



సుమయరెడ్డి హీరోయిన్‌గా నటించి, నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. 'దియా' ఫేమ్ పృథ్వీ అంబర్ హీరోగా సాయిరాజేశ్ మహదేవ్ తెరకెక్కించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ సుమయ రెడ్డి మాట్లాడుతూ "తెలుగమ్మాయిలు ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి వస్తున్నారు. తెలుగమ్మాయి అయిన నేను నటించిన ఈ సినిమాను ఆదరించండి. సినిమాలో మంచి ప్రేమకథతో పాటు సందేశం ఉంది" అని అన్నారు. "సినిమా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. కచ్చితంగా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని హీరో పృథ్వీ అంబర్ చెప్పారు.

'నకిలీ' నిగ్గు తేలాలి!



- బోరుగడ్డ కేసులో హైకోర్టు కీలక నిర్ణయం
- బెయిల్ పిటిషన్‌పై విచారణకు నిరాకరణ
- ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌తో డాక్టర్ వాంగ్మూలం నమోదు చేయించాలని పీడీజేకు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు హైకోర్టు నిరాకరించింది. మధ్యంతర బెయిలు పొడిగింపు కోసం తల్లికి అనారోగ్యం పేరిట బోరుగడ్డ నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించినట్లు పోలీసులు.. అది నకిలీ సర్టిఫికెట్ అని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడం లేదని బోరుగడ్డ తరపు న్యాయవాది పేర్కొనడంతో కీలక నిర్ణయం తీసుకుంది. గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు పీవీ రాఘవశర్మ పేరిట సర్టిఫికెట్ సృష్టించిన నేపథ్యంలో.. ఆ వైద్యుడి వాంగ్మూలాన్ని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌తో రికార్డు చేయించి తమకు పంపాలని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి (పీడీజే)ని ఆదేశించింది. అది తమకు అందిన తర్వాతే బోరుగడ్డ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. అనంతపురం పోలీసులు నమోదు చేసిన కేసులో రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డ తన తల్లికి చికిత్స చేయించాలంటూ మధ్యంతర బెయిలు పొందారు. ఆ తర్వాత.. నకిలీ మెడికల్ సర్టిఫికెట్ చూపించి మధ్యంతర బెయిల్ పొడిగించుకున్నారు. అయితే తాను ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వలేదని వైద్యుడు పీవీ రాఘవశర్మ వాంగ్మూలం ఇచ్చారని, బోరుగడ్డపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని పోలీసులు అనుబంధ పిటిషన్ వేశారు. వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ.. గుంటూరు లలిత ఆస్పత్రి, చెన్నై అపోలోలో పోలీసులు సేకరించిన వివరాలను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందుంచారు. బోరుగడ్డ సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్‌లోని రాత, సంతకం తనవి కాదని వైద్యుడు రాఘవశర్మ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. వైద్యుడు మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వలేదని పోలీసులు చెబుతున్నారు తప్ప యాజమాన్యం ఇవ్వలేదని చెప్పడం లేదన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. డాక్టర్ రాఘవశర్మ వాంగ్మూలాన్ని నమోదు చేయించాలని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పీడీజే)కి ఆదేశాలు జారీ చేశారు.

మంగళగిరి ఎయిమ్స్‌కు 534 పోస్టులు


- భర్తీకి కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశం.. ఫలించిన మంత్రి పెమ్మసాని కృషి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి అభివృద్ధి కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేస్తున్న కృషి ఫలిస్తోంది. ఈ క్రమంలో 960 పడకల మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో 534 ప్రధాన ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ఆదేశాలు జారీచేసింది. దీనికి 'ప్రధాన మంత్రి స్వస్థ్య సురక్ష యోజన' కింద ఆయా పోస్టుల మంజూరుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కూడా ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఎయిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన పెమ్మసాని.. ఆస్పత్రి సమస్యలు, రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ నెల 2న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వాటిని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఎయిమ్స్ ఆస్పత్రి సామర్థ్యానికి సరిపడా 534 ఉద్యోగాలను మంజూరు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ పోస్టుల్లో 10 అసోసియేట్ ప్రొఫెసర్, 40 అసిస్టెంట్ ప్రొఫెసర్, 100 సీనియర్ రెసిడెంట్లు, మరో వంద జూనియర్ రెసిడెంట్లు, 3 డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, 10 అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులు, వంద నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులు ఉన్నాయి. దీనిపై మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి సహకరించిన చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి వేసవి కార్యాచరణ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వేసవిలో నీటి ఎద్దడికి అవకాశమున్న 332 మండలాల్లోని 3,438 ఆవాసాలను గుర్తించి, రూ.67.31 కోట్లతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. కరువు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాలి. అవసరమైతే ప్రైవేట్ తాగునీటి వనరులను అద్దెకు తీసుకుని, ప్రజల అవసరాలు తీర్చాలి. నీటి పథకాలు, బావులు, చేతి పంపులకు రిపేర్లు చేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మానటరింగ్ సెల్స్ ఏర్పాటు చేసి, తాగునీటిపై ప్రసార మాధ్యమాలతో పాటు టోల్‌ఫ్రీ నంబరు 1902 ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, సమస్యల్ని పరిష్కరించాలి. పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బంది రాకుండా చూడాలి. జలవనరుల శాఖ సమన్వయంతో కాలువలకు అడ్డుకట్ట వేసి, అన్ని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్ని, చెరువుల్ని నీటితో నింపాలి. విద్యుత్ అంతరాయాలతో నీటి సరఫరాకు ఆటంకం లేకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచాలి' అని సీఎస్ ఆదేశించారు. ప్రతి నెలా స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని నిర్వహించి, కార్యాలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

రైతులకు సహకరించండి: బ్యాంకర్లతో మనోహర్



అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలిచేందుకు, పేదలకు రేషన్ సరుకులు అందించేందుకు సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బ్యాంకర్లను కోరారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో గురువారం బ్యాంకర్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల కోసం ప్రతినెలా ప్రజలు ఎదురుచూస్తున్నారని, బ్యాంకర్లు వడ్డీ రేట్లు తగ్గించి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్లు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 9 నెలల్లోనే దాదాపు రూ.24వేల కోట్ల మేర రైతులకు బకాయిలు చెల్లించిందని చెప్పారు. సంస్కరణల్లో భాగంగా నూతన సాంకేతికతతో ధాన్యం కొనుగోలుకు వాట్సాప్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ విధానం ద్వారా 17 వేల మంది రైతులు ధాన్యం విక్రయించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుండటంతో వారంతా ఆనందంగా ఉన్నారని తెలిపారు. మరోవైపు రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మనోహర్ చెప్పారు. రాష్ట్రంలో అర్హులందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందించనున్నామని తెలిపారు.

ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశం

రాష్ట్ర ప్రభుత్వం 'దీపం-2' పథకం కింద లబ్ధిదారులకు అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి మనోహర్ సమావేశమయ్యారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు డెలివరీ అయిన 48 గంటల్లోపు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ సొమ్ము జమ చేయాలని ఆదేశించారు. అయితే గత మార్చి 31న సిలిండర్లు బుక్ చేసుకున్న లబ్ధిదారులకు ఏప్రిల్‌లో డెలివరీ అయ్యాయని, వారికి సబ్సిడీ జమ చేయడానికి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను అధిగమించి లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే సబ్సిడీ జమ చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99.22 లక్షల మంది లబ్ధిదారులు మొదటి ఉచిత సిలిండరును ఉపయోగించుకున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ మనజీర్ జిలాని తదితర అధికారులు, ఐఓసీ, హెచ్‌పీసీ, బీపీసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కల సతీశ్ ఇంటిపై ఈడీ దాడులు

- 50 కోట్ల కుక్క ఉత్తిదేనని తేల్చిన అధికారులు
- అద్దె కుక్కలతో మోసగిస్తున్నట్లు గుర్తింపు.. కేసు నమోదు

బెంగళూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అత్యంత విలువైన రూ.50 కోట్ల కుక్కను పెంచుకుంటున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్న ఎస్ సతీశ్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం దాడులు చేశారు. ఆయన అబద్ధాలు చెప్పాడని, కుక్కలను అద్దెకు తెచ్చుకుని.. వాటిని తాను కొనుగోలు చేసినట్టు అసత్య ప్రచారాలతో మోసగిస్తున్నాడని గుర్తించారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేశారు. సతీశ్ బెంగళూరుతో పాటు వివిధ నగరాల్లో ఒకామి అనే మేలు జాతి పెంపుడు కుక్కతో ఫ్యాషన్ షోలో పాల్గొన్నారు. ఇది తోడేలుకు, మంచు ప్రాంతాల్లో ఉండే కాకేషన్ షెపర్డ్ జాతి కుక్కకు పుట్టిన అరుదైన క్రాస్ బ్రీడ్ అని.. దీన్ని తాను రూ.50 కోట్లకు కొనుగోలు చేశానని చెప్పుకున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇంత భారీ మొత్తం వెచ్చించడంతో ఈడీ అధికారులు ఆయన ఇంటిపై దాడి చేసి సతీశ్‌ను విచారించారు. రూ.50 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన విషయం ఉత్తిదేనని తేలింది. గతంలో వివిధ జాతికుక్కలను పెంచుకునే అలవాటు ఉన్న సతీశ్.. ప్రస్తుతం ఇతరుల వద్ద ఉన్న మేలుజాతి కుక్కలను అద్దెకు తీసుకుని, వాటితో వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడుతున్నట్టు అధికారులు గుర్తించారు. అతని ఆర్థిక లావాదేవీలు, జీఎస్టీ, ఇతర వివరాలు లేవని ఈడీ అధికారులు నిర్ధారించారు. ఆయనపై కేసు నమోదు చేశారు.



ఒకామితో సతీశ్ (ఫైల్)

జగన్ అక్రమాస్తుల కేసులో...

దాల్మియా సిమెంట్ ఆస్తుల జప్తు

(మొదటి పేజీ తరువాయి)

మనీలాండరింగ్ చట్టాన్ని (2002) ఆ కంపెనీ ఉల్లంఘించినట్లు పేర్కొంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికార పలుకుబడిని ఉపయోగించి ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి భారతీ సిమెంట్స్‌కు భారీ ఎత్తున ఈక్విటీని, రుణాలను సమీకరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. భారతీ సిమెంట్స్ ఈక్విటీ షేర్లు ఐదున్నర కోట్లున్నాయి. రూ.10 ముఖ విలువకే నాలుగున్నర కోట్ల వాటాలను జగన్, ఆయన కంపెనీలు తీసుకోగా.. మిగతా షేర్లను దాల్మియా సిమెంట్, ఇండియా సిమెంట్స్ వంటి సంస్థలు, మ్యాట్రిక్స్ ప్రసాద్ వంటి వ్యాపార ప్రముఖులు ఒక్కో షేరుకు రూ.94 నుంచి రూ.175 రేటుతో కొనుగోలు చేయడం గమనార్హం. దాల్మియా సిమెంట్స్ ఆ తర్వాత 2 లక్షల షేర్లను రూ.1,440 రేటుతో కొనుగోలు చేసింది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందని సీబీఐ గతంలో వెల్లడించింది. తాజాగా ఈడీ అవే అభియోగాలతో డీబీసీఎల్ ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేసింది.

న్యాయపరంగా ఎదుర్కొంటాం: డీబీసీఎల్

తమకు చెందిన రూ.793.34 కోట్ల ఆస్తుల తాత్కాలిక జప్తుపై ఈడీ గత నెల 31న ఉత్తర్వులిచ్చిందని.. ఆ ప్రతిని ఈ నెల 15వ తేదీన తాము అందుకున్నామని డీబీసీఎల్ బుధవారం ప్రకటించింది. ఇది తాత్కాలిక జప్తు మాత్రమేనని.. దీనివల్ల తమ కంపెనీ కార్యకలాపాలకు ఎటువంటి అడ్డంకులూ ఉండవని, యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. ఈడీ ఆదేశాలను న్యాయపరంగా ఎదుర్కొంటామని పేర్కొంది.



2007లో భారతీ సిమెంట్స్ పెట్టిన జగన్.. 2009 ఆగస్టు 27న తన వాటా నుంచి 2,27,584 షేర్లను ఒక్కొక్కటీ రూ.1,450 ధరకు మ్యాట్రిక్స్ ప్రసాద్‌కు చెందిన అల్ఫావిల్లాస్ ప్రైవేట్ లిమిటెడ్, అల్ఫా అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు విక్రయించారు. జగన్‌కు రూ.33 కోట్లు దక్కాయి. భారతీ సిమెంట్స్ ఉత్పత్తిని ప్రారంభించక ముందే ఆయనకు భారీ ప్రతిఫలం దక్కిందన్న మాట. ఈ మొత్తంతో ఆయన పెట్టిన పెట్టుబడి

ఉత్పత్తి ప్రారంభించకుండానే ప్రతిఫలం

మొత్తం వెనక్కి వచ్చేసింది. విక్రయించిన ఈ షేర్లు జగన్ వాటాలో ఒక శాతం కంటే తక్కువే. ఆయన తండ్రి అధికార పగ్గాలు చేపట్టాక భారతీ సిమెంట్స్‌లోకి అక్రమ పెట్టుబడులు రప్పించే దందా సాగింది. అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వి.రాజగోపాల్ పక్కా స్కెచ్‌తో సాగిన అడ్డగోలు దోపిడీ బాగోతం అప్పట్లో విమర్శలకు కేంద్ర బిందువైంది. వైఎస్ కుటుంబం తమకు సన్నిహితంగా ఉండే సజ్జల కుటుంబాన్ని వినియోగించుకుని సాగించిన అక్రమాలు బయటకు వచ్చాయి. అప్పటి గనుల శాఖ సంయుక్త కార్యదర్శి ఎ.దయాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కె.వెంకట్రావు సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాలతో.. ఆనాడు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలింది. కడప జిల్లా నవాబుపేట తాలమంచిపట్నంలో 1,017 ఎకరాల సున్నపురాయి నిక్షేపాల ప్రాస్పెక్టింగ్ లీజుకోసం 1997లో జయా మినరల్స్ దరఖాస్తు చేసుకుంది. నాటి గనుల శాఖ జేడీ మేనకేతన్ రెడ్డి ఈ సంస్థకు సిమెంట్ ప్లాంటు ఏర్పాటు చేసే అర్హత లేదని స్పష్టంచేశారు. దరఖాస్తుదారుడి వివరణ కోరారు. కానీ స్పందన లేదు. 2004లో రాజశేఖర్‌రెడ్డి గద్దెనెక్కాక ఈ ఫైలు ఒక్కసారిగా కదిలింది. ఇదే సంస్థ నుంచి మరో దరఖాస్తును స్వీకరించారు. ఎన్నో ఏళ్లు స్పందించని కంపెనీకి ప్రాస్పెక్టింగ్ లైసెన్సు మంజూరు చేసేలా రాజగోపాల్ ప్రతిపాదనలు పంపారు. దరఖాస్తు చేసిన జయా మినరల్స్‌కు కాకుండా ఈశ్వర్ సిమెంట్స్‌కు లీజు బదిలీ చేయాలని షరతు విధించడం గమనార్హం. తర్వాత ఇవి ఈశ్వర్ నుంచి రఘురామ్‌కు, దాని పేరు మారాక భారతీ సిమెంట్స్‌కు బదిలీ అయ్యాయి.

కోర్టు ఆన్‌లైన్ విచారణలో అనధికారికంగా లాగిన్

- హైకోర్టు ఆగ్రహం..వారిపై చర్యలకు ఆదేశం
- విచారణను అర్ధంతరంగా ముగించిన న్యాయమూర్తి
- వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ సమయంలో ఘటన



అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కోర్టు విచారణ సందర్భంగా అనధికారికంగా లాగ్ ఇన్ అయ్యి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. వైసీపీ నేత వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తన వాదనలకు అవరోధం కలిగించడంపై లూథ్రా అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఆన్‌లైన్ విచారణను అర్ధంతరంగా ముగించారు. పిటిషన్లపై ఈ నెల 23న వాదనలు వింటామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ, అతని అనుచరులు మూకదాడి చేసి వాహనాలను తగలబెట్టడంతోపాటు పలువురిపై దాడి చేసి గాయపర్చారు. పార్టీ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులం పేరుతో దూషించారు. సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పలువురిని నిందితులుగా చేరుస్తూ 2023 ఫిబ్రవరి 22న గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వంశీకి బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇదే కేసులో నిందితుడి ఉన్న గొంతెన రాజ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించే విజయవాడ ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. నిందితుడికి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు వర్తించవనడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో క్రిమినల్ రివిజన్ కేసును సీఐడీ దాఖలు చేసింది. ఈ రెండు వ్యాజ్యాలు గురువారం హైకోర్టులో విచారణకు వచ్చాయి.

మిథున్‌రెడ్డికి మరో నోటీసు

రేపు రావాలని సిట్ పిలుపు

- విచారణకు విజయసాయిరెడ్డి గైర్హాజరు
- నేడు వస్తానని సమాచారం
- అజ్ఞాతంలోనే రాజ్ కసిరెడ్డి..
- సిట్ ముందుకు ఆయన తండ్రి



అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం దర్యాప్తు వేగాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరింత పెంచింది. కీలక పాత్రధారి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కసిరెడ్డి) కోసం విస్తృతంగా గాలిస్తూనే.. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిని ప్రశ్నించేందుకు సిద్ధమైంది. శుక్రవారం (18న) విచారణకు రావాలంటూ వారిద్దరికీ మూడ్రోజుల క్రితం నోటీసులు జారీ చేసింది. అయితే ఒక రోజు ముందే.. గురువారమే వస్తానని చెప్పిన విజయసాయిరెడ్డి కోసం సిట్ చీఫ్ ఎస్పీ రాజశేఖర బాబు, ఇతర అధికారులు విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో మధ్యాహ్నం వరకూ ఎదురు చూశారు. చివరి నిమిషంలో ఆయన నుంచి ఓ సందేశం వచ్చింది. ఇతరత్రా ముఖ్యమైన పనులు ఉండడం వల్ల రాలేకపోతున్నానని, శుక్రవారం తప్పకుండా హాజరవుతానన్నది దాని సారాంశం. ఇంకోవైపు.. శుక్రవారం రావలసిన మిథున్‌రెడ్డి సిట్ నోటీసుపై హైకోర్టును ఆశ్రయించారు. తన విచారణను ఆడియో-వీడియో రికార్డింగ్ చేయాలని కోరారు. ఇందుకు కోర్టు నిరాకరించడంతో ఆయన సిట్ ముందు హాజరవ్వాల్సిన అనివార్యత ఏర్పడింది. దీంతో శనివారం (19న) విచారణకు రావాలని సిట్ అధికారులు ఆయనకు మరో నోటీసిచ్చారు. కాగా.. మద్యం కుంభకోణంలో కసిరెడ్డిదే కీలక పాత్ర అని విజయసాయిరెడ్డి గత విచారణ సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తనను ఏ విచారణకు పిలిపించినా ఇదే విషయాన్ని చెబుతానని నాడు స్పష్టం చేశారు. అయితే ఎన్ని నోటీసులిచ్చినా రాకుండా కసిరెడ్డి పరారీలో ఉండడంతో.. సిట్ బృందం హైదరాబాద్ వెళ్లి ఆయన తండ్రి ఉపేందర్‌రెడ్డికి రెండ్రోజుల కిందట నోటీసిచ్చింది. దీంతో ఆయన గురువారం విజయవాడలో సిట్ కార్యాలయానికి వచ్చారు. రాజ్ ఎక్కడకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లారు.. ఎక్కడ ఉండే అవకాశం ఉంది.. ఎక్కువగా ఎక్కడకు వెళ్తుంటారు.. ఎవరితో బాగా దగ్గరగా ఉంటారు.. వంటి ప్రశ్నలను సిట్ అధికారులు సంధించారు. అన్నిటికీ తనకేమీ తెలియదనే ఉపేందర్‌రెడ్డి సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దరిమిలా శుక్రవారం మరోమారు విచారణకు రావాలని సిట్ అధికారులు సూచించడంతో.. విజయవాడలోనే ఉంటానంటూ తాను బస చేసే హోటల్ వివరాలు చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఇంకోవైపు... గత ప్రభుత్వంలో ముడుపులు చెల్లించిన మద్యం వ్యాపారులకు వరుసగా నోటీసులిచ్చిన సిట్.. శుక్ర, శనివారాల్లో పలువురిని ప్రశ్నించనుంది.

విచారణ రికార్డింగ్‌కు ఆదేశించలేం

- మిథున్‌రెడ్డి అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు
- ఇద్దరు న్యాయవాదులతో సిట్ ముందుకు వెళ్లేందుకు అనుమతి
- న్యాయమూర్తి స్పష్టీకరణ.. వ్యాజ్యం పరిష్కారం

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తనను విచారించే సమయంలో ఆ ప్రక్రియను ఆడియో-వీడియో రికార్డింగ్ చేసేలా ఆదేశించాలన్న వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఈ నెల 19న విచారణకు హాజరైనప్పుడు ఆయనతో ఇద్దరు న్యాయవాదులు సిట్ అధికారుల ముందుకు వెళ్లేందుకు అంగీకరించింది. ఆయన్ను విచారించే సమయంలో 10 అడుగుల దూరంలో ఓ న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని సిట్ అధికారులకు స్పష్టం చేసింది. అలాగే సిట్ విచారణ, వాంగ్మూలం నమోదుకు ఆటంకం కలిగించవద్దని న్యాయవాదులకు తేల్చిచెప్పింది. విచారణ సమయంలో అధికారులు చేయి చేసుకుంటారని, దుర్భాషలాడతారని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. ఈ నేపథ్యంలో కార్యాలయంలోని సీసీటీవీ కెమెరా కవరేజీ ఉన్న ప్రదేశంలో ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయాలని దర్యాప్తు అధికారికి స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు తనను విచారించే సమయంలో న్యాయవాదులను అనుమతించాలని, ఆడియో-వీడియో రికార్డింగ్ చేసేలా వారిని ఆదేశించాలని కోరుతూ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిందితులను న్యాయవాదుల సమక్షంలో విచారించేందుకు గతంలో ఇదే హైకోర్టు అనుమతించిందన్నారు. సాక్షిగా శుక్రవారం తమ ముందు విచారణకు హాజరుకావాలని పిటిషనర్‌కు సిట్ నోటీసులు ఇచ్చిందని, తాజాగా ఈ నెల 19న రమ్మని మరో నోటీసు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్‌తో పాటు న్యాయవాదులు వెళ్లేందుకు అనుమతించాలని కోరారు. సిట్ తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. విచారణ సమయంలో ఆడియో-వీడియో రికార్డింగ్ చేయడమనేది దర్యాప్తు అధికారి విచక్షణాధికారమన్నారు. న్యాయవాది పదడుగుల దూరంలో ఉంటే అభ్యంతరం లేదని, కానీ విచారణలో జోక్యం చేసుకోకుండా ఆదేశించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఆడియో-వీడియో రికార్డింగ్‌కు సిట్‌ను ఆదేశించేందుకు నిరాకరించారు.

సిట్ అదుపులో రాజ్ కసిరెడ్డి సహాయకుడి తండ్రి!

- హైకోర్టులో హెబియస్ కార్పస్ వ్యాజ్యం
- అక్రమ నిర్బంధంపై నిగ్గుతేల్చేందుకు 21న మా ముందు హాజరవ్వండి
- బాలసుబ్రహ్మణ్యంరెడ్డికి హైకోర్టు ఆదేశం
- ఆయన్ను నిర్బంధించినవారి పేర్లు, వివరాలివ్వాలని సిట్‌కూ నిర్దేశం

అమరావతి/తిరుపతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్బంధం ఆరోపణలపై వాస్తవాలు తేల్చేందుకు సోమవారం తమ ముందు హాజరుకావాలని తిరుపతికి చెందిన విశ్రాంత హెడ్‌కానిస్టేబుల్ టి.బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని గురువారం హైకోర్టు ఆదేశించింది. న్యాయస్థానం ముందు హాజరయ్యేందుకు వీలుగా ఈ నెల 20, 21 తేదీల్లో ఏ అథారిటీ/దర్యాప్తు అధికారి ముందూ హాజరు కావలసిన అవసరం లేదని ఆయనకు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందన రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. బాలసుబ్రహ్మణ్యంరెడ్డి.. పరారీలో ఉన్న రాజ్ కసిరెడ్డి సహాయకుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తండ్రి. మూడేళ్లు రాజ్ వద్ద పనిచేసిన కిరణ్‌రెడ్డిని మద్యం స్కాంలో గతంలో సిట్ విచారించింది. తమ ముందుకు రాకుండా ఫోన్లు స్విచాఫ్ చేసుకుని పరారీలో ఉన్న రాజ్ కోసం విస్తృతంగా గాలిస్తోంది. హైదరాబాద్‌లో సోమవారం సోదాలు కూడా చేపట్టింది. ఈ క్రమంలో మళ్లీ కిరణ్‌రెడ్డిని ప్రశ్నించాలని అధికారులు భావించారు. బుధవారం అర్ధరాత్రి తిరుపతిలో వారి నివాసానికి చేరుకున్నారు. కిరణ్ అందుబాటులో లేకపోవడంతో తండ్రి బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాలసుబ్రహ్మణ్యంరెడ్డి అల్లుడు, వైసీపీ నేత మేకా వెంకట్రామరెడ్డి హైకోర్టులో గురువారం అత్యవసరంగా హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. బుధవారం అర్ధరాత్రి 11.50 గంటలకు తిరుపతిలోని ఇంటి నుంచి గుర్తు తెలియని కొందరు వ్యక్తులు బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని తీసుకెళ్లారని, ఆయన ఆచూకీ తెలుసుకుని కోర్టు ముందు హాజరుపరచాల్సిందిగా పోలీసులను ఆదేశించాలని కోరారు. ధర్మాసనం లంచ్ మోషన్ పిటిషన్‌గా విచారణకు స్వీకరించింది. వెంకట్రామరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. మఫ్టీలో వచ్చిన పోలీసులు సుబ్రహ్మణ్యంరెడ్డిని అక్రమంగా నిర్బంధించి విజయవాడకు తరలించారని.. రహస్య ప్రదేశంలో నిర్బంధించారని తెలిపారు. ఆయన్ను ఏ కేసులో అదుపులోకి తీసుకుంటున్నారో చెప్పలేదన్నారు. ఆయన కుమారుడి గురించి ఆరా తీశారని, అది తెలియకపోవడంతో ఆయన్ను తీసుకెళ్లారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. ఓ కేసులో సాక్షిగా గురువారం తమ ముందు హాజరుకావాలని ఈ నెల 14న సిట్ అధికారులు సుబ్రహ్మణ్యంరెడ్డికి నోటీసులు ఇచ్చారన్నారు. ఫొటోలను పరిశీలిస్తే విజయవాడ వచ్చేందుకు ఆయన తన పూర్వ సహచరుల సహాయం తీసుకున్నట్లు కనపడుతోందని తెలిపారు. సుబ్రహ్మణ్యంరెడ్డి ప్రస్తుతం సిట్ ముందు ఉన్నారని, ఆయన వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేస్తున్నారని వివరించారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. అక్రమ నిర్బంధం ఆరోపణలపై వాస్తవాలు తేల్చేందుకు సోమవారం (21న) తమ ముందు హాజరుకావాలని బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని ఆదేశించింది. పిటిషనర్ కోర్టు ముందుంచిన ఫొటోలలోని వ్యక్తులను గుర్తించి.. వారి పేర్లు, ఇతర వివరాలను తమకు సమర్పించాలని సిట్ అధికారులను కూడా ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

పార్లమెంటులో టీడీపీ ఎంపీల జోరు

- 99 శాతం హాజరుతో కలిశెట్టి, జీఎం హరీశ్ టాప్..చర్చల్లో లావు ఫస్ట్
- 54% హాజరుతో చివరిస్థానంలో వైసీపీ ఎంపీ అవినాశ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలు పార్లమెంటుకు హాజరవుతున్న తీరు, సభలో వారు లేవనెత్తుతున్న ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనడంపై ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. 18వ లోక్‌సభ కొలువుదీరినప్పటి నుంచి ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల వరకు ఎంపీల పనితీరుపై పీఆర్‌ఎస్‌ఇండియా.ఆర్గ్ సమాచారం సేకరించింది. దీని ప్రకారం.. టీడీపీ ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, జీఎం హరీశ్ 99శాతం పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ (97%), చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు (93%) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. పార్లమెంటుకు 90 శాతానికి పైగా హాజరు ఏడుగురు ఎంపీలకు ఉండగా వారిలో ఆరుగురు (కలిశెట్టి, జీఎం హరీశ్, శ్రీభరత్, దగ్గుమళ్ల, బస్తీపాటి నాగరాజు, లక్ష్మీనారాయణ) తొలిసారి లోక్‌సభకు ఎన్నికైనవారే కావడం విశేషం. ఈ జాబితాలో 54 శాతం హాజరుతో వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి చివరి స్థానంలో ఉన్నారు. ఇక ప్రశ్నలు వేయడంలోనూ ఎంపీ కలిశెట్టి ముందున్నారు. ఏకంగా 89 ప్రశ్నలు ఆయన వేశారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి (84), దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పుట్టా మహేశ్(82) వరుసగా రెండు,మూడు స్థానాల్లో నిలిచారు. తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అత్యల్పంగా 22 ప్రశ్నలు అడిగారు. టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు 22 చర్చల్లో పాల్గొని టాప్‌లో ఉండగా, వైసీపీ ఎంపీ గురుమూర్తి 19 చర్చలతో రెండోస్థానంలో, జనసేన ఎంపీ బాలాశౌరి 18చర్చలతో మూడోస్థానంలో ఉన్నారు. ఎంపీ పార్థసారథి కేవలం ఒక్కచర్చలో మాత్రమే పాల్గొన్నారు.



వైసీపీ నేతలు, శ్రేణులతో కలిసి తన ఇంటి ముందు రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న భూమన కరుణాకర్ రెడ్డి



గోశాల నుంచి భూమనకు ఫోను చేసి, ఆయన కోసం వేచి ఉన్న ఎమ్మెల్యేలు, కూటమి నేతలు



గోశాలపై గోల!

(మొదటి పేజీ తరువాయి)

నేతలు గోశాలకు వెళ్లకూడదు. మందీమార్బలంతో కాకుండా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు, వ్యక్తిగత భద్రతా సిబ్బందితో మాత్రమే రావాలి' అని తిరుపతి ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టం చేశారు. కూటమి, వైసీపీ నేతలకు ఇవే నిబంధనలు వర్తిస్తాయని ప్రకటించారు. అధికార పార్టీ నేతలు దీనిని పాటించగా, మందీమార్బలంతో బయలుదేరిన వైసీపీ నేతలు హైడ్రామా నడిపించారు.

భారీ ప్రదర్శనగా...

గురువారం ఉదయం వైసీపీ ఎంపీ గురుమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భూమన నివాసానికి చేరుకున్నారు. వారందరితో కలిసి భూమన ప్రదర్శనగా ఎస్వీ గోశాలకు బయలుదేరారు. ఇంతమందిని అనుమతించేది లేదని పోలీసులు అడ్డుకున్నారు. గోశాలలోకి ప్రవేశాన్ని అడ్డుకోబోమని, అయితే ఐదుగురు, వారి వ్యక్తిగత గన్‌మెన్‌కు మాత్రమే అనుమతి ఉందని ముందస్తుగా జారీ చేసిన ఆదేశాలను గుర్తుచేశారు. గోశాల వద్దకు గుంపులుగా రావద్దని విజ్ఞప్తి చేశారు. అయితే, తమను గోశాలకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారంటూ తన ఇంటి ముందే నేతలు, శ్రేణులతో కలిసి భూమన రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. 'మీ సవాల్‌కు స్పందించి నేను గోశాలకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి చెప్పారు. గోశాలకు రమ్మని భూమనకు సవాల్ విసిరి.. చివరకు ఆయన వెళ్లే సమయానికి అడ్డుకుంటారా అంటూ రోజా తదితరులు విమర్శించారు. పలువురు నేతలు రాజకీయ ఆరోపణలు చేశారు. ఈ విధంగా 45 నిమిషాలకు పైగా నిరసన కొనసాగించారు. భూమనను హౌస్ అరెస్టు చేశారంటూ వైసీపీ శ్రేణులు హంగామా సృష్టించాయి. ఈ ప్రచారాన్ని పోలీసులు ఖండించారు. తాము ఎవరినీ నిర్బంధించలేదని... గోశాలకు ప్రదర్శనగా వెళ్లేందుకు మాత్రమే నిరాకరించామని స్పష్టం చేశారు.

గోశాలకు వెళ్లిన కూటమి నేతలు

మరోవైపు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు(తిరుపతి), పులివర్తి నాని (చంద్రగిరి), బొజ్జల సుధీర్ రెడ్డి(శ్రీకాళహస్తి), మురళీకృష్ణ (పూతలపట్టు), థామస్ (గంగాధర నెల్లూరు), గురజాల జగన్మోహన్ (చిత్తూరు)తోపాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన, బీజేపీ నేతలు ఉదయం 9.10గంటలకు గోశాల చేరుకున్నారు. ఆవులను పరిశీలించి, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. వీరు గోశాలలో ఉన్నంతసేపూ పోలీసు యంత్రాంగం వెన్నంటే ఉంది. గోశాల నుంచే ఎమ్మెల్యేలు నాని, సుధీర్ రెడ్డి భూమనకు ఫోన్‌చేసి ఆహ్వానించారు. అసత్య ఆరోపణలు చేసి ఇంట్లో ఉండటం కాదని, గోశాలకు రావాలని కోరారు. అప్పటికే నిరసన నుంచి ఇంట్లోకి వెళ్లిన భూమన.. మళ్లీ భారీగా శ్రేణులతో కలిసి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ నేతల చాలెంజ్‌పై తాను స్పందించానని, వారు అక్కడ ఉన్నప్పుడే తనను అనుమతించాలని భూమన పోలీసులను కోరారు. మధ్యాహ్నం 1.26గంటలకు కూటమి ఎమ్మెల్యేలు, నేతలు గోశాల సందర్శన పూర్తి చేసుకుని బయటకు వచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, భూమన సవాల్‌ను స్వీకరించి తాము వచ్చామని, గోశాలపై వైసీపీ నేతల ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నాయని విమర్శించారు. అసత్య ఆరోపణలు మానుకోవాలని, వైసీపీ హయాంలో టీటీడీలో ఎన్నో అక్రమాలు జరిగాయని నేతలు ఆరోపించారు.

గోడ దూకి వచ్చా: ఎంపీ గురుమూర్తి

ఇదిలా ఉంటే తిరుపతి వైసీపీ ఎంపీ గురుమూర్తి మాత్రం గోశాలకు చేరుకున్నారు. గోశాలకు రాకుండా కరుణాకర్ రెడ్డిని అడ్డుకున్నారని, తాను వేరేదారిలో గోడదూకి రావాల్సి వచ్చిందని ఎంపీ చెప్పారు. కారులో నేరుగా గోశాలకు వచ్చి గోడదూకి వచ్చానని చెప్పడమేంటని కూటమి ఎమ్మెల్యేలు నిలదీయడంతో ఆయన నీళ్లు నమిలారు. గోడ దూకి రావడం అంటే ప్రధాన గేటు నుంచి కాకుండా వేరే గేటు నుంచి వచ్చానని సమర్థించుకున్నారు. మీతో పాటు ఒక వైసీపీ కార్పొరేటరు కూడా దర్జాగా గోశాలకు వచ్చినప్పుడు కరుణాకర్ రెడ్డి రావడానికి అడ్డంకులు ఏమిటని కూటమి నేతలు నిలదీశారు. ఈ క్రమంలో వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో ఎస్పీ జోక్యం చేసుకుని ఎంపీని అక్కడినుంచి పంపేశారు. తర్వాత కొద్దిసేపటికి కూటమి ఎమ్మెల్యేలు కూడా వెళ్లిపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

జగన్.. మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు: దారూనాయక్

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం మానుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారూనాయక్ అన్నారు. 'వైసీపీని ప్రజలు ఛీ కొట్టడంతో జగన్ తన ఉనికిని చాటుకోవడానికి కుల రాజకీయాలకు తెరదీశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని హత్యగా చిత్రీకరించి క్రిస్టియన్‌లను రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. తిరుమలలో గోవులు చనిపోయాయంటూ మరో కుట్రకు తెర లేపారు. వక్ఫ్ బిల్లుపై పార్లమెంట్‌లో ద్వంద్వ వైఖరి అవలంబించి తిరిగి ముస్లింలను రెచ్చగొడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వైసీపీ నాయకులు కుట్రలు చేయాలని చూస్తే ఊరుకునేది లేదు' అని దారూనాయక్ హెచ్చరించారు.

భూమన హయాంలో టీటీడీని దోచారు

» శ్రీవారి విషయంలో అపచారం

» అందుకే వైసీపీ మట్టికొట్టుకు పోయింది: మంత్రి ఆనం



నెల్లూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'భూమన కరుణాకరరెడ్డి రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా చేశారు. ఆయన హయాంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం దోపిడీకి గురైంది' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. గురువారం నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. "టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నాస్తికుడు. ఆయనకు వేంకటేశ్వర స్వామి అంటే భక్తి లేదు. అలాంటి వ్యక్తిని రెండు సార్లు టీటీడీ చైర్మన్‌ను చేశారు. శ్రీవారి విషయంలో చేసిన అపచారాల వల్లే రాష్ట్రంలో వైసీపీ మట్టి కొట్టుకుపోయింది. భూమన నిజంగా శ్రీవారి భక్తుడే అయితే ముందు తిరుమల మొదటి మెట్టు వద్ద తలాన్చి 'స్వామీ..! మా నాయకులు చెబితే తప్పు చేశాను. నన్ను క్షమించు' అని ప్రాధేయపడాలి. టీటీడీ గోశాలలో ఆవుల మరణాలు సహజమైనవని అందరూ ఘోషిస్తుంటే వైసీపీ నేతలు మాత్రం టీటీడీ పవిత్రతను దెబ్బ తీసే విధంగా కుట్రలు పన్నుతున్నారు. హిందూమతేతర సంప్రదాయాలను అనుసరించే కరుణాకరరెడ్డికి గోవు గురించి, హిందూ మతం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. గోవు, తల్లి గురించి మాట్లాడే మీ నాయకుడిని ఆయన తల్లే 'నా కడుపున ఎలా ఉట్టావు..!?' అని అడుగుతోందంటే మీరు, మీ విశ్వసనీయత ఏ పాటిదో అందరికి అర్థమవుతోంది' అని మంత్రి ఆనం ఎద్దేవా చేశారు.

తిరుమలపై మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదు

» మంత్రులు అనగాని, గొట్టిపాటి



అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రత గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదని మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుమల దర్శనానికి వచ్చి డిక్లరేషన్ కూడా ఇవ్వకుండా సాంప్రదాయాలు పాటించని వాళ్లు తమపై నిందలు వేస్తారా అని గొట్టిపాటి ప్రశ్నించారు. కులమతాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ చూస్తోందన్నారు. తండ్రి, బాబాయ్‌ని కూడా వదలకుండా శవరాజకీయాలు చేసిన వాళ్లు ఇప్పుడు మూగజీవాలనూ వదలడం లేదన్నారు. అనగాని మాట్లాడుతూ... తిరుమల గోశాలపై వైసీపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందనే విషయం స్పష్టమైందన్నారు. టీటీడీ విషయలో వైసీపీ చేస్తున్న కుట్రలు బట్టబయలు అయ్యాయన్నారు. వైసీపీ ఎంపీ గురుమూర్తి గోశాల వరకు వచ్చి వారు చేసిన ఆరోపణల్లో గడ్డిపరకంత కూడా రుజువు చేయలేకపోయారన్నారు. కరుణాకర్‌రెడ్డికి అబద్ధపు ప్రచారాలు కొత్త కాదని మంత్రి అనగాని విమర్శించారు.

జిల్లాకో ఐటీ మేనేజర్

» కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి ఐటీ శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి జిల్లాకూ ఒక ఐటీ మేనేజర్‌ను కాంట్రాక్టు పద్ధతిలో నియమించుకోవడానికి అనుమతిస్తూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా జిల్లాకో ఐటీ మేనేజర్‌ను నియమిస్తారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో వారు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, నెట్‌వర్క్ వంటి సేవలను వారు అందిస్తారు. ఐటీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించాలంటే బీటెక్ లేదా ఎంఎస్సీ కంప్యూటర్స్ చేసి ఉండాలి. ఈ రంగంలో మూడేళ్ల అనుభవం కావాలి.

పోలీసులు అనుమతించలేదు: భూమన

గోశాలకు తనను పోలీసు అధికారులు అనుమతించలేదని మీడియా సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. తనను అర్ధరాత్రి నుంచి పోలీసులు గృహ నిర్బంధం చేశారని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ మించిపోయింది లేదని రేపు, ఎల్లుండి ఎప్పుడు రమ్మన్నా కేవలం ఐదుగురితోనే వస్తామని, గోశాలలో పూడ్చిపెట్టిన గోవులను చూపెడతామని భూమన పేర్కొన్నారు.

ఐదేళ్లు దోచుకున్న భూమన, వైవీ

» శ్రీవారిని అపకీర్తిపాలు చేసేందుకు అసత్య ఆరోపణలు: ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఐదేళ్లపాటు దోచుకొన్న భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి శ్రీవారిని అపకీర్తిపాలు చేసేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఆయన మాట్లాడారు. "టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందాయని భూమన అసత్య ఆరోపణలు చేశారు. వైసీపీ ఉనికిని కాపాడుకునేందుకు తిరుపతిలో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. నీతి, నిజాయతీ, దమ్మున్న వ్యక్తి అయితే కూటమి ఎమ్మెల్యేల సవాలును స్వీకరించేవారు. గోశాలను పరిశీలించేందుకు అనుమతి ఇస్తామని, పేర్లు ఇవ్వాలని తిరుపతి ఎస్పీ, డీఎస్పీ చెప్పినా, రాజకీయం చేసేందుకే గురువారం రోడ్లపై నిరసనకు దిగారు. కూటమి అధికారంలోకి వచ్చాక శ్రీవారిపట్ల గౌరవం పెంచేందుకు, వైసీపీ భ్రష్టు పట్టించిన వ్యవస్థలను సరిచేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. కానీ వైసీపీ నేతలు అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదు. మాజీ మంత్రి రోజా ఒక మహిళ అయి ఉండి 'ఆడంగి వెధవలు' అని సంబోధించడం భావ్యం కాదు. గోవులు మరణించాయని అసత్య ప్రచారాలు మానుకోవాలి. శ్రీవారిని అడ్డం పెట్టుకొని వ్యాపారం చేసి దోచుకున్న వారికి కాలం తగిన బుద్ధి చెబుతుంది" అని ఎంఎస్ రాజు హెచ్చరించారు.

యంగ్ గ్లోబల్ లీడర్ రామ్మోహన్

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ జాబితాలో స్థానం

భారత్ నుంచి మొత్తం ఏడుగురికి చోటు

శ్రీకాకుళం/అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర కేబినెట్‌లో యువ మంత్రిగా దేశవ్యాప్తంగా ఇప్పటికే గుర్తింపు పొందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు మరో అరుదైన ఘనత సాధించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ యంగ్ గ్లోబల్ లీడర్ల జాబితా 2025లో ఆయన స్థానం దక్కించుకున్నారు. ఈ ఏడాది సుమారు 50 దేశాలకు చెందిన 116 మందిని ఎకనామిక్ ఫోరమ్ ఎంపిక చేసింది. మారుతున్న ప్రపంచానికి తమదైన శైలిలో నాయకత్వం అందించే వివిధ రంగాలకు చెందిన 40 ఏళ్ల లోపున్న వారిని దీని కోసం ఎంపిక చేస్తారు. ఈ సంవత్సరం జాబితాలో తమ రంగాల్లో ఉత్తమ నాయకత్వం కనబరిచిన యువ నేతలు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, టెక్ సంస్థల వ్యవస్థాపకులు, మానవ హక్కుల నేతలు, న్యాయవాదులు ఉన్నారు. ఈ జాబితాలో భారతదేశం నుంచి ఏడుగురు చోటు దక్కించుకున్నారు. రామ్మోహన్‌నాయుడుతో పాటు ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ వ్యవస్థాపకుడు రితేశ్ అగర్వాల్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఎండీ నటరాజన్ శంకర్, పర్వతారోహకుడు, పారిశ్రామికవేత్త అనురాగ్ మలూ తదితరులు ఉన్నారు. పార్లమెంట్‌లో అనర్గళంగా మాట్లాడగలిగే నేతగా రామ్మోహన్‌నాయుడు ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 26 ఏళ్ల వయసులో లోక్‌సభలో అడుగుపెట్టి తనదైన ప్రసంగ శైలితో ప్రజల మన్ననలు అందుకున్నారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో యువ కేంద్ర మంత్రిగా పౌరవిమానయాన శాఖలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక కావడంపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ.. "వరల్డ్ ఎకనామిక్ ఫోరం ద్వారా 'యంగ్ గ్లోబల్ లీడర్'గా ఎంపిక కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపు ఒక్క నాకు చెందినది మాత్రమే కాదు. ముఖ్యమైన, ప్రపంచాన్ని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే స్థానంలో భారత యువత ప్రాధాన్యం పెరుగుతోందని ఇది సూచిస్తోంది. నిజాయితీ, నూతన ఆలోచనలు, సమగ్రతతో ప్రజలకు సేవ చేయాలనే మా బాధ్యతను ఇది మరింత గుర్తుచేస్తుంది" అని తెలిపారు.

సీఎం చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

యంగ్ గ్లోబల్ లీడర్స్ జాబితాలో రామ్మోహన్‌నాయుడికి చోటు దక్కడంపై సీఎం చంద్రబాబు హర్షం



వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి అభినందలు తెలిపారు. దేశానికి ముఖ్యంగా తెలుగు ప్రజలకు ఇది గర్వించదగ్గ సమయమని, మున్ముందు రామ్మోహన్‌నాయుడు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా రామ్మోహన్ నాయుడికి అభినందనలు తెలిపారు.



ఢిల్లీలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన నిమిత్తం కుటుంబ సమేతంగా ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. రాబోయే జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి భువనేశ్వరికి తినిపించారు. ఈ వేడుకలలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దంపతులు, రాష్ట్ర మంత్రి లోకేశ్, ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, సానా సతీశ్ పాల్గొన్నారు.

ఇంధన సంస్థల డైరెక్టర్ అభ్యర్థులతో మాట్లాడతా!

» ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటా

» మంత్రి గొట్టిపాటి బృందానికి సీఎం చంద్రబాబు స్పష్టత

» డిస్కమ్‌ల సీఎండీ నియామకాలపైనా త్వరలో నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంధన సంస్థలు ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌లో 17మంది డైరెక్టర్ల నియామకంపై సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎంపికైన అభ్యర్థులను తన ముందుకు తీసుకురావాలని, వారితో మాట్లాడాకే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం తనను కలిసిన విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎంవో కార్యదర్శి రాజమౌళిలకు తెలిపారు. ఈ సందర్భంగా మౌఖిక ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన వారి జాబితాను వీరు సీఎంకు అందజేశారు. దీంతో డైరెక్టర్ల నియామకం ఇప్పట్లో తేలేలా లేదన్న అభిప్రాయం మంత్రి బృందానికి ఏర్పడిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. డైరెక్టర్ అభ్యర్థులకు సీఎం ప్రత్యేకంగా సమయం ఇస్తేనే గానీ మాట్లాడేందుకు వీలుండదు. ఇంధన రంగంలో నిష్ణాతుడైన చంద్రబాబు.. డైరెక్టర్లకు ఒక విధంగా మౌఖిక పరీక్ష నిర్వహించబోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏపీ జెన్కోలో 5, ట్రాన్స్‌కోలో ఒకటి, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్‌లలో 4 చొప్పున, ఈపీడీసీఎల్‌లో 3 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఈ పోస్టుల కోసం ఇటీవల జరిగిన మౌఖిక ఇంటర్వ్యూలకు 148 మంది హాజరయ్యారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ మెరిట్ లిస్టులో ఉన్నవారి జాబితాను సిద్ధం చేశారు. డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలంటూ మంత్రి గొట్టిపాటిపై ఒత్తిడి పెరుగుతోంది. ఎస్పీడీసీఎల్ సీఎండీగా పుల్లారెడ్డిని, సీపీడీసీఎల్ సీఎండీగా సంతోష్‌రావును నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌ను కూడా బదిలీ చేసే వీలుందని ప్రచారం ఉంది.

టారిఫ్‌ను సవరించం

» యూనిట్ రూ.2.49కు ఇవ్వాల్సిందే

» సెకీకి కేంద్ర విద్యుత్ మండలి స్పష్టీకరణ

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)కి, ఏపీ డిస్కమ్‌లకు మధ్య ఖరారైన టారిఫ్‌ను సవరించడం కుదరదని కేంద్ర విద్యుత్ నియంత్రణమండలి (సీఈఆర్‌సీ) తేల్చి చెప్పింది. ఏపీ డిస్కమ్‌లతో చేసుకున్న ఒప్పందం మేరకు రూ.2.49కు యూనిట్ విద్యుత్ సరఫరా చేయాల్సిందేనని, ఆ ధరను పెంచడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఏపీకి 7వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇచ్చేలా డిస్కమ్‌లతో సెకీ ఒప్పందం చేసుకుంది. ఇందులో 4,667 మెగవాట్ల కోసం అదానీతోను, 2,333మెగావాట్ల కోసం అజూర్‌తోను అనుబంధ ఒప్పందాలు చేసుకుంది. అజూర్‌తో అదానీ కంపెనీ 2,333 మెగావాట్ల విద్యుత్ కోసం వేరే ఒప్పందం చేసుకుంది. ఈ రెండు కంపెనీల మధ్య కుదిరిన ఒప్పందం రద్దు అయిన దరిమిలా గతంలో కుదిరిన టారిఫ్ ధరను పెంచాలంటూ కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలిని సెకీ ఆశ్రయించింది. దీనిపై గురువారం మండలి తన నిర్ణయం తెలియజేసింది.

వర్గీకరణకు జై డీఎస్సీకి సై

(మొదటి పేజీ తరువాయి)

అవలంబిస్తారు. ఈ విధానాన్ని ఒక్కొక్కటి 1 నుంచి 100 సంఖ్యతో రెండు సైకిల్స్ అమలు చేయాలి. ఆర్డినెన్స్ జారీ నేపథ్యంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గురువారం సచివాలయానికి వచ్చి సీఎస్ విజయానంద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

డీఎస్సీకి రెడీ.. నిరుద్యోగులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్‌తో లైన్‌క్లియర్ అయ్యింది. నోటిఫికేషన్ ప్రకటించేందుకు పాఠశాల విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. మొత్తం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీకి శ్రీకారం చుడతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోనుంది. డీఎస్సీపై సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసిన వెంటనే నోటిఫికేషన్ జారీచేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 20 లేదా 23 మంచి రోజులు కావడంతో... ఆ తేదీల్లోనే నోటిఫికేషన్ జారీచేయాలని భావిస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తర్వాత పరీక్షలు జరుగుతాయి. గతంలోనే జిల్లాల వారీగా పోస్టుల వివరాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. కాగా ఇటీవల సృష్టించిన 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను మరో ప్రత్యేక డీఎస్సీతో భర్తీ చేస్తారు. విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

వయోపరిమితి పెంపు

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత గరిష్ఠ వయోపరిమితి ప్రస్తుతం 42ఏళ్లుకాగా దానిని అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు 44ఏళ్లకు పెంచారు. 2024 జూలై 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వరిస్తుందని స్పష్టంచేశారు.

నాడు మట్టి కొట్టారు... నేడు సున్నం కొట్టడానికి వస్తున్నారు

» అమరావతిపై చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదేళ్లుగా గాడిదలు కాస్తున్నారా?

» ప్రధాని మోదీపై షర్మిల మండిపాటు



అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): 'చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి... ఇదే అమరావతికి ప్రధాని మోదీ చేసిన సాయం. ఆనాడు గాలి మోటార్లో తిరిగి ఆంధ్రుల నెత్తిమీద మట్టి కొట్టారు. ఇప్పుడు మళ్లీ సున్నం కొట్టడానికి వస్తున్నారు. నిజంగా అమరావతిపై మోదీకి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదేళ్లుగా గాడిదలు కాశారా?' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. గురువారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ వైఖరిని తీవ్రంగా తప్పు పట్టిన ఆమె... విభజన హామీలన్నింటినీ అమలు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. "ఆత్మగౌరవం అమరావతిని 'మోదీ శంకుస్థాపనల ప్రాజెక్టు'గా మార్చేశారు. రాజధాని నిర్మాణంపై బీజేపీ చేస్తున్నది ఘరానా మోసం. రాష్ట్రానికి చేసింది ద్రోహం. పోలవరం ఎత్తును తగ్గించి తీరని అన్యాయం చేసి... రూ.15 వేల కోట్లు అప్పు ఇచ్చి రాజధానిని ఉద్ధరించినట్లు గొప్పలు చెప్పడం సిగ్గుచేటు. రాజధాని పనులపై ఒక్కనాడైనా బాధ్యతగా అడిగారా? గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతుంటే వేడుక చూసింది మీరు కాదా? ఇది తప్పని మీ దత్తపుత్రుడిని ఎందుకు వారించలేదు? ఢిల్లీని మించిన రాజధానిని కట్టిస్తామని ఇచ్చిన హామీని మరచిపోయారా? ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు చేసి ఇప్పుడు మళ్లీ ఏముఖం పెట్టుకుని వస్తున్నారో సమాధానం చెప్పాలి. ఏపీ నూతన రాజధాని నిర్మాణానికి కేంద్రమే పూర్తి నిధులు ఇవ్వాలి. పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లా..? లేక 41.15 మీటర్లా? మోదీ క్లారిటీ ఇవ్వాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సెయిల్‌లో విలీనం, కడప ఉక్కు నిర్మాణం, పారిశ్రామిక కారిడార్ వంటి పెండింగ్ విభజన హామీలన్నింటిపై మీ వైఖరి తేల్చాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

స్కూళ్ల స్వరూపం మారెన్!

9,200 మోడల్ ప్రైమరీ స్కూళ్లు

అందులో ప్రతి తరగతికి ఒక టీచర్

బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 19వేలు

1,557 ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతులు

పాఠశాల విద్యాశాఖ నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల స్వరూపం మారుతోంది. గతంలో ఆరు రకాల పాఠశాలలుండేవి. అయితే, ఇకపై ఐదు రకాల బడులు ఉండేలా కొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొస్తోంది. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడం లక్ష్యంగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రవేశపెడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 9,200 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. గ్రామాల్లో ఉన్న రెండు, మూడు ప్రాథమిక పాఠశాలల్లో ఒకదానిని మోడల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆ పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులకు ఒక్కో టీచర్ చొప్పున ఐదుగురు టీచర్లను ఇస్తారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా హెచ్‌ఎం పోస్టు ఇస్తారు. అవసరమైతే సమీపంలోని మిగులు స్కూల్ అసిస్టెంట్‌ను మోడల్ ప్రైమరీ పాఠశాలకు హెచ్‌ఎంను చేస్తారు. దీనివల్ల ప్రభుత్వ ప్రాథమిక విద్యకు పునరుత్తేజం వస్తుందని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుత విధానంలో చాలా ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. విద్యార్థులు తక్కువగా ఉండటంతో టీచర్ల సంఖ్య తగ్గించేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి వస్తోంది. తరగతికి ఒక టీచర్‌ను ఇచ్చి అభివృద్ధి చేస్తే ప్రైవేటు పాఠశాలల తరహాలో విద్యార్థులు చేరతారని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కొత్తగా 1నుంచి 10 తరగతులు ఉండేలా కొన్ని పాఠశాలలను అందుబాటులోకి తీసుకొస్తోంది. 1,557 పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతులు పెడుతోంది. అలాగే 1 నుంచి 5 తరగతులు ఉండే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 19వేలు ఉంటాయి. వీటిలో ప్రతి తరగతి ఒక టీచర్‌ను కాకుండా 20 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను ఇస్తారు 20 దాటితే రెండో టీచర్‌ను కేటాయిస్తారు. కేవలం 1, 2 తరగతులు మాత్రమే ఉండే ఫౌండేషనల్ స్కూళ్లు ఐదు వేలు ఉంటాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 1,200 ఉంటాయి. 7,00 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలల చివరి పనిదినాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లను కేటాయిస్తారు. ఇందుకోసం త్వరలో 117జీవోకు ప్రత్యామ్నాయ జీవోను పాఠశాల విద్యాశాఖ జారీచేస్తుంది. అలాగే ఈ నెలాఖరున టీచర్లకు పదోన్నతులు కల్పిస్తారు. పదోన్నతుల అనంతరం వచ్చే నెలలో కొత్తగా చేసిన ఉపాధ్యాయ బదిలీల చట్టం ఆధారంగా బదిలీలు చేపడతారు. మే నెలలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తిచేసి జూన్‌లో బడులు తెరిచేనాటికి టీచర్లను సిద్ధంగా ఉంచాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. బడులు తెరిచే ముందు రెండురోజులపాటు కొత్త సిలబస్‌పై టీచర్లకు అవగాహన కల్పిస్తారు. బదిలీల్లో మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించేవారి కోసం ఈనెల 24 నుంచి 26 వరకు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మెడికల్ బోర్డులు ఏర్పాటుచేయనున్నారు. టీచర్లు అక్కడ మెడికల్ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుంది.



ఈదురుగాలులతో వర్షాలు..
భగభగ ఎండలు

రాష్ట్రంలో వాతావరణ అనిశ్చితి.. నేడు, రేపూ భిన్న వాతావరణం

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వాయవ్య రాజస్థాన్ నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. మరోవైపు కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. వాతావరణ అనిశ్చితి నెలకొని గురువారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లా గోస్పాడు, రుద్రవరంలో 42.5, కడప జిల్లా వేంపల్లెలో 41.5, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 41.4తో పాటు 36 ప్రాంతాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. రెండు రోజులు భిన్న వాతావరణం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం అల్లూరి జిల్లా కూనవరం, చింతూరు మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శనివారం శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో తీవ్రంగా, 83 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది.

పాస్టర్లకు 7 నెలల గౌరవ వేతనం

- 30 కోట్లు విడుదలకు సీఎం ఓకే.. ఒక్కొక్కరికీ 35 వేల వరకూ లబ్ధి

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాస్టర్లకు ఏడు నెలల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. 8,427 మంది పాస్టర్లకు ఒక్కొక్కరికి నెలకు రూ.5,000 గౌరవ వేతనం ఇవ్వడానికి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో 2024 మే నుంచి నవంబరు వరకు రూ.30 కోట్లు విడుదల చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీవో జారీ చేసింది. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఓ ప్రకటన చేస్తూ.. త్వరలోనే క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పాస్టర్ల బ్యాంకు ఖాతాల్లో గౌరవ వేతనాన్ని జమ చేస్తామని చెప్పారు.

ప్రత్యేక మేజిస్ట్రేట్ల గౌరవ వేతనం పెంపు

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్(క్లాస్-2)ల గౌరవ వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నెలకు రూ.30,000 నుంచి రూ.45,000 పెంచినట్లు మంత్రి ఫరూక్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రవాణా ఖర్చుల నిమిత్తం మరో రూ.5,000 నెలకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పెంచిన గౌరవ వేతనం 2019, ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తుందని మంత్రి వివరించారు.

రెల్లిలో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి 516 ఎకరాలు

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రానికి 516.58 ఎకరాల భూమి కేటాయిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు (జీఓ-123) జారీచేశారు. గతంలో విశాఖ జిల్లా ఆనందపురం మండలం జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ కోసం భూమి కేటాయించారు. ఆ తర్వాత ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారు. తాజా భూ కేటాయింపుపై కలెక్టర్ నుంచి ప్రతిపాదన తెప్పించుకొని ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీలో చర్చించారు. ఎకరానికి రూ.27 లక్షల చొప్పున రూ.139.47 కోట్లకు భూమిని కేటాయించాలని తీర్మానించారు. ఈ ప్రతిపాదనను రెవెన్యూ శాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులిచ్చింది. మొత్తం భూమిలో 337.45 ఎకరాలే ప్రభుత్వ భూమి. మిగిలిన 179.13 ఎకరాలు ప్రజల సాగులో ఉన్నాయి. ఈ భూముల్లో పొజిషన్‌లో ఉన్న రైతులకు మరో చోట భూములు కేటాయిస్తామని విజయనగరం కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. ఈ భూమిలోనే 5.34 ఎకరాలకు పరిహారంగా రూ.1.44 కోట్లు అందించాల్సి ఉంటుందని అందులో పేర్కొన్నారు.

టమాటా ధర పతనం

- క్వింటాలుకు గరిష్ఠంగా 1,480లోపే
- గత వారంలో 2,300 వరకు పలికిన రేటు
- గిట్టుబాటుకాక అల్లాడుతున్న రైతులు
- కనీస మద్దతు రూ.1,500గా ప్రకటించాలని డిమాండ్
- హోల్‌సేల్‌గా కొంటున్న మార్కెటింగ్ శాఖ
- రైతు బజార్లలో సాధారణ ధరకు విక్రయం

ప్రధాన మార్కెట్లలో టామాటా ధరలు (క్వింటా రూ.ల్లో)

మార్కెట్	కనీస రేటు	సగటు	గరిష్ఠ
కలికిరి	870	1,100	1,330
గుర్రంకొండ	840	1,040	1,200
మదనపల్లె	800	960	1,430
పలమనేరు	960	1,070	1,360
పుంగనూరు	1,000	1,200	1,480

అమరావతి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెట్లలో టమాటా ధర దారుణంగా పడిపోయింది. గిట్టుబాటు ధరలేక రైతులు అల్లాడుతున్నారు. మార్కెట్లలో క్వింటా కనీస ధర రూ.800గా పలుకుతోంది. గరిష్ఠ ధర రూ.1,480కు మించడంలేదు. గత వారం రోజుల్లో సగటు ధర రూ.1,200లోపే ఉంది. వారం క్రితం గరిష్ఠ ధర రూ.1,800 నుంచి రూ.2,300 వరకు ఉంది. ఐదారు మార్కెట్ యార్డుల్లో ఈ-నామ్ పద్ధతిలో వేలం జరుగుతున్నా.. ధర పుంజుకోలేదు. ఒడిశా, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్‌లో మినహా టమాటాను పండించే రాష్ట్రాల్లో ధరలు ఆశాజనకంగా లేవు. ఈసీజన్‌లో సాగు పెరగడం, పంట చివరికి రావడం, నాణ్యత లేకపోవడం వంటి కారణాల వల్ల టమాటా ధరలు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. టమాటా నాణ్యతను బట్టి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 10-20 మధ్య అమ్ముతున్నారు. తమను ఆదుకునేందుకు క్వింటాకు కనీస మద్దతు ధర రూ. 1,500 ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ధర తగ్గి, ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో మార్కెటింగ్‌శాఖ అధికారులు కొద్ది మొత్తంలో టమాటాలను హోల్‌సేల్‌గా కొని, రైతుబజార్లలో సాధారణ ధరకు విక్రయిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.